RSVM01A168

# గ్రంథాలయసర్వస్వము.

సచిత్ర మాసపత్రిక.

సంపుటము ౧౧ | ఈశ్వర - ఆషాఢము - జూలై ౧౯౩౭ | సంచిక 3

## ఖద్దరు సంస్థాన దశవర్షోత్సవ సంచిక.



ప్రొఫెసర్, జే. సీ. కుమారప్ప గారు,
ఖ. సం. దశవర్షోత్సవ సభాధ్యక్షులు.

సేవాశ్రమ
వాణీమందిరము
పెదపాలెము.

# ఉత్తమగ్రంథముల కానుక

ఆంధ్రదేశగ్రంథాలయసంఘసభ్యులై, చందాలు చెల్లించిన గ్రంథాలయములవారికి మాత్రమే

**I. గీతాభూమిక**

౧౧౮ పుటలు - స్టిఫ్ బైండు - మేలుకాగితము - అమూల్యగ్రంథము. శ్రీ అరవిందయోగీంద్రుని బంగాలి గ్రంథమునకు శ్రీ గొట్టిపాటి వెంకటసుబ్బయ్యగారి తెనుఁగు అనువాదము. ఇది శ్రీ చల్లపల్లి రాజాగారి ఔదార్యమువలన లభించినది, పోస్టేజీ ఉచితము.

**II. కీ. శే. వల్లూరి సూర్యనారాయణరావు, ఓ. ఏ. బి. ఎల్. గారు ప్రకటించిన ఉత్తమగ్రంథములు.**

వీనినిగూర్చి సిఫార్సు చేసియుంటిమి. ఇవి కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ కలాశాలనుంచి రావలెను. మాదగ్గరలేవు.

కార్యదర్శి,
ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము, బెజవాడ.

షరా:— "గీతాభూమిక:" భీమవరము - తణుకు - తాడేపల్లిగూడెము - రేపల్లె - తెనాలి - బెజవాడ - ధర్మవరము తాలూకాలలోని గ్రంథాలయములవారు ఆయా తాలూకా గ్రంథాలయసంఘముల నుండియు, బెజవాడ, గుంటూరు, కాకినాడ, విశాఖపట్టణములలోని గ్రంథాలయములవారు ఆయా పట్టణగ్రంథాలయ సంఘముల నుండియు పై గ్రంథమును పొందగలుగుదురు

---

# గ్రంథాలయ సర్వస్వము

## బెజవాడ.

చందా: ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వపుచందాతో రు 3 లు మాత్రమే.

ప్రతినెల ౨౦-వ తేదీని వెలువడును.

వ్యాసములు:-గ్రంథాలయశాస్త్రము - ఆంధ్ర వాఙ్మయము, ఆంధ్రాభ్యుదయము, జాతీయ పునర్నిర్మాణములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘముల యొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనములు ఇందు ప్రకటింపఁబడును.

పటములు:—గ్రంథాలయ భవనములయు, గ్రంథాలయ సభలయు, గ్రంథాలయ సేవకులయు, సంస్థలయు పటములు ఇందు ముద్రింపఁబడును. ఫోటోలుపంపువారు బ్లాకులఖర్చులు తామే భరింపవలెను. లేదా బ్లాకులుచేయించి పంపవలెను.

### హెచ్చరిక

ఈ పత్రిక ప్రతినెల ౨౦-వ తేదీని వెలువడును; కావున వ్యాసములను పంపువారు ఏ నెల పత్రిక యందు అవి ప్రకటింపవలెనో దాని వెనుకటినెల ౧-వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1-వ తేదీకి పూర్వమే పంపవలయును.

### ప్రకటనముల రేట్లు

| | |
|---|---|
| ఒకసారి 1 పుటకు | రు 20-0-0 |
| ఒకసారి ½ పుటకు | రు 12-0-0 |
| ఒకసారి ¼ పుటకు | రు 6-0-0 |

# గంగావతరణము

(గ్రంథకర్త:— కీ॥ శే॥ సోమరాజు రామానుజరావు గారు)

గంగా గౌరీ సంవాదము, గంగ శివజూటము నధిష్ఠించి నీకు సవతి నాదునని పార్వతితో పంతమాడుట, నారదుని చిత్రలీల, గంగ విష్ణుపాదోద్భవయగుట, భగీరథుడు గంగ నిలాతలమునకు దెచ్చుటకై తపముచేయుట, క్షీరసాగర మథనము, శివుడు గరళపానముచేసి వెఱ్ఱివాడగుట, నారదుని మాయపెండ్లి (హాస్యము), జగన్మోహినీ లీలలు, విషతాపమున శివుని వేదన, గంగా గౌరీ కలహము, నారదుని కలహాశనానందము, విఘ్నేశ్వర ప్రాదుర్భావము, విఘ్నేశ్వరునకు గజముఖము గల్గుట, గంగోత్తరణము మున్నగు శివపురాణగాథలు, చిత్రనాటకరీతి శృంగార హాస్యరస మిళితములై రచింపబడినవి. కవిత్వము ద్రాక్షాపాకము. హాయి గల్గించు కీర్తనలు. రంగస్థలముల కీర్తిగన్న నాటకము. చదివితీరవలెను. వెల రు 1—0—0

# తాజ్ మహల్

(గ్రంథకర్త:— కీ॥ శే॥ సోమరాజు రామానుజరావు గారు)

మొగలాయి దర్బారునందలి విచిత్రకార్యములు, షాజహాన్ చక్రవర్తి పరిపాలనము, నారీపిశాచి యగు రోషనార క్రూరకార్యములు, రాక్షస విహారములు, ఔరంగజేబు కపట ఫకీరువర్తనము, జహానారా ప్రేమతత్వము, ఉన్మత్తత, ముంతాజ్ మరణము, తాజ్‌మహల్ నిర్మాణము, షాజహాను కారాగృహ బంధితుండై ఘోరమరణము గాంచుట, భ్రాతృ, పితృ, శిరస్సోపానమార్గము, రోషనార ఔరంగజేబును అలంఘీర్ బిరుదముతో ఢిల్లీ మయూరాసనము నెక్కించిన సుప్రసిద్ధ చరిత్రాత్మక నాటకరాజము. క్యాలికో బైండు. చిత్రపటశోభితము. పఠనార్హము. వెల రు 1—0—0

# రంగూన్ రౌడి

(గ్రంథకర్త:— కీ॥ శే॥ సోమరాజు రామానుజరావు గారు)

ఆంధ్ర బర్మారాజ్యములందు స్వేచ్ఛావిహారముసల్పి కవికిని నటకులకును యశో, ధన లాభములం జేకూర్చిన 'మా రంగూన్ రౌడి' నెరుంగనివారు లేరు. రౌడీలకెల్ల రౌడి రంగూన్ రౌడి నెరుంగనివారులేరు. రౌడీలకెల్ల రౌడి. సాహసవంతములగు హత్యలు, నిరంతర సురా పానములు, సంసారి వేశ్యా తారతమ్యములులేని శృంగారచర్యలు, అబద్ధములు, అప్రమాణములు మా రౌడికి నిత్యలీలలు. 'రౌడిభార్య పతివ్రత' అను లోకోక్తిచే అన్నపూర్ణాదేవి పతి కొరకై యాత్మబలినిచ్చిన మహాసాధ్విగా చిత్రింపబడినది. గంగారామ జయరాముల హాస్యములు కడుపుబ్బ నవ్వించును. భర్తకొరకై ఆత్మహత్య చేసికొనిన మా రౌడి శంకరరావు విషాదాంత జీవితమే—రంగూన్ రౌడి నాటకముగా కీర్తి గాంచుచున్నది. వెల రు 1—0—0

# విషయసూచిక


| విషయము | | పుట |
| --- | --- | --- |
| అమృతసిద్ధి ... ... | శ్రీ అక్కపెద్ది సత్యనారాయణగారు | ౭౯ |
| కాంగ్రెస్సు ఈనాడు గద్దెయెక్కినది | గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు | ౮౦ |
| ఖద్దరుసంస్థానమునుగూర్చిన అభిప్రాయములు | ... ... | ౮౧ |
| ఖ. సం. ఉద్దేశములు- లక్ష్యము- నిబంధనలు | ఉప్పులూరి వేంకట కృష్ణయ్యగారు | ౮౩ |
| వినిమయము- స్వయంపోషణము-స్థానికోత్పత్తి | ప్రొఫెసర్ జె. సి. కుమారప్పగారు | ౮౫ |
| ఖ. సం. ఆశయములు - కార్యక్రమము | మారేపల్లి వేంకట నరసింహారావుగారు | ౯౦ |
| ఖ. సం. పదిసం॥ముల సంగ్రహనివేదిక | ఉప్పులూరి వేంకట కృష్ణయ్యగారు | ౧౦౦ |
| గుణదల ఖ. సం. గ్రంథాలయము, పదిసంవత్సరముల సంగ్రహనివేదిక | ఉప్పులూరి రామశాస్త్రిగారు | ౧౦౩ |
| గ్రంథాలయములలోని పుస్తకములు - ప్రభుత్వమువారి తనిఖీ | మల్లెల శ్రీరామమూర్తిగారు | ౧౦౫ |
| తాడేపల్లిగూడెము తా॥ గ్రంథాలయ సంఘము-చతుర్థవార్షికనివేదిక ౧౯౩౬-౩౭- | ... ... | ౧౦౭ |
| నాటకోపాధిజీవనులు | దివాకర్ల రామమూర్తిగారు | ౧౦౯ |
| గ్రంథాలయవృత్తాంతములు | ... ... | ౧౧౦ |
| గ్రంథవిమర్శనము | ... ... | ౧౧౩ |
| దుర్గాపూజ - పశుబలిదానము | పండిత మదనమోహన మాలవ్యగారు | ౧౧౪ |
| సంపాదకీయములు | ... ... | ౧౧౫ |



## సంపూర్ణ
## ఉత్తర ఖండ యాత్ర

ముక్కాని తపాలాబిళ్ల పంపినయెడల గ్రంథాలయములకును, ఉత్తరదేశయాత్రలు చేయ దలచినవారికిని ఉచితముగా పంపెదను.

**అల్లూరి నారాయణరాజు**

పోడూరు, నర్సాపురము తా., ప. గోదావరిజిల్లా.

## వైతాళికులు

170 ఉత్తమగీతములు

25 గురు ఆధునికకవుల రచనలలోనుండి ఏర్చికూర్చిన

## రత్నములు

వెల 1—8—0

ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, బెజవాడ.

సేవాశ్రమ
వాణీమందిరము
పెదపాలెము.

## ఖద్దరు సంస్థానమువారు — వారి అభిమానులు



౧ వ వరుస — ధర్మకర్తగారి వెనుక నిలువఁబడినవారు శ్రీయుత ఉప్పలూరి రామశాస్త్రిగారు (శిక్షణనిలయ కార్యదర్శి)

౨ వ వరుస — కూర్చున్నవారు ౧ శ్రీయుత మారేపల్లి వేంకటనరసింహారావుగారు (౩ వ పట్టీ సభ్యులు) ౨ శ్రీయుత తుమ్మల బసవయ్యగారు ౩ శ్రీమతి తుమ్మల దుర్గాంబగారు ౪ శ్రీయుత గొల్లపూడి సీతారామశాస్త్రిగారు (ఈ ముగ్గురు వినయాశ్రమసభ్యులు) ౫ శ్రీయుత ఉప్పలూరి వేంకటకృష్ణయ్యగారు (స్థాపక ధర్మకర్త) ౬ శ్రీయుత పిన్నమనేని వెంకయ్యగారు ౭ శ్రీయుత మఠం బాలసుబ్రహ్మణ్య గుప్తగారు.

౩ వ వరుస — కూర్చున్నవారిలో ౩ వ వారు శ్రీమతి ఉప్పలూరి మహాలక్ష్మమ్మగారు (౧ వ పట్టీ; ఈమె రు ౨౫౦౦ లు విలువగల తన స్త్రీధనపు హక్కును సంస్థానమునకు చెందఁజేసినది.

# ఖద్దరుసంస్థాన దశవర్షోత్సవసంచిక.

ఏ సంస్థకును లేని 'సంస్థానము' తోడి పేరు ఈ ఒకసంస్థకే వచ్చినది. దీనికి కతమేమి? కవిత్వశక్తియా? కేవలముగా కాదు; సంస్థాపకులగు మ. రా. శ్రీ ఉప్పులూరి వేంకటకృష్ణయ్యగారి త్యాగశక్తి వలనిది! ఈ పేరు గాంధిమహాత్మునే. మెప్పించినది!! సార్థకమగుచున్నది!!! ఎట్లు? అందురా?

ఇది చిన్నసంస్థ అయినను స్వయంపోషకము కాని, చందాలమీఁద బ్రిదుకునదికాదు. దానికి తోడు వందలకొలఁదినేకాక, వేలకొలఁదిని కూడ కానుకలు ఇచ్చినది! లోకశాంతికి పనిచేయు ఆదర్శకసంస్థ అగుటకు పాటుపడుచున్నది. డబ్బు వెచ్చించుచున్నది. ఏదీ ఇట్టిసంస్థ మఱి ఒకటి?

దీనికిని నాకును దైవికముగా పొత్తుకలిగినది. ౧౯౩౮ సం॥ములో ఇందుండిన యిరువురు కుఱ్ఱవాండ్రినుబట్టి ఈ సంస్థకు వచ్చి, ధర్మకర్తగారితో మాటలాడితిని. ఆయన వ్రాసిన ట్రస్టుదస్తావేజు చూచితిని. ఖద్దరుసంస్థానమును ఇష్టదేవతగా సంబోధింపఁజేసిన - ఆయనత్యాగశక్తిజనితకవితాశక్తికిఅలరితిని. దీనిస్థిరత్వమునకు నేను ఏమేని తోడ్పడ వీలగునేమో! చూతమని, దీని బెజవాడమందిరమున సుమారు ౧ నెల బసచేసియుంటిని. అపుడు ధర్మకర్తగారు నాపొత్తుకోరిరి. దీనిశిక్షణనిలయమునకు నేను గౌరవాధ్యక్షుఁడనైతిని. కొన్నిసలహాలు చెప్పితిని. పిదప గాంధిమహాత్ముఁడు దీనిస్థితిని పరికింపఁగోరఁగా శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు వచ్చి, పరికించి, ఇంచుమించుగా నేను చెప్పినట్లే సలహాలుచెప్పిరి. తమ పరీక్షాఫలమును మహాత్మునికి నివేదించిరి. ఇట్లు మా కిరువురకును దీనితో ఏర్పడిన పొత్తు నానాఁటికి పెరుఁగుచునే ఉన్నది. ౧౯౩౯ సం॥ నవంబరునెలలో విశాఖపట్టణమున బహిరంగసభలో ధర్మకర్తగారుచేసినఆహ్వానము ననుసరించి ౧౯౩౬ జూనునెలలో ఎలమంచిలినుండి కుటుంబముతో బెజవాడకు వచ్చివేసితిని. దాన దీనితోడినాపొత్తు మఱికొంత హెచ్చినది. ఖద్దరువాఁడ నగుట నాకు ఉండుటకు ఇల్లిచ్చి, సన్నాదరించి తోడ్పడునది ఖద్దరుసంస్థానమే అయినది.

ఇది ఇట్లుండ, నాకు ఈ సంస్థతో పొత్తు కుదురుట కనుపట్టుచుండిన శ్రీ అయ్యంకి వేంకటరమణయ్యగారు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘముతోకూడ నాకు పొత్తు కలిగింప కడంగి, ౩౬ మార్చిలోనే దాని సేవా సారస్వత శాఖలకు అధ్యక్షునిగాను, బెజవాడకు నేను వచ్చిన పిదప కార్యనిర్వాహకసంఘమునకు అధ్యక్షునిగాను, నన్ను ఎన్నుకొనఁజేసిరి. శ్రీ వేంకటకృష్ణయ్యగారును నేనును మాటలాడుకొని, ఆం. దే. గ్రంథాలయసంఘమునకు తోడ్పడఁదగు ననుకొంటిమి. గ్రంథాలయ సర్వస్వ ప్రకటనోపసంఘమువారు (శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, శ్రీఅయ్యంకి వేంకటరమణయ్యగారు) తమ ఉపసంఘమందును, సంపాదక వర్గమందును, నన్ను సభ్యునిగా ఎన్నుకొనిరి. పిదప శ్రీ వేంకటకృష్ణయ్యగారిని, ఉప్పులూరి రామశాస్త్రిగారిని (శిక్షణనిలయకార్యదర్శి)కూడ మా ఉపసంఘమున సభ్యులుగా చేర్చుకొంటిమి. అప్పటికే ఖ. సం వారు ఆం. దే. గ్రం. సం. కార్యస్థానము పెట్టుకొనుటకు ఉచితముగా ౬ నెలలు స్థల మిచ్చుటకును, తక్కినసదుపాయములు చేయుటకును ఒప్పుకొనిరి; ప్రకటనశాఖోపసంఘము వారికి జీవకారుణ్య సంఘముతో పొత్తు కలిగించిరి. క్రిందటి సెప్టెంబరునుండి ఈ ఏప్రిలు వఱకును పెట్టుబడి పెట్టిరి. తమ గుణదల గ్రంథాలయమును ఆదర్శ గ్రంథాలయముగా చేయు

టకు పూనుకొని, పనిచేయుచున్నారు. గడవు గడచినను ఉచితముగానే తమ గాంధివిలాసమున కార్యస్థానమును ఉంచుకొన నిచ్చుచున్నారు. ఇట్లు ఈ సంస్థవారు ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమునకును, గ్రంథాలయసర్వస్వమునకును చేయు సాయమును గుర్తించి, ప్రకటనోపసంఘము వారు తమ కృతజ్ఞతను తెలుపుటకు, దశవర్షోత్సవము తమకు వీలుకలిగింపఁగా, ఈ నెలసంచికను ఖద్దరుసంస్థానదశవర్షోత్సవ సంచికగా ప్రకటించినారు.

ఈ సంస్థానము తన స్వయంపోషణ సిద్ధాంతము ననుసరించి మార్పిడివిధానమే ముఖ్యసాధనముగా అవలంబించి అభివృద్ధిపొంది, సర్వేశ్వరానుగ్రహమున లోకశాంతికి మార్గదర్శి కావలెనను తనఆశయము నెఱవేర్చుకొనుఁగాక!

మారేపల్లి రామచంద్రశాస్త్రి.

## ఖద్దరుసంస్థానము - పట్టీల ప్రాముఖ్యము

ఖద్దరుసంస్థానమువారు మానవులను గుఱించి చేసిన పట్టీలనిర్ణయము అతిముఖ్యమైనది ... ప్రపంచములోని జాతిమత వర్ణములలోని ద్వేషములు పోఁగొట్టుటకును, 'ఇంపీరియలిజమ్, ఫాసిజమ్, కమ్యూనిజమ్, సోషలిజమ్' అనుపేర్లతో జరుగుచున్న వివిధ ఉద్యమములను సమన్వయము చేయుటకును ఈపట్టీవిభజనము ఎక్కువగా ఉపయోగపడఁగలదు... ఒకటవపట్టీలో చేరఁదగినవారికే శాసనసభ్యత్వము, ప్రజాప్రాతినిధ్యము, ప్రపంచసభలప్రాతినిధ్యము ఉండుట మేలు. ప్రపంచములో శాంతిస్థాపనమునకు ఇట్టిస్థితి కలుగుట అవసరము.

మఠం బాలసుబ్రహ్మణ్యగుప్త.

## విదేశవాణిజ్యము -- మార్పిడివిధానము

హిందూదేశపు బియ్యము యూరోపుఖండములో దిగుమతి అగుట తగ్గిపోవుచున్నది. ఇది జాగ్రతగ గుర్తింపవలసి యున్నది. యూరపులోని రాజ్యములలో ముఖ్యముగ ఇంగ్లీషువారి రాజ్యములలో వారు ఉత్పత్తిచేయు వస్తువుల ఎగుమతికొఱకు నూతనముగ వస్తుమార్పిడి విధానమును అవలంబించుచున్నారు. అనఁగా పూర్వోత్తరమగు వస్తుప్రతిఫలములతో కూడిన వ్యాపారము చేయుచున్నారు. ఇటీవల ఇంగ్లీషువారు యూరోపుదేశములో పెక్కు ఇతరరాజ్యములతో చేసికొన్న వ్యాపారసంధిపత్రము లన్నిటిలోను ఈవస్తుమార్పిడి పరతు (Compensatary participation trade) ప్రధానమంత్రముగ ఏర్పడియున్నది. యూరపులో పక్వపదార్థములు తయారుచేయు రాజ్యములవారు ముడిపదార్థములు ఉత్పత్తిచేయు రాజ్యములతో ఇట్టిపరతు చేర్పఱుచుకొనుట ఇప్పటి హిందూదేశపు వ్యాపారమునకు ప్రతికూలముగ నున్నది. ఇందువల్ల వచ్చు ఆపదలను ఏదోయొకవిధముగ ఎదుర్కొనక తప్పదు.

ఎస్. ఎన్. గుప్త.
ఐ. సి. యస్.,

హాంబర్గు (జర్మనీ) లోని ఇండియాప్రభుత్వ పర్తకప్రతినిధి.

7

# గ్రంథాలయసర్వస్వము.

సంపుటము ౧౧ | ఈశ్వర - ఆషాఢము - జూలై ౧౯౩౭ | సంచిక 3

సంపాదకులు:
గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎం. ఎ.
మారేపల్లి రామచంద్రశాస్త్రి.
అయ్యంకి వేంకటరమణయ్య.

## అమృతసిద్ధి

శ్రీ అక్కపెద్ది సత్యనారాయణగారు

శ్రీలు పొంగులువారినజీవగడ్డ
కళలు మిసమిసలాడిన కామధేను
వమృతరసములు పండిన కమలవనము
భారతము ప్రాణికోటికి ధారకంబు.

* * *

తిమ్మఁ బమ్మని బమ్మని దిమ్మఁజేయు
అభినవసృష్ట రససిద్ధుడైన కవికి
ప్రాణదానంబు సేయు టే మబ్బురంబు ?
కవిమహత్త్వంబు సుకవికే గ్రాహ్యముకద.

* * *

గేహకృత్యంబులందు నుత్సాహ మూని
తనకు తానై సమస్తంబు తరలజేయ
పదము కదపక సిగపూవు వాడకుండ
అత్తవారింటిక్రొత్తల్లు డయ్యె గురుడు.

* * *

కడుపు చెరుపయిపోయి దుఃఖంపుటలలు
తరుముకొనివచ్చి ముంచెత్తి ధైర్యపటిమ
రాల్ప నైగాశ్యధూమనైల్యములు క్రమ్మ
తెల్ప నిట్టుల తండ్రితో దేవయాని.

* * *

మండువేసగి వడగాడ్పు టెండ తగిలి
మాడిపడిపోయినట్టి లేమావిగున్న
చలువతొలకరిచినుకుల మొలకరించి
పసిమిమిసమిసమని జీవరసముతొలగె
గున్నమావిని పెనవైచుకొని పెరిగిన
మాధవీలతకూన సొమ్మసిలిపోయె
భాగధేయము పండి శోభావిలాస
భాసురంబయి యానందపదము ప్రాకె.

* * *

ఇంద్రియవిలోలతకు ప్రధానేంధనమ్ము
కీర్తిమర్యాదలకు ధూమకేతుపదము
ఆయురారోగ్యభాగ్యాపహారణభూత
మట్టిసుర నేవివేకి సమాదరించు?

* * *

ప్రకృతిరాహస్యములలోతులకునుదిగిన
వాడెవడు? వెల్గుదారులజాడలందు
చిమ్మచీకటిరేకులు చిక్కనయ్యె
గాఢతామిస్రగర్భాన కళలు పండె.
శుభమునంచులలోన నశుభము మణుగు
అశుభపుంగమ్ములందున నణగు శుభము
పడుగుపేకలు నొండొంట పరిణమింప
వసన మింపయి కల్గు నద్వైతసిద్ధి.

* * *

# కాంగ్రెస్సు ఈనాడు గద్దె యెక్కినది

శ్రీ గా. హరిసర్వోత్తమరావుగారు, ఎం. ఏ.

నినలేనికష్టాలు ఎన్నియో ఓర్చి
ఏరములుగ పోరాడి ధైర్యాన నిలిచి
బిడ్డలను బలియిచ్చి పెద్దగా పెనగి
కాంగ్రెస్సు ఈనాడు గద్దెయెక్కినది.
రైతుసోదర ! నీవు రాజ వయ్యేవు;
కూలిసోదర ! నీవు కొలువుదీరేవు;
రా వేగ, రా వేగ, రా వేగ నీవు;
కో వేగ, కో వేగ, కో వేగ హక్కు;
పేరు రాజాజీది; పెద్ద గాంధీజీ;
కాని రాజ్యము వారు కాదు ఏలేది;
ఏలేది నీవేను; ఏలేది నీవే ॥రా వేగ॥

కాంగ్రెసులో చేరి కలుసుకో వేగ,
యువకుడు నీవైన యువతి నీవైన,
కులము నీ దేదైన, గోత్రమేదైన,
మతము నీదేదైన, మాట యేదైన,
అడ్డమెన్నడు రాదు; అది తెలుసుకొమ్మ.
నీయూరికాంగ్రెసును నీవు పెంచితివా?
నీయూరి కాంగ్రెసు నిన్ను పెంచీని;
నీవు కాంగ్రెసు చేరి నిలిచినావంటే
నిన్ను కాంగ్రెసు రాజు చేసి విడిచీని ॥రా వేగ॥

గాంధీజి చెప్పేటి కర్మమార్గాలు
కార్యసాధనకెంతో గట్టిమార్గాలు
కాంగ్రెసుమెంబరు గా చేరు వేగ
ఖద్దరునే కట్టి కనుము శాంతమ్మ;
మతపిచ్చిలో పడక మరలుకోవయ్య!
వర్ణాలభ్రమలను వదలుకోవయ్య!
అస్పృశ్యదోషంబు అరికట్టవయ్య!
ఇవి మెట్లులయ్యరో యెక్కిపోవుటకు ॥రా వేగ॥

అక్షరజ్ఞుడ వీవు అయితీరవాలె;
పూర్తివోటును నీవు పొందితీరాలె;
పరదేశవస్తువును పారదోలాలె;
నీదేశవస్తువులు నీవు వాడాలి
కూడుగుడ్డకు నీకు కొదువలేనట్టి
విద్యల నేర్పంగ విధులు పన్నాలి;
ఆకలి అప్పులఆర్తి లేనట్టి
ఆర్థికమార్గాల అరసి వేయాలి ॥రా వేగ॥

రాటము వడికేటి రామక్కతల్లి!
గద్దెక్కుమంటాడు గాంధీజి మొదట
పంచాయితీరాజ్యపాలనమె నాకు
పరమపదమంటాడు పండితుడు నెహ్రు;
గ్రామంబులో ఉండు కాంగ్రెసుకమిటీ
రాజు కావాలంట రాజాజి కిపుడు
ఇన్నికోరికలెల్ల ఏనాడొ కోరి
భంగపాటుల కోర్చి బాధల కోర్చి
హరి నీకు వీటిని అందిచ్చినాడు. ॥రా వేగ॥


## ప్రకృతి - బెజవాడ

ఆరోగ్యవిషయిక సచిత్ర వైద్యమాసపత్రిక.

మానవుడు ఆరోగ్యవంతుడుగ నుండుట, రోగములు రాకుండుట, నీరు, గాలి, మట్టి, సూర్యకిరణ, స్వాభావికాహార, యోగవ్యాయామ, ఉపవాస, విద్యుత్కాంతశక్తి మొదలగువాని సహాయమున రోగములను కుదుర్చువిధానములను తెలుపును. చందాదారులకు ప్రకృతివైద్యపుస్తకములన్నియు తగ్గింపుధరల కియ్యబడును. చందా రు. ౨ లు.

ఖద్దరుసంస్థానమునుగుఱించియు దానిఆశయములనుగుఱించియు పెద్దలును పత్రికలును తెలిపిన

# అభిప్రాయములు

"శ్రీగాంధిమహాత్మునిఆజ్ఞానుసారము నేను ఖద్దరుసంస్థానకార్యక్రమమును పరిశీలించుచున్నాను...... ఈసంస్థ స్వయంపోషకమైయున్నది. ....ఖద్దరు స్వావలంబనవిధానమును పూర్తిగ నెఱవేర్చినది...సంస్థ కళాపరిపూర్ణమైయున్నది. ఇందులో చేసిన పట్టీలనిర్ణయము పూర్వవర్ణవిభజనసూత్రములను పోలియున్నది........... వస్తుమార్పిడివిధానము విరివిగా ప్రచారము కాదగియున్నది.......ఇందులో అన్ని పట్టీలవారు విధేయతతో కార్యక్రమందు పాల్గొనుచున్నారు."

గొల్లపూడి సీతారామశాస్త్రి.

"ఈ కార్యక్రమము బాగుగా ఆకళింపు చేసికొనుటకు నాకు మంచి అవకాశము కలిగినది... నిరుద్యోగసమస్యాపరిష్కారముకొఱకు పరిశోధనములు చేయువారికిని, ముఖ్యముగ విద్యార్థులు, ధనవంతులు, బీదలు, మతబోధకులు, రైతులు, వర్తకులు, పారిశ్రామికులు, ఋణగ్రస్తులు, ఋణదాతలు తెలిసికొనవలసిన అమూల్యములగు విషయములు పెక్కులు ఇందు కలవు......... ...ప్రజలఆర్థిక- నైతిక- సాంఘికములలో శాంతి ఈ కార్యక్రమము యొక్క ఆచరణ- గ్రహింపు మీద ఆధారపడియున్నదనుటలో నాకు సందేహము లేదు."

సి. రాజగోపాలచారి, బి. ఏ., బి. ఎల్.,
అడ్వొకేటు, బెజవాడ.

"ఖద్దరుసంస్థానము మొదటినుండియు కేవలము ఖద్దరు ఉత్పత్తిచేయు సాధనముగ మాత్రమేకాక ఎంతోవిశాలమైన ఆదర్శముతో అనేక సంవత్సరములనుండి కృషిచేయుచున్నది. ధనసంప్రదాయము( money economy )క్రింద మానవులు పొందుచున్న కష్టములను గుఱించి ఒకబెజవాడకు, ఆంధ్రదేశమునకు, హిందూదేశమునకు మాత్రముగాక, ప్రపంచమునకంతకును వర్తించు స్థిర సిద్ధాంతమును కనిపెట్టుటకు యత్నించుచున్నది.......ధనవిధానము మనలను అందనిలోతులో దింపినది. సక్రమముగ నడవజాలని విక్రయాంగణములను పెంచినది. ఈదుష్పరిణామ మంతయు తొలగించుటకు వస్తువినిమయ విధానమే (Barter system)—వస్తువిచ్చి వస్తువు పుచ్చుకొనుటయే-సత్వరసాధనము. ఈ ఖద్దరుసంస్థానము ధనవిధానములో ఉండు చెడుగులనుగుఱించియే వానినుండి తప్పించుకొను ఉపాయ మన్వేషించుచు మానవుల అవసరములకనుగుణ్యముగా వస్తువులు ఉత్పత్తిచేసి వినియోగపఱచువిధానములను కనిపెట్టుటకు ప్రయత్నములు చేయుచున్నది."

జె. సి. కుమారప్ప.
అఖిలభారతగ్రామపరిశ్రమలసంఘ కార్యదర్శి.

"ప్రపంచములోని ఆర్థికవేత్తలు పెక్కుమంది ఇప్పటి దుస్థితిలో వస్తుమార్పిడివిధానమే శరణ్యమని నిశ్చయించిరి. ... ఖద్దరుసంస్థానము ఈ నిశ్చయమునకు పూర్వమే ఈ విధానమును ఆచరణలో పెట్టుట గుఱింపబడియున్నది. వస్తుమార్పిడి విధానము అమలునందున్న దేశమును ఎవరుపాలించినను ప్రమాదములేదు. అట్టిదేశములు ఇతరదేశస్థుల నాణెపువిధానముల వల్ల వంచింపబడజాలవు. ఇది ఒక ముఖ్యమగు సమస్య. ఇప్పుడుహిందూదేశములోనివ్యవసాయదారులకు వస్తుమార్పిడివిధానము చేపట్టుటతప్ప మఱియొక గత్యంతరము లేదు. ప్రభుత్వము రెవిన్యూచట్టము మార్చి సిస్తులక్రింద రైతుల

నుండి పాలుపద్ధతిని సరకులను పుచ్చుకోవలెను. వ్యవసాయదారులు తాము పండించు సరకులను పరటా యిచ్చి తమకు కావలసినవస్తువులను తీసికొనవలెను. ఈ వస్తుమార్పిడి విధానమును గుఱించి నేను వ్రాసిన ('The world prices and the collapse of capitalism') అను గ్రంథములో విపులముగవిమర్శించియున్నాను...

టంగుటూరి ప్రకాశం.

ఖద్దరు సంస్థానములో ఆచరించుచున్న వస్తుమార్పిడిని నేను అతిశ్రద్ధతో పరిశీలించితిని. రొక్కమిచ్చి సరకులను కొనుటకు బదులు వస్తువులకు వస్తువులనిచ్చుపద్ధతి ప్రవేశపెట్టి గ్రామములకు ఈసంస్థ అమూల్యమగు సేవ చేయుచున్నది...."

బాబు రాజేంద్రప్రసాద్.
కాంగ్రెసు అధ్యక్షుడు.

"వస్తుమార్పిడివిధానములో నాకునమ్మకము కలదు......వస్తుమార్పిడివిధానమును చేపట్టి గ్రామస్థులు తమకు కావలసినవస్తువులను తమ వస్తువులిచ్చి పుచ్చుకొనునప్పుడే గ్రామోద్యమము ఫలప్రదమగును."

ఎమ్. కే. గాంధి.

"ధనసంప్రదాయమువిూద ఆధారపడిన ఆర్థికవిధానము విఫలమైనది......గృహములలోను, అంతర్జాతీయ విక్రయాంగణములలోను వ్యాపారమందంతటను వస్తుమార్పిడివిధానము ఆచరణలోనికి రాఁగలదు; ఇది బాధ్యత తెలియని ఆందోళనాపరులవాదము కాదు; ప్రఖ్యాతి చెందిన ఆర్థికశాస్త్రవేత్తలయు, నిర్మాణనిపుణులయు నిశ్చితసిద్ధాంతము.

జవహర్‌లాల్ నెహ్రు.
కాంగ్రెసు అధ్యక్షుడు

"వస్తువుల మార్పిడివిధానముపట్ల నాకు ఎక్కువ నమ్మకము కలదు"

కిషోరీలాల్ మష్రూవాలా.

"డబ్బులేమిలో దళారులనల్ల గ్రామస్థులు మోసగింపఁబడకుండుటకు వస్తువుల మార్పిడి విధానము ఉత్తమమార్గము"

పి. సి. రే.

"రాబోవు కొలదిసంవత్సరములలో వస్తువుల మార్పిడివిధానము విరివిగ వ్యాప్తినొందక తప్పదు" యస్. డబ్లియు అలెగ్జాండరు.

"ఖద్దరుసంస్థానము ఎటుల పనిచేయుచున్నదియు వివరముల గాంచినయెడల భారతదేశమంతయు ఈ విధముగ విభజనమై స్వయం సమృద్ధితో దనరారజాలదా యను నాలోచన గలుగకపోదు.............ఇది ఆదర్శపూర్వకమగు సంస్థ............ఇప్పుడున్న మారకపు రేటులతో పని లేకుండ నిత్యవ్యవహారము వస్తుమార్పిడిద్వారా జరుగుచున్నయెడల స్వయం పూర్ణముగ దేశ మభివృద్ధి కాగలదని నిస్సంశయముగ జెప్పవచ్చును............కట్టుకొనుటకు గుడ్డ, తినుటకుతిండి ఈరెంటిని సమకూర్చుమార్గముల నిట్టిసంస్థలే నిర్ణయింపగలవు; ఇందు ఖద్దరునకు ప్రాధాన్యము కలదు; ఇతరగ్రామపరిశ్రమలు కలవు; విద్యాప్రదానముకలదు; గ్రంథాలయము కలదు............"

ఆంధ్రపత్రిక.

శాంతిను ద్దేశించు జాతీయ ప్రభుత్వము తన రైతులనుండి పన్నులకిందధాన్యము, గోదుమలు, కొబ్బరికాయలు, దూది, వేరుసెనగ మొదలగు పదార్థములు తీసికొనును...... ఇట్టివిధానమువలన నాణెపువిధానములో జరుగుచున్న దురాగతములనుండి తప్పుకొనఁగలుగుదురు". ఇండియన్ ఎక్స్‌ప్రెస్.

# ఖద్దరు సంస్థానము

## ఉద్దేశములు – లక్ష్యము – నిబంధనలు

స్థాపితము : శాలివాహన శకము ౧౮౪౯ సంవత్సరమునకు సరి అయిన ప్రభవనామసంవత్సర చైత్రి బ ౨ సోమవారము; ది ౧౮—౪-౧౯ ౨౭.

ఉద్దేశములు : శాంతిస్థాపనము, నిరుద్యోగనివారణము, నిష్కామకర్మనిరూపణము.

సాధనములు: వ్యవసాయము, ఖద్దరుపరిశ్రమ, ఇతరపరిశ్రమలు, వస్తువులమార్పిడి, జాతీయవిద్య.

లక్ష్యము : స్వయంపోషణము, కార్యక్రమవ్యాప్తి. ఈ సంస్థాన కార్యక్రమాభివృద్ధికొఱకు ది 2-3-3౨, ౨2-2-33, ౨2-౪-32 తేదీలను ధర్మాదాయపుదస్తావేజులు వ్రాయఁబడినవి.

అవి అమలు జరుపుటకు ఈ దిగువ నిబంధనలు చేయఁబడినవి.

నిబంధనలు.

౧. ఈఖద్దరుసంస్థానములో చేరువారు వారి వారి గుణకర్మలను బట్టి జాతిమతవివక్షత లేక ఈదిగువపట్టీలలో చేర్చుకొనఁబడెదరు.

(౧) తమ ఆస్తిఅంతయు ఈసంస్థకు ఇచ్చి తమకుఁగాని తమసంతతికిఁగాని ఆస్తి హక్కులు కోరకుండ ఆస్తిలేమిలోఁ గల శాంతియందు నమ్మకము కలిగి దీనికార్యక్రమముకొఱకు జీవితమును ధారపోసి నిరంతరము కృషిచేయువారిని ౧టవ పట్టీలోను,

(౨) తమ ఆస్తి తమవారికి చెందచేసి తమ జీవితకాలములో ఆ ఆస్తిపరిపాలనకు పోక, దీని కార్యక్రమాభివృద్ధికొఱకు ఇందు ఉండి నిరంతర కృషి చేయువారిని ౨ వ పట్టీలోను,

(3) ఈకార్యక్రమములో సంపూర్ణామోద విశ్వాసములుంచి, దీనిఆర్థికశాఖలలో పెట్టుబడి పెట్టి, తమవంతు లాభనష్టములకు బాధ్యులై, దీని నిబంధనలకు లోఁబడి, ఆస్తులు సంపాదించుకొని - ఆదాలు చేసికొనుచుండువారలను 3 వ పట్టీలోను,

(౪) శరీరకష్టముమీఁద ఆధారపడి, వస్తువుల మార్పిడివిధానముక్రింద జీతములు పుచ్చుకొని - ఆదాచేసికొనవలెనను కుతూహలముతో దీని కార్యక్రమ నిబంధనలకు లోఁబడి కృషి చేయువారిని ౪వ పట్టీలోను చేర్చుకొనవచ్చును.

౨. ౧వ పట్టీలో చేరి, 3౫ సంవత్సరముల పై వయస్సు గలిగి గృహస్థుగా ఉండువారు ఈ సంస్థకు ధర్మకర్తగా ఉండవలెను. ధర్మకర్తకు దీని కార్యక్రమాభివృద్ధికి వలయు అన్ని పనులను చేయుటకు అన్నిహక్కులును కలవు. అత్యవసరపరిస్థితులలో వానప్రస్థుఁడుగాని సన్న్యాసిగాని ధర్మకర్తగా ఉండవచ్చును.

౩. అమలు జరుపుచున్న ధర్మకర్త తన తరువాతి ధర్మకర్తను నియమింపవచ్చును. అట్లు జరుగనిచో ౧ వ పట్టీలో ౩౫ సంవత్సరములవయస్సునకు మించినవారిలో అధిక సంఖ్యాకుల సమ్మతిమీఁద ధర్మకర్త నియమింపఁబడవలెను. అట్లు జరుగుటకును అవకాశము లేనియెడల ఈ సంస్థలో ౧౦ సంవత్సరములు శిక్షణముపొంది ౧౮ సంవత్సరములు వయస్సుగల వారందఱును అధికసంఖ్యాకులసమ్మతినిబట్టి తమలోఅర్హతగల ధర్మకర్తను ఎన్నుకొనవలెను. అట్లుకూడ జరుగనప్పుడు దేశములో నున్న చట్టముల ననుసరించి అర్హతగల ధర్మకర్త యేర్పడవలెను.

౪. ౧ వ పట్టీలోని స్త్రీలకు ఆస్తులయందుఁగల హక్కులు వారిఅనంతరము ఖద్దరు సంస్థానమునకే చెందవలెను. అవి వారి జీవితములో అన్యాక్రాంతము చేయ కూడదు.

౫. ౧-౨ పట్టీలలోపుట్టుపిల్లలను శ్రీబాబు రాజేంద్రప్రసాద్ గారు ప్రారంభించిన రాజేంద్ర విద్యావిధానములోచేర్పవలెను. ౩-౪ పట్టీలవారి పిల్లలనుకూడ ఇందు చేర్పవచ్చును. ఈసంస్థ క్రింద శిక్షణమిచ్చి వీరిని అభివృద్ధిలోనికి తేవలెను.

౬. ఈకార్యక్రమములో చేరువారందఱును శాంతిస్థాపనమునకు సత్యమును అహింసయు ప్రధానములని ఎంచవలెను. అవి సాధించుటకు ఏకపత్నీవ్రతమును, పాతివ్రత్యమును, శాకాహారమును, నియమితాహార విహారములును తోడ్పడుననియు, దుర్వ్యసనరాహిత్యము అవసరమనియు గుర్తింపవలెను. ఇందును గుఱించి నిరంతరప్రచారము ఉండవలెననియు, ఆలక్ష్యముతో తరతరములుగా ప్రచారముచేయుటకు ఏర్పడునియమములు రక్షింపవలెననియు, గుర్తింపవలెను. ఇందులో ఏభాగములోనైనను విరుద్ధవిశ్వాసము గలవారితో చేరి సంస్కరించుటకు ధర్మకర్తకును, వారి అనుమతిపొందు ౧ వ పట్టీవారికిని, అవకాశములు కలవు.

౭. ఈ సంస్థలో చేరిన ప్రతివారును విధిగా ఖద్దరు ధరించువారై యుండవలెను. వ్యక్తులు తమలో తాము వడ్డీలు ఇచ్చి పుచ్చుకొనరాదు. ప్రతివారును మార్పిడివిధానమును చేపట్టి వస్తువులలో లావాదేవీలు ఉంచుకోవలెను. స్త్రీపురుషులందఱును భాషాజ్ఞానము కలిగియుండవలెను. ఒకటి రెండు చేతివృత్తులలో జీవనము చేయఁగల ప్రవీణత సంపాదింపవలెను.

౮. దీని కార్యక్రమములో ఇప్పటి ధర్మకర్త చేయుప్రధాననియమములు ౧ వ పట్టీలో ౩౫ సంవత్సరములు వయస్సు మించినవారు ౬౦ మంది సభగా చేరి యయినను, సర్వసమ్మతిమీఁద ఉత్తమపురుషులని ప్రఖ్యాతిపడసి ౧ వ పట్టీవారికి తుల్యులగు కనీసము ౫ గురి సలహాపొందియయినను, మార్పవచ్చును. అధికసంఖ్యాకులతీర్మానము ననుసరించి, ప్రధానసూత్రములకు విరుద్ధముగాని ఉపనియమములు చేయుటకును మార్చుటకును యుక్తవయస్కులు అనఁగా ౨౧ సం॥రముల వయస్సు గల సంస్థానములోని వారి కందఱకును అవకాశము కలదు.

౯. దీనినియమముల ననుసరించి ౩, ౪ పట్టీలలోనున్న వారు ౧, ౨ పట్టీలలోనికి చేరవచ్చును. ౧, ౨ పట్టీలవారు అనర్హతవల్లఁగాని, అభిప్రాయములు మాఱుటవల్లఁగాని ౩, ౪ పట్టీలలోనికి మాఱవచ్చును.

౧౦. ఏపట్టీలోనైనను ౨౧ సం॥రములవయస్సు మొదలుకొనికాని, అంతకుమించినవయస్సులోఁగాని ఈ సంస్థలో ప్రవేశించి, దీనియోగక్షేమములనిమిత్తము ౩౦ సం॥రములు సత్ప్రవర్తనముతో కృషిచేసి నిరాధారముగా నున్నవారిని జీవితశేషములో ఖద్దరుసంస్థానము భరించును.

# వినిమయము - స్వయంపోషణము — స్థానికోత్పత్తి

[ఖద్దరుసంస్థాన దశవర్షోత్సవ సమయమున అఖిలభారత గ్రామపరిశ్రమల సంఘ కార్యదర్శి ప్రొఫెసరు జె. సి. కుమారప్పగారు ఇచ్చిన ఉపన్యాససారాంశము—

గుంటూరు - ది 23-6-32.]

ఖద్దరుసంస్థానము మొదటినుండియు కేవలము ఖద్దరు ఉత్పత్తిచేయు సాధనముగ మాత్రమే కాక ఎంతో విశాలమైన ఆదర్శముతో అనేక సంవత్సరములనుండి కృషిచేయుచున్నది. ధనసంప్రదాయము (money econamy) క్రింద మానవులు పొందుచున్న కష్టములను గుర్తించి, ఒక బెజవాడకు, ఆంధ్రదేశమునకు, హిందూదేశమునకు మాత్రముగాక ప్రపంచమునకంతకును వర్తించు స్థిరసిద్ధాంతమును కనిపెట్టుటకు యత్నించుచున్నది. అందువలన మనము నివారింపవలసిన కష్టములను గుఱించి యోచించుటకు కొంతకాలము వినియోగింతము.

నాగరికతాభివృద్ధితో కర్మవిభాగము (Divison of labour) అని వార్యమైనది. కాని అది మితి మీఱిన యెడల సౌష్ఠవము చెడి, కుశలత్వ వినాశమునకు హేతువగును. ప్రతిఅవయవమును శరీరమునుండి విడఁగొట్టుటకు వీలు కాని భాగమనియు, ఒక అవయవమునకు చికిత్స చేయునపుడు శరీరమునంతను పరీక్షించుట అవసరమనియు గుర్తింపక, చికిత్సచేయఁ బూను ప్రత్యేకావయవచికిత్సానిపుణునకు అవయవమందలివ్యాధి విపరీతముగ కనిపించుటయేకాక అతనిపద్ధతియు అపజయ మొందక తప్పదు. కార్మికుని వ్యక్తిత్వమును, అతని నావరించుకొనియుండు పరిస్థితులను గుర్తింపక కర్మవిభాగమును మితి మీఱునట్లు మనము వదలి వేయరాదు. యుక్తమైన హద్దులలో కూడ కర్మవిభాగవిధానములో వస్తువినిమయము (వస్తువుల మార్పిడి) నకు అవసర మేర్పడుచున్నది. ఒండొరులకు లాభకారియైనచో ఆవినిమయము సక్రమమగును. అదియే న్యాయమైన వర్తకమునకంతకును పునాది.

వస్తువులమార్పిడి సాధనమేకాని సంపద కాదు.

సాధారణముగ వస్తువులను వస్తువులకు మార్చుకొనుచుందుము. ఒకవస్తువును ఉత్పత్తి చేయువానికి వేరొకవస్తువు కావలసివచ్చినప్పుడు అది ఉత్పత్తిచేసినవానికి తనవస్తువునిచ్చి తనకు కావలసినవస్తువును తీసికొనును. ఇది సహజమైన మార్పిడి. కాని విక్రయాంగణము పెరిగి వర్తకాభివృద్ధిలో క్లిష్టపరిస్థితు లేర్పడినకాలఁదిని ఈ మార్పిడిని సులభసాధ్యముచేయుటకు వాహకము (Medium) అవసరమగును. ఇట్టిఅవసరము వల్లనే కొన్నిచిహ్నాలు, కొన్నివస్తువులు, కొన్ని లోహములు చెలామణిసాధనములుగ అమలులోనికివచ్చి, తుట్టతుదకు నేడుమనకుచిక్కులుకలుగఁజేయుచున్న ధనసంప్రదాయముగ అది పరిణమించెను. ఈ విధానము వస్తువుల మార్పిడికి సహాయముగ నుండుటకు బదులు లాభాసక్తులకు ఆర్జనసాధన మైనది. అందువలన సాధనమే సంపదగా మాఱినది - అనఁగా మార్పిడి విధానోద్దేశము మఱుఁగుపడి వికృతాకార మేర్పడినది.

కొన్ని లోహములు సహజముగ విలువ గలవై యుండును. అట్టి లోహములతో చేయఁబడిన నాణెములు నశింపవు; కాని ఏ భోగ్య వస్తువుల మార్పిడికొఱకు ఈ నాణెము లేర్పడినవో ఆవస్తువులు కాలక్రమమున విలువ తగ్గి

నశించుచుండును. అందువలన నశించుభోగ్యవస్తువులను విక్రయించువాఁడు చిక్కులలో పడుచున్నాఁడు. నశింపని లోహపునాణెములు గలవాఁడు అధికలాభమును పొంది, బలవంతుఁడగుచున్నాఁడు. దానినిబట్టి ధనము నిలువచేయవలెనను కాంక్ష పెరుఁగుటయు, భోగ్యవస్తువుల వినియోగము తగ్గుటయు, ధనము విరివిగ చెలామణిలో ఉండకపోవుటయు తటస్థించుచున్నవి.

వస్తువుల ధరలు తగ్గుచున్నకొలఁదిని లోహరూపకమైన ధనమువలన ఋణస్థునకు భారమును, ఋణదాతకు లాభమును పెరుఁగుచున్నవి. ధనముయొక్క పంపకములోని వ్యత్యాసముల వలన ఇప్పు డున్న అసమానత్వము - అనఁగా బీదవానిలేమికిని భాగ్యవంతుని కలిమికిని గల తేడా మఱింత అధికమగుచున్నది.

### వస్తువుల ఉత్పత్తికిని, వస్తువుల వినియోగమునకును ఉండు భేదము.

పైని తెలిపిన లోపములతో పాటు కేంద్రీకృత వస్తూత్పత్తి విధానముల (Centralised methods of Production)లో హెచ్చువిలువగల యంత్రసామగ్రి అవసరమగుటచేత మఱింత ద్రవ్యము చెలామణినుండి తొలగింపఁబడుచున్నది. ఈ ఉత్పత్తివిధానములో పనిచేయువారి కిచ్చు జీతములు వారి జీవితావసరముల కొఱకు తయారుచేయఁబడువస్తువులను తయారుచేయుటకైనను చాలకున్నవి. దీనికి కారణము, వీరి కొనుగోలుశక్తినుండి కొంతభాగము మూలనిధులు, క్షేమనిధులు, మరమ్మతులు మొదలగు వాని క్రింద వినియోగింపఁబడి అట్టి మొత్తము చెలామణిలోనికి రాకుండ ఆటంకపఱుపఁబడుటయే. ప్రపంచములోని యిప్పటి ఆర్థికదుస్స్థితికిఁ గలముఖ్యకారణములలో ఇదిఒకటి. ప్రవహించిన కొలఁదిని బలమును, వేగమునుసంపాదించునదివలె ప్రజలఆర్థికజీవనము సాగవలెనన్నచో ఉత్పత్తి అయినవస్తువులనన్నిటిని అనుభవించుటకు తగినంత సౌకర్యము నేర్పఱచుట ఆవశ్యకము. ఇది ప్రజల కొనుగోలుశక్తిని వృద్ధిచేయుటవల్ల జరుగునే కాని తగ్గించుటవల్ల జరుగఁజాలదు. ప్రజలు గొంతుక ఎండిపోయి, బాధపడుచున్నారు. చెఱువు తియ్యనినీటితో నిండియున్నది. అయినను బంగారుపాత్ర ముండిననే కాని ఆనీరు గ్రహింపరాదనుశాసనముండుటచే ప్రజలు డప్పిక బాధ తీర్చుకొనఁజాలకున్నారు. ఇప్పటి ధనసంప్రదాయములో మనస్థితి అట్లే ఉన్నది. బంగారుగిన్నె లేనిది చెఱువులో అడుగిడరాదని బోధించిరి. అదే తగిన మార్గమనుకొని మనమును దానికి అంగీకరించితిమి.

ఈసువర్ణపాత్రమును సాధనముగ నిడికొని దాహము తీర్చుకొనఁగల వాంఛకే ఆర్థికశాస్త్రజ్ఞులు సార్థవాంఛ (Effective demand) అందురు అట్టి వాంఛను తృప్తిపఱచుటకే ఇప్పటి ఆర్థికవిధాన ముద్దేశింపఁ బడినది కాని సహజముగ దప్పికగొన్నవారి వాంఛను తీర్చుటకు కాదు.

### ఉద్యోగమును కుంభించుట - పనిని అందకుండ చేయుట.

ఇప్పటి దుస్స్థితికి మఱియొక ముఖ్యకారణమున్నది. బ్యాంకులు మొదలగు పరపతిసంస్థలు ఉత్పత్తి చేయువారికొనుగోలుశక్తిని అభివృద్ధిచేయుటకు కలిగించుచున్న అధికతర సౌకర్యములు, కొనువారి కొనుగోలుశక్తిని అభివృద్ధిచేయుపనికివచ్చుటలేదు. అందుచే ప్రజలలో వస్తువులను అనుభవించుశక్తి మఱింత క్షీణించినది. ఇట్లు ఎంతో నేర్పుతో ఏర్పఱుపఁబడిన ధనసంప్ర

దాయములో ఇతరులకు వృత్తికలుగఁజేయుశక్తి నంతను పెట్టుబడిదార్లు తమ గుప్పిలిలో పెట్టుకొని యున్నారు. బానిసలుగనుండి తమచిత్తము ననుసరించి పనిచేయువారీఉద్యోగములను పంచుచున్నారు. నానాఁటికి పరిశ్రమలన్నియు ధనికుల చేతులలోనికి పోవుచున్నవి. కేంద్రీకృత మగు ఉత్పత్తి విధానములవలన యంత్రసామగ్రి, మరలు మొదలగువానిమీఁది పెట్టుబడి అధికమగుచున్నది. పెట్టుబడిపెట్టి ఎవరు యంత్రములను నడపుచున్నారో వారి చేతులలోనే ఇతరులకు ఉద్యోగము పంచిఇచ్చు అధికారము చిక్కియున్నది.

ధనసంప్రదాయములో కొనుగోలుశక్తి ఒకచోటనుండి మఱియొకచోటికి సులభముగ మార్పవీలగును. భారతదేశప్రభుత్వమువంటి కేంద్రీకృత ప్రభుత్వము తన ఆదాయమునంతను పట్టణములలోను, నగరములలోను ఖర్చుపెట్టుచున్నది. గ్రామములనుండి ఆదాయమును హెచ్చుగా లాగి పట్టణములను భాగ్యవంతము చేయుచున్నది. వస్తువులధరలను క్రమముగ నిర్ణయింపక చెలామణిలో నున్నసొమ్మునకు మాత్రము పరిమితుల నేర్పఱచుచున్నది. ఈ అన్ని కారణములచేతను బీదవాఁడు మఱింత బీద యగుచున్నాడు. ధనికుఁడు మఱింతధనికుఁ డగుచున్నాఁడు.

గ్రామస్థులకు కలుగు ఫలితము

మనదేశములో గ్రామములే హెచ్చు. ఇప్పటి ఆర్థికవిధానము మన వ్యవసాయదారులకు ఎట్లు వర్తించుచున్నదో తెలిసికొనవలెను. గ్రామస్థులు స్థానికముగా తమవస్తువులను మార్చుకొనునపుడు ధనసంపద మార్పులులేక నిలిచిపోవును. చుట్టుప్రక్కగ్రామములలో ఇట్టిమార్పులుచేసికొన్నను వారి సంపదకు నష్టము ఉండదు. కాని గ్రామస్థులు తమకున్న కొనుగోలుశక్తిని తమకెన్నఁడును చేయఁబడనిసేవలకుఁ గాని, లేదా తమ కత్యంతావశ్యకములు గాని వస్తువులకుఁ గాని మాఱకముచేసినపుడు వారంతకంతకు బీదలగుచుందురు. దేశీయశాసనసభలలో వ్యవసాయదారులమొఱ వినువారు లేరు. వారు ప్రభుత్వమునకు అర్పించు కొనుగోలుశక్తిపై అనఁగా పన్నులను వినియోగించువిధానముపై వారి కేమియు అధికారము లేదు. మఱియు విదేశస్థులనుండి తాము వస్తువులను కొనునపుడును న్యాయమైన ప్రతిఫలముతో కూడినబేరము జరిగినదను నమ్మకము లేదు. తమదేశపు సరిహద్దులలో అనేక ఆటంకములు కలిగింపఁబడినవి. వానిని తప్పుకొనుటకు వీరికి తగినశక్తిలేక ఆనేర్పరులవలలో చిక్కుకొనుచున్నారు. సామాన్యముగ వ్యవసాయదారులందఱు అప్పులపాలై యున్నారు. ధరలు తఱిగినకొలఁదిని వారిబరువు మెండగుచున్నది. వారికి పెక్కు చిక్కులు కలవు. సాధారణముగ మానవులకు సహజమగు పేరాశను పురస్కరించుకొని దళారులు (Middle men) డబ్బుకొఱకు అమ్ముకోఁదగిన పంటలను (Money erops) పండింపవలెనని వ్యవసాయదారులను ప్రోత్సహించుచున్నారు. ఇందువలన జీవనాధారములగు పంటలు లేక పీరు ఉపద్రవములపాలగుచున్నారు. పెట్టుబడిదారుల యంత్రశాలలకు ముడివస్తువుల నందించు బానిసలుగ వీరు తయారగుచున్నారు. తమ తిండికిని, స్థానికపరిశ్రమలకును వలయుపదార్థములను పండింపక కొంచెము ధరఎక్కువవచ్చునని ఆశపడి డబ్బుకై పంటలను పండించి తమ స్వాతంత్ర్యమును కోల్పోయి ఈవిధముగ తుదకు నాశన మగుచున్నారు. సంయుక్తప్రాంతములోని రైతులు ౨౭ లక్షల రూపాయలవిలువ కల చెఱకుగడను తగులఁబెట్టు

కొనవలసి వచ్చెనని గతవారము పత్రికలో వ్రాయఁబడినది. ఫాక్టరీవారికి సప్లయిచేయు నుద్దేశించి వారీపంటను పండించిరి. ఫాక్టరీవారికి ధర గిట్టుటలేదనివారు కొననిరాకరించిరి. రైతుల కాసరకును వినియోగముచేయుగత్యంతర మగపడక ఆ చెఱకుగడనంతను తగులఁబెట్టుకొవలసి వచ్చెను. ఇదంతయు మానవతంత్రములవల్లనే జరిగినది.

నగదుగా చెల్లింపఁబడు పన్నులవలన అనిశ్చితమైన ఉత్పత్తిలోనుండి నిశ్చితమైనభాగము వ్యవసాయదారులు కోల్పోవుచున్నారు. పంట రూపముననే ప్రభుత్వమువారు పన్నులను తీసికొన్నయెడల గ్రామస్థులకును వ్యవసాయదారులకును ఎంతోమేలు కలుగును. ఆధునిక విక్రయ పద్ధతులలోని చాకచక్యమువల్లను, కలుగుఒత్తిడివల్లను, వ్యవసాయదారులు తమకు తృప్తి కలిగింపని ప్రతిఫలమునకు తమ కొనుగోలు శక్తినంతను వదలుకొనుచున్నారు. విదేశముల నుండి చౌకగా వచ్చు వస్తువులను వారు కొని నిరుద్యోగమును, వినాశమును తామే తెచ్చిపెట్టుకొను చున్నారు. తమ దేశమునకు ఏవిధముగను ప్రతిఫలము తిరిగిరాని దూరస్థమైన విక్రయాంగణములలోనిసరకులను ఖరీదుచేయుట వలన అట్లు ఖరీదుచేయువారికే దారిద్ర్యమును నిరుద్యోగమును కలుగుచున్నవి. సమానత్వము మీఁద విక్రయాంగణములు పెరిఁగి, స్వార్థమున కేర్పడు కట్టుదిట్టములు సడలనంత వఱకును సమీపమందున్నఉత్పత్తిస్థానములలోనే మనము కొనుచుండవలెను. ఎగుమతి చార్జీలు, సుంకములు, ప్రత్యేకజాతీయ ముద్రికలవిధానములు మొదలగు అడ్డంకులు చెలరేఁగు చున్నంతవఱకును అంతర్జాతీయ వర్తకమును గుఱించి మాట్లాడుట వట్టిపొరపాటు. అవివేకులను మోసగించుటకు తీయనిపల్కులు పల్కుచుందురు. కనుక జాగ్రతవహించి మనము స్థానికముగా ఉత్పత్తియైన వస్తువులలో తప్ప ఇతర వస్తువులలో వ్యాపారము చేయరాదు.

### నిజమైన విలువలు - ఉద్దేశ్యము

వస్తువులయొక్క విలువలు ప్రజలఉత్పత్తిశక్తిపై ఆధారపడియుండును. సాంఘికావసరమును బట్టి వస్తువులవిలువలపరిమాణ మేర్పడవలెను. ఇప్పటి విధానమువలన అట్లుగాక నాణెములలో ప్రతివస్తువునకు విలువగట్టవలెనని మనము నేర్చుకొంటిమి. మానవావసరములనుబట్టి వానికియ్యఁదగిన విలువలు మనదృష్టిలోనే లేవు. కార్మికులు ఉత్పత్తిదారులుగ పరిగణింపఁబడక, వస్తువులకు కట్టుచున్న విలువలకువలెనే వారికృషికి కూడ విలువకట్టఁబడుచున్నది. శరీరకష్టమనున దెంతమాత్రమును లేక, ఇతరుల కొనుగోలుశక్తిని తమ గుప్పిలిలో నుంచుకొనువారికే సంఘములో గౌరవమేర్పడినది. క్రమమైనపరిమాణ మేర్పడిన యెడల సంఘమునకు నిజమగు సేవ చేసినవారికే గౌరవముండవలెను. అట్లుగాక ఈవిపరీత సిద్ధాంతములవలన ధనము ప్రోగుచేసికొనినవారికే సంఘములో గౌరవ మేర్పడునను దుర్భ్రమ జనించుచున్నది. అందువలన కొలఁదిమందిచేతులలో ధనము పేరుకొనిపోయి, ఇతరుల స్వాతంత్ర్యమునకు విఘాత మేర్పడుచున్నది. ధనము విపరీతముగ ఒకచోట కూడుకొనినపిమ్మట, అది బయటికి ప్రవహించుటకు అంతర్జాతీయఋణము లేర్పడుటచే వానిమూలమున తుదకు యుద్ధములతో పరిసమాప్తినొందుటయుజరుగుచున్నది. ఒకచోట ధనము పేరుకొనునట్లుచేయు ఈధనవిధానమే అంతర్జాతీయ ఋణములకు త్రోవతీసినది. ఇది సాగినంతవఱకు శాంతికొఱకు చేయు

అన్వేషణము వృథయే అగును. ఇతరుల కొనుగోలుశక్తి నంతను తమవశము చేసికొనువారికే సంఘములో గౌరవమున్నంతవఱకు వస్తువులను వినియోగించుశక్తియు కోరికయు తగ్గి, తుదకు ఉత్పత్తి అధికమై, ఆర్థికదుస్థితి ఏర్పడును.

## ధనము - యుద్ధము

ధనవిధానముక్రింద జరుగుఉత్పత్తి సాంఘికావసరములను నిర్లక్ష్యముచేసి, హెచ్చులాభములు వచ్చుపద్ధతులనే అనుసరించును. అందువలన అత్యంతమేధావంతు లందఱును ప్రజల అవసరములను తీర్చుసాధనోపాయములను విచారించుటకుగాక, ఒకజాతిని మఱియొకజాతిక్రింద అణచియుంచుటకు ఆధునికసంహారసాధనసామగ్రిని కనిపెట్టుటలో తమశక్తినంతను వినియోగించుచున్నారు. జనవినాశమున కుపయోగపడు విషవాయువులు ప్రేలుడుగుండ్లు మొదలగువాని ఉత్పత్తిప్రయోగములక్రిందనే ఎక్కువ పరిశోధనములు జరుగుచున్నవి. పరపీడనమునకును, పరులకృషి వారికి చెందకుండ తమ స్వార్థమున కుపయోగపడుటకును పెట్టుబడిదారులు ధరలు నిర్ణయించుచున్నారు. ఉత్పత్తివలన ధనము అధికముగ సంపాదించుటకే ఉద్దేశించుచున్నారు కాని ప్రజల అవసరములను తెలిసికొనుటకు ప్రయత్నములైనను జరుపుటలేదు. మనదేశములో జీవితావసరములగు వస్తువులఉత్పత్తికి శ్రద్ధవహింపక విలాస వస్తువులఉత్పత్తిలో చొరబడి ప్రజలు నిరుద్యోగమును పెంపుచేయుచున్నారు. విదేశవర్తకమే నాగరికతకు ఉత్కృష్టస్థితిగా ఎంచి, ఎన్నికష్టనష్టములనైనను భరించి, దానినే సాగించుటకు కృషిజరుపుచున్నారు. నిరాఘాటముగ ఈనాశనము కొనసాగుటకు బంగారమునకు విలువపెంచి అత్యున్నతస్థానమున దాని నధిష్ఠించినారు. దేశములమధ్య సహజమగు మాఱకపుప్రమాణము ఆయాదేశముల కరెన్సీ విధానములను బట్టి, ఆయాదేశములలో నుండు కొనుగోలుశక్తి పరిమితి ప్రకారము నిర్ణయింపబడవలెనేకాని వేఱువిధముగ నిర్ణయింప వీలులేదు. బంగారు ప్రమాణమును విడనాడిననాటినుండియు ఈవిషయము నిస్సందేహముగ రుజువైనది.

## సమాప్తి

ఇప్పుడు మనము గ్రహించినదేమి? ఈవచ్చని లోహమును - బంగారమును - మనము గ్రుడ్డిగా అనుసరించినయెడల ననేకకష్టనష్టములపాలుగాక తప్పదు. కొనువారిని, అమ్మువారిని సమాన స్థితియందుంచి వినియోగశక్తిని పెంపొందింపవలె నన్నచో భోగించు వస్తువుల నశ్వరత్వమునకును, మాఱకపు వాహకము (medium of exchange) నకును సమన్వయ మేర్పరుపవలెను. నిలువచేయుటకంటె వినియోగమును ప్రోత్సాహపఱచుటచేతనే ఐశ్వర్యము బాగుగా పంపిణీ కాగలదు. అట్లు జరుగవలెనన్నచో వస్తువుల విలువలను కట్టు విషయములో మన దృక్పథము మాఱవలసియున్నది. వ్యక్తులలాభములు పెంపుచేయుదృష్టితోగాక, మానవాభివృద్ధిని గుర్తించి వస్తుపరిమాణములను నిర్ణయింపవలెను; మన క్రయవిక్రయములను చాలభాగము తగ్గింపవలెను. దూరప్రదేశములనుండి వస్తువులను కొనుట మానివేయవలెను.

ఉత్పత్తివిషయమున ఏర్పఱుచు విపరీత విధానములవలన వ్యక్తిప్రయోజనములన్నియు ధనికబృందము (Oligarchy) నకు అర్పితమగుచున్నవి. వస్తువినియోగమును ఎట్లు నడపవలెననునదియే నేడు ఉన్న ముఖ్యమగు సమస్య.

ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తిని గురించి జాగ్రత్తపడఁగలరని గత శతాబ్ది చరిత్ర తెలుపుచునే యున్నది.

ఆర్థికస్వాతంత్ర్య మున్నప్పుడే జాతులమధ్య సమానత్వ మేర్పడఁగలదు. అసమానత్వము యుద్ధములకు దారితీయును. అంతర్జాతీయసిద్ధాంతములని నేఁడు ప్రచారము చేయఁబడుచున్నది వాస్తవముగ అధికతమ జాతీయసిద్ధాంతము. (Super internationalism)అనుదానికి మాఱు పేరై యున్నది. అనఁగా ఇతరజాతులన్నిటికంటె మించినహోదా సంపాదింపవలెననుట. యూరోపుఖండమందలి జాతులన్నియు ఈఅధికతమ జాతీయతకొఱకై పోరుచున్నవి. ప్రతిజాతియు ఇతర జాతులనన్నిటిని మించియుండవలెనని వాంఛించుచున్నది. అందువల్లనే యుద్ధసన్నాహములు జ్వరవేగముతో జరుగుచున్నవి. అంతర్జాతీయఋణములు అంతరించి ప్రతిజాతియు తనస్థానికమగు ఉత్పత్తి, తనవినియోగమునకు మాత్రమే క్లుప్తపఱుచుకొననిచో శాంతి ఏర్పడఁజాలదు. ధనవిధానము మనలను అందనిలోతులో దింపినది. సక్రమముగ నడుపఁజాలని విక్రయాంగణములను పెంచినది. ఈదుష్పరిణామ మంతయు తొలగించుటకు వస్తువినిమయ విధానమే(Barter system) వస్తువిచ్చి వస్తువు పుచ్చుకొనుటయే సత్వర సాధనము. ఈఖద్దరు సంస్థానము ధనవిధానములో ఉండు చెడుగులను గుర్తించియే, వానినుండి తప్పించుకొను ఉపాయ మన్వేషించుచు, మానవుల అవసరముల కనుగుణమగు వస్తువులు ఉత్పత్తిచేసి వినియోగపఱచు విధానములను కనిపెట్టుటకు ప్రయత్నము చేయుచున్నది.

# ఖద్దరుసంస్థానము

## ఆశయములు-కార్యక్రమము

### ఉపోద్ఘాతము

మానవసంఘము ఐహికాముష్మికములకు ఎంతకాలము కృషిచేయుచుండునో అంతకాలమును దీనికార్యక్రమము నడచుచుండవలెననియే సంస్థాపకుని ఆశయము. ప్రారంభమునుండియు ఆయనయే ధర్మకర్తగా ఉండి ఇప్పటి వఱకును కార్యక్రమమును నడపుచున్నారు.

మానవసంఘములో శాంతిస్థాపనముకొఱకు అనేకపద్ధతులు అవలంబించిరి. అవి కాలక్రమమున మొదటి యుద్దేశములను వదలి పెడమార్గములను త్రొక్కుటయు, అందువలన మానవులలో ద్వేషములును కలహములును ప్రబలి, మానవసంఘమందు అశాంతి ప్రబలుటయు ఆమస్థితినుండి మానవులను తొలఁగించి తిరిగి శాంతి నెలకొల్పుటకు తగిన కృషులను జరుపుటయు చరిత్రాత్మకము.

ఖద్దరు సంస్థాన కార్యక్రమమును గురించి ఆలోచించుటకు ముందు ఒకసూక్ష్మాంశమును గుర్తింపవలసియున్నది. వైద్యుఁడు రోగికి ఔషధసేవచేయించుటకు ముందు రోగి కుండు రోగమును గుర్తింపవలెను. రోగమును గుర్తింపకయే యిచ్చుమందు లన్నియు వృథా యగును. అట్లే మానవశాంతి నుద్దేశించి చేయు ఏకార్యక్రమములోనైనను మానవశాంతికిని అశాంతికినిగల మూలకారణములను మొదట గుర్తింపవలెను. అట్లు గుర్తింపక చేయుపనులెల్ల వ్యర్థమగును.

కాన మొదట మానవచిత్తవృత్తులను తెలిసికొనవలయును. ఇది ఊహలవల్లను, పుస్తకములను పఠించుటవల్లను గ్రహించుటకన్న ప్రత్యక్షపరిశోధనములవల్ల అనుభవములోనికి తెచ్చుకొని, గ్రహించుట మేలు. ప్రారంభమునుండియు ఆ విధానమవలంబించి ఖద్దరుసంస్థానము మానవచిత్తవృత్తులను గ్రహించి, మానవశాంతికొఱకు అవలంబింపవలసిన కార్యక్రమము నిరూపించియున్నది. ఇట్టికార్యక్రమము మానవసంఘమునకంతకును సంబంధించినదిగా ఎంచవలెనేకాని, ఒక ప్రాంతమునకుఁగాని, ఒక దేశమునకుఁగాని, ఒక సంఘమునకుఁగాని ఒక మతమునకుఁగాని, ఒక వర్ణమునకుఁగాని, సంబంధించినదిగా ఎంతమాత్రము ఎన్న కూడదు. ఈవిధానములో సాధించి నిర్ణయించిన సూక్ష్మధర్మములను మొత్తము మీఁద మానవసంఘము అవలంబించుటవలన శాంతికి మార్గ మేర్పడునా? లేదా? అనువిషయమును తేల్చుటవలననేదీని కార్యక్రమమువలనిఫలాఫలములు నిర్ణయింపవలసి యుండును. ఇట్టి నిర్ణయము శాంతిస్థాపనముకొఱకు కృషిచేయు అనుభవశాలులును, ప్రభుత్వమును, మతవర్ణోద్ధారకులును, ప్రజాసమూహములును తమతమ సూక్ష్మబుద్ధులచే పరిశీలించి, గ్రహింపఁగలుగుదురు.

### సృష్టివైచిత్ర్యము

శాంతియుఆనందమును మానవునకు స్వాభావసిద్ధములు. ధనేచ్ఛయు, కామేచ్ఛయు, అధికారవాంఛయు, మమకారమును, మానవునిచిత్తస్వభావమునకు సర్వకాలసర్వావస్థల యందును అడ్డుతగులుచు, దానినిఅశాంతికి దించుచుండును.

### మానవశక్తి

ఈస్థితిని గుర్తించి, పైఅడ్డును తప్పుకొని మానవులశాంతిభద్రతలను కాపాడఁగలుగువారు మానవసంఘములో పదిలక్షల కొక్కరైనను ఉండరు అనునదే ఖద్దరుసంస్థానము తనపరిశోధనములవలన స్థిరపఱచిన ముఖ్యసారాంశము. అందుచేత మానవసంఘ శాంతి భద్రతలకొఱకు సిద్ధపఱచు నిర్మాణ కార్యక్రమము లన్నిటిలోను ప్రతిమానవుఁడును పైనిచెప్పిన ధనాధికార మమకారములతో కూడిన ప్రకృతిచే వంచింపఁబడి, అశాంతికి జాఱి, తనశాంతిస్వభావమును కోలుపోయినవాఁడుగానే నిశ్చయించుట క్షేమకరమనియు, ఇట్టితరిని మానవశాంతిని కాపాడుటకు సిద్ధపడు మానవులకు అగ్నిపరీక్ష యుండవలెననియు, ఖద్దరుసంస్థానము తలంచుచున్నది. అట్టిపరీక్షకు మొదటిమెట్టు, ఆస్తిలేమి యందలినమ్మకమే(Faith in Non-Possession of Property) అని ఖద్దరుసంస్థానము నిర్ణయించినది. ఆనిర్ణయమునకు అనుగుణముగా కార్యక్రమాభివృద్ధికొఱకునియములలోఉదాహరించిన రీతిగా నాలుగు పట్టీల విభాగము చేయఁబడినది.

మానవప్రకృతికి సహజ మగుపరిణామమును పొందఁదలఁచిన వారందఱును ఈ పై నాల్గు పట్టీలలో ఏదో ఒకదానిలోనైనను చేరవలసియుందురు. ప్రత్యక్షముగా చేరినను, చేరకపోయినను, అట్టిఅర్హతగలవారందఱును శాంతికాములనియే వీరియుద్దేశ్యము. అంతేకాదు. ఒకటవ పట్టీలో చేరుటకు మానవసంఘములో పదిలక్షలకొకరు కూడ దొరకుట దుర్లభమనియు, రెండవపట్టీలో చేరుటకు లక్ష కొకరుకూడ ముందుకు రారనియు, మూఁడవపట్టీలో చేరుటకు నూటికి ఐదుగురు సైతము దొరకుట కష్టమనియు ఈసంస్థ పూర్తిగా గుర్తించియున్నది.

ఒకటవపట్టీలో చేరుటకు అర్హత నొందఁజాలనివారు మానవశాంతి భద్రతలను కాపాడుటకు తగియుండఁజాలరనియు, మానవ శాంతి

నుద్దేశించి పనిచేయు ప్రభుత్వశాసనసభయుండైనను, మతసంఘసంస్కరణాదిసభలయం దైనను ప్రజలప్రాతినిధ్యము వహించుటకు ఒకటవ పట్టీవారి అర్హతకు తగ్గనివారే ఉండుట అత్యావశ్యకమనియు, ఖద్దరుసంస్థానమువారిఉద్దేశము. ఇట్టివిధానమునకు తగినవాతావరణము దొరకువఱకు ప్రపంచములో శాంతికి తావు ఉండదని వారికి నమ్మిక.

## శాంతిసాధనములు

మానవసంఘములో శాంతిస్థిరపడుటకు సత్యమును, అహింసయు అత్యవసరములు. అవి సాధించుటకు మానవులలో ఏకపత్నీవ్రతమును, పాతివ్రత్యమును ఎక్కువగా అనుకూలించును. అవి నిలుచుటకు శాకాహారనియమితాహారవిహారములును, దుర్వ్యసనరాహిత్యమును తోడ్పడఁగలవు. పై సిద్ధాంతములనుబట్టి ఆచరించుటలో మానవసంఘమంతయు ఉత్తీర్ణత పొందినను, పొందకపోయినను, ఆసిద్ధాంతములనుగుఱించి ప్రజలలో నిరంతరప్రచారము జరుగుచుండవలెను. అవి పుస్తకములవలనను, తాత్కాలిక ప్రదర్శనములవలనను బోధింపవచ్చును. కాని ప్రత్యక్షాచరణమువలననే అవి మఱింతసులభముగ బోధపడును. తరతరములుగ ఆచరించువారలవలన వానియందు లక్ష్యమును,నిపుణత్వమును పెరుఁగుచుండును. ఇట్టిస్థితి కలిగి నిలుచుటకు వలయు నియమములు సంఘముకాని, ప్రభుత్వముకాని, రక్షింపవలెను. కాన తరతరములనుండియు శాకాహార మవలంబించువారికిని, తరతరములనుండి వితంతువివాహములును విడాకుల యేర్పాట్లును లేనివారికిని, అట్టివిధానముల ఆచరణయందు తదితరులకంటె కొంత సౌలభ్యముండును. అందుచేత అట్టివిధానములరక్షణమునకు ఖద్దరుసంస్థానము పూనుకొని పనిచేయుచున్నది. ఈ విధానములో చెఱుగుడులు ప్రబలి మానవసంఘమున దురాచారము ప్రబలకుండ చూడవలసిన ఆవశ్యకతకూడ గుర్తింపఁబడియున్నది. శాంతిస్థాపనముకొఱకు పైనిచెప్పిన సత్యాహింసాదులన్నియు, ఒకటవ పట్టీవారి గృహస్థజీవనములో ప్రత్యక్షపఱచుచుండుటయే ఖద్దరుసంస్థానమువారిసాంఘికవిధానము. తక్కిన పట్టీలవారితో సంఘర్షణము కలుగకుండునట్లు ఇందలివిధానము తయారుచేయఁబడియున్నది.

## వృత్తివిధానము

మానవ జీవితమునకు అన్నమును, బట్టయు ప్రధానావసరములు. అవి మానవునిస్వయం సహాయమువలన ఉత్పత్తి అగుటకును, ఒకరి నిపుణత్వమును మఱియొకరు ప్రత్యక్షముగా మార్చుకొనుటకును అవకాశములు ఉండుట శాంతివిధానమునకు అత్యావశ్యకము. ఏకారణముచేతనైననేమి? అట్టి ఉత్పత్తికిని మార్పిడికిని ఇప్పుడు విఘాత మేర్పడియున్నది. మానవుని జీవితావసరవస్తువులకు యంత్రాలయము లేర్పడుట, ఆవస్తువులు దూరప్రదేశములలో తయారగుట, వారి విడుదలకొఱకు జనబాహుళ్యముగల ప్రదేశములను స్వాధీనపఱచుకొనుట, ఆ ఉత్పత్తిని ఒకరియొద్దనుండి ఒకరు మార్చుకొనుటకు నాణెములవిధానమేర్పడుట మొదలగునవి ఇపుడు వాడుకలో ప్రబలియున్నవి. యంత్రాగారముల యేర్పాట్లవలన ప్రజలలో ఒకవైపు నిరుద్యోగము ప్రబలుటయు, ఒకవైపు దురాశ ప్రబలుటయు, సరకు అమితముగ ఉత్పత్తియై ప్రజలకు కొనుగోలుశక్తి లేక ఆ సరకు స్తంభించి పోవుచుండుటయు, ప్రజలలో లావాదేవీలకు ఏర్పడిన నాణెములవిధానము ఆ సరకుల పంపిణీని నిర్వర్తింపఁజాలక దుర్వినియోగ పఱుపఁబడు

టయు, అందువలన ప్రపంచములో అశాంతి హెచ్చి, నివారణోపాయములకు ఎన్నిసంఘములు పెట్టినను, ఎన్నిపరిశోధనములు చేసినను, దారి కనఁబడక నివ్వెఱపోవుటయు, మనము ప్రత్యక్షముగా చూచుచున్నాము. ఈ దుస్థితి అంతయు మానవజీవితావసరవస్తువులను ఉత్పత్తిచేయుటకు అవలంబింపఁబడిన కేంద్రీకరణ (Centralisation) విధానమువలన కలిగినదని ఖద్దరుసంస్థానము నిశ్చయించినది. మోటారుకార్లు, రోడ్లు, రైళ్ళు, ఆనకట్టలు, విద్యుచ్ఛక్తి బ్యాంకులు, నాణెములు, రేడియోలు, సినిమాలు, ఫ్యాక్టరీలు, మొదలగు ఇప్పటి నాగరకచిహ్నములన్నియు పై కేంద్రీకరణవిధానమును పెంచుటకొఱకే వచ్చినవని వారినమ్మకము వీని నన్నిటిని గ్రామాదులలోనికి ప్రాకింపఁజూచుటయు దాని చిహ్నమే అనియు, గ్రామస్వయంపోషణమును గూర్చి తలపెట్టక పశుపోషణము మొదలగు సమస్యలవంకకు ప్రజలమనస్సులు త్రిప్పుట కేంద్రీకరణవిధానమును పెంచుటకొఱకే అనియు, మాసంస్థానమువారి తలంపు. ఆహారపదార్థములలో ఒక్కొక్క ప్రాంతమునకు ఒక్కొక్క సరకు ఉత్పత్తిఅగుటకు ప్రాధాన్యమిచ్చుటయు, అట్టి సరకులుమార్చుకొనుటకుపట్టణములేర్పడుటయు, ఈ కేంద్రీకరణవిధానమువలన కలిగినఫలములే. ఉన్నదిక్కున వేలకొలఁది మగ్గములుండుటయు, లేని దిక్కున అసలే లేకపోవుటయు, ఆహారపదార్థములన్నిటిలోనుకల్తీలు పెరుఁగుటయు, ఆవిధానమువల్లనే సంభవించినవి. మానవుని ఆవరించిన ధనాధికారమమకారములు, వ్యక్తులనుండి సంఘములకును మతములకును వర్ణములకును దేశములకును ఖండములకును ఎగఁబ్రాకి, అందు కలిగిన పోటీలవలన పై దుస్థితి ఏర్పడినది.

ఈ విషబీజములు మానవుని వ్యక్తిజీవితమునందు నాటుకొని పెరుఁగుచు చెడుఫలము లిచ్చుచున్నవి. అందువలన ఇప్పుడు భయంకరమగు దుస్థితి ఏర్పడినది. అది నివారించినఁగాని శాంతి కుదురనేరదు. కాన వ్యక్తిజీవితమునందుఁగల విషబీజములు నాటుకొనకుండఁజేయుటకే యీ సంస్థ కృషిచేయుచున్నది. వ్యక్తిజీవితమునకు పునాది గ్రామమై ఉండవలెను. కాని నిజమునకు హిందూదేశములో ఇప్పుడు గ్రామములు అని చెప్పఁదగినవి లేవు. ఉన్న ఏడులక్షలగ్రామములును ఏడులక్షల ఫ్యాక్టరీలుగా మాఱిపోయినవి. స్వయంపోషణ మనుదృష్టి గ్రామాదులలో లేదు. ఆదృష్టి సృష్టింప వలసియున్నది. గ్రామములోనియునకులు పెక్కురు పసితనమందే విద్యాభ్యాసమునకు పట్టణములు చేరి వకీళ్ళుగానో- డాక్టర్లుగానో - ఉద్యోగులుగానో - వర్తకులుగానో - బ్యాంకర్లుగానో - ఇన్స్యూరెన్సు ఏజెంట్లుగానో- తదితర వృత్తులలోనో స్థిరపడి, ఆయా వృత్తులలో ద్రవ్యార్జనము కొఱకు గ్రామాదులమీఁద ఆధారపడుచున్నారు. ఇందువలన వీరిలో పోటీలు వచ్చి గ్రామాదులలో కక్షలు పెరుఁగుచున్నవి. ఇవన్నియు కేంద్రీకరణ పద్ధతివలననే వచ్చుచున్నవి. మఱియు, ఈ కేంద్రీకరణపద్ధతులవలన కమ్మరము, వడ్రము, మొదలగుపనులన్నియు బస్తీలకు వశమై, ఆ పనులకుకూడ గ్రామస్థులు బస్తీలమీఁద ఆధారపడుచున్నారు. తగవులుండుటయు సౌకర్యములు లేకుండుటయు లక్షణము గాఁగల గ్రామవాసము ప్రజలను ఆకర్షించుట లేదు. నీటిపంపులు, విద్యుచ్ఛక్తి, రోడ్లు మొదలగు సౌకర్యముల మూలమున పట్టణములు జనులను ఆకర్షించుచున్నవి. గ్రామానుభవము లేనివారు ఈదుస్థితిని గుర్తింపలేకున్నారు. గ్రామములో జీవితము గడపనివారికి సులభముగా ఇది బోధపడదు.

హిందూదేశపు జనసంఖ్య ఎంత? వారికి కావలసిన ఆహారపదార్థములు ఎన్ని? కావలసిన గుడ్డ ఎంత? అని మొత్తముమీఁద అంకెలువేసికొని, అవి ఉత్పత్తి అగుచున్నవా? లేదా? అనిపెక్కుమంది తలపోయుచుందురు. ఇదంతయు కేంద్రీకరణపద్ధతిలో చేరినదే. గ్రామ స్వయంసంపూర్ణత యనువిధానముమీఁద ఆలోచించిన యెడల వారి ఊహలన్నియు పైదృష్టినుండి మాఱును. కాన గ్రామ స్వయంసంపూర్ణత సమకూర్చుటకు వలయుదృష్టి సృష్టించుటకే ఖద్దరుసంస్థానము కృషిచేయుచున్నది.

మానవచిత్తవృత్తులను గ్రహించిన పిమ్మట, అవకాశమున్నయెడల తమ సొత్తునుగాని, తీఱిక కాలమునుగాని మానవులు దుర్వియోగము చేయుదురని మనకు తెలియవచ్చును. ఇందును గుఱించిన పరిశోధనములు సామాన్యజనులలో చేసి, నిర్ణయింపవలెను. మానవుని చిత్తవృత్తులనుబట్టి, ప్రతిమానవుఁడును తపస్సులోనో, యోగములోనో, దేశసేవలోనో, కుటుంబయజ్ఞములోనో, తనతన యభిరుచులనుబట్టి పెంపొందుటకు, క్షణమైనను తీఱికలేనివిధమున కార్యక్రమ ఉండవలెననియే ఖద్దరుసంస్థానమువారి యభీష్టము. ఇట్టికార్యవిధానములో వివిధరంగములుండుటచేత మనోరంజకత్వమునకు వీలు కలదు. దీనినే వారు కర్మవిధానమనుచున్నారు. దీనినే గ్రామజీవితములో ఇముడ్పవలెనని ప్రయత్నించుచున్నారు.

మానవశాంతికి స్థానికోత్పత్తిపై ఆధారపడిన స్వయంపోషకవిధానమే (Decentralisation) శరణ్యమని ఖద్దరుసంస్థానమువారి నిశ్చయము. ఈవిధానముక్రింద గ్రామములలో ఎక్కడకావలసినతిండి అక్కడ, ఎక్కడ కావలసినగుడ్డ అక్కడ తయారగుటకు వీలుండుననియు, వానిననుసరించి సమస్తకళలును ఎక్కడ కావలసినవక్కడ వారివారి అవసరములఁబట్టి పెంపొందుననియు, ఆయాప్రదేశములలో ఒకరుఉత్పత్తి చేసినదానివిలువను రెండవవారు సులభముగా గుర్తించుటకు వీలుండుననియు, అవన్నియు చేతిపరిశ్రమములుగానే అభివృద్ధియగుటకు వీలున్నదనియు, ౧౫౦ సంవత్సరములక్రిందటివఱకును నిలిచియున్న మనదేశపు ఐశ్వర్యమునుగుఱించి తలఁచుకొన్నయెడల స్వయంపోషకవిధానముక్రిందనే హిందూదేశము సమస్తైశ్వర్యములను భవించినదనియు ఖద్దరుసంస్థానముగుర్తించినది.

ఈ స్వయంపోషకవిధానములో ఏగ్రామములలో ఉత్పత్తియగు సరకు ఆ గ్రామములలోని వివిధవృత్తులవారు సంప్రదించుటవలనఁగాని, ఆయాగ్రామ పంచాయతీదార్ల మూలమునఁగాని, వస్తునిర్మాణములో వినియోగపడుకాలమును బట్టియు కౌశలమునుబట్టియు- వారి కుటుంబపోషణావసరములనుబట్టియు- ఆయా వస్తువుల విలువను కట్టుకొని, ఒకవస్తువును మఱియొకవస్తు విచ్చి పుచ్చుకొనుటకు వీలుకలదనియే ఖద్దరుసంస్థానమువారు నమ్ముచున్నారు.

## వస్తువుల మార్పిడి

ఇప్పటి నాణెముల విధానముతో వస్తువుల ఈస్వయంపోషక విధానమును జతపఱచి మన దేశములో గ్రామములను పునరుద్ధరింపఁజూచుట అసంభవమని వారియభిప్రాయము.

ప్రపంచమును ఆవరించిన ఆర్థికదుస్థితిని గుర్తించియు, బంగారు ప్రమాణమును తీసివేయుటవలన నాణెపువిధానమునకు కలిగిన ఉపద్రవమును గుర్తించియు, నాణెపువిధానమువలన ప్రజలకు కలిగిన ఒడుదుడుకులను గుర్తించియు, ప్రజలలో అన్నవస్త్రములు ఉత్పత్తి (Produc-

-tion) వినియోగము (Consum-ption) లలో నైనను మార్పిడివిధానమును ప్రవేశపెట్టి, దాని మూలమున తమజీవితములను నడపుకొనవలె ననియు, రైతులు, కూలీలు, వర్తకులు, పారిశ్రామికులు, పెట్టుబడిదార్లు, ఋణస్థులు, ఋణదాతలు, ఉద్యోగస్థులు, విద్యావంతులు, భూస్వాములు, జమీందార్లు, సంస్థానాధిపతులు మొదలగువారందఱును తమతమ లావాదేవీల లోను, దినచర్యలోను, మార్పిడివిధానమును అవలంబించుటవలనఆర్థికదుస్థితితొలఁగుననియు ఖద్దరుసంస్థానమువారికి నమ్మకము. మార్పిడి విధానము అనాదిసిద్ధమైనదనియు, అహింసాచరణమును పెంపొందింపఁ గలిగినదనియు, చేతివృత్తులను ప్రోత్సహించి నిరుద్యోగమును నివారింపఁ గలిగినదనియు, నాణెపుఅవసరమును తగ్గించిఆర్థికదుస్థితిని పోఁద్రోలి,బంగారుప్రమాణమును పునరుద్ధరింపఁగలిగినదనియు, ప్రజలలో ప్రత్యక్షపు లావాదేవీలు పెంపుచేసి, కలితీలనుండి రక్షింపఁగలిగినదనియు, మానవ జీవితపరిమాణమును ప్రత్యక్షపఱచి, స్వచ్ఛమైన జీవితమును పెంపుచేయుననియు, మద్యపానము మొదలగు దుర్వ్యసనములను తొలఁగించుటకు తోడ్పడుననియు, ఖద్దరుసంస్థానమువారు నమ్ముచున్నారు. మార్పిడివిధానము వ్యక్తుల మధ్యను, గ్రామగ్రామములమధ్యను, జిల్లాజిల్లాలమధ్యను, రాష్ట్రరాష్ట్రములమధ్యను, దేశదేశములమధ్యను, పెంపొందించుటవలన ఆయా ప్రదేశములలో ఒకరియందు ఒకరికి సుహృద్భావము పెరుఁగుననియు, ఇందువలన ప్రపంచములోని అన్ని దేశములతోను ముఖ్యముగ బ్రిటను దేశముతోను మనదేశమునకు న్యాయమగు సంబంధముకలిగి, లాభసాటివ్యాపారములు అభివృద్ధిపొందుటకు చక్కని అవకాశములు కలుగు ననియు, వారినమ్మకము. ఇందుకొఱకు ప్రతి గ్రామములలోను, పట్టణములలోను, ప్రతివార్డులోను, వస్తుమార్పిడిడిపోలు పెట్టించి, అన్నవస్త్రముల ఉత్పత్తికిని, వాని వినియోగమునకును ఏర్పాట్లు చేయవలెననియు, ఈపద్ధతి ఫలప్రదముగ నడచుటకు, రాష్ట్రములలోను జిల్లాలలోను తాలూకాలలోను ఫిర్కాలలోను గ్రామములలోను పంచాయితీలు మొదలగుసంఘములు ఏర్పఱచి, ఆయా ప్రాంతములకు తగినవిధానములు ప్రోత్సహించి, వడుకునూలును ప్రధానములగుమార్పిడివస్తువులలోచేర్పింపవలెననియు, వారి హెచ్చరిక. ప్రజలలో నాణెములతో జరుగు ప్రతిలావాదేవీయు వస్తువులతో జరుగునట్లు మార్పవలెనని వారు కోరుచున్నారు. ఈ విధానము వృద్ధిపొందినయెడల ఎగుమతి దిగుమతులు తగ్గి, రైళ్ళఅవసరము చాలవఱకు తొలఁగి, వాని కొఱకగు భూమ్యాక్రమణము కొంతతగ్గుననియు, సాధారణ ప్రయాణములకు బోట్లును, మోటారు కార్లును-బస్సులును, అత్యావశ్యకప్రయాణములకు విమానములును వినియోగించుకొనఁదగుననియు, బోట్లకొఱకు కాలువలు హెచ్చుటవలన అవి వ్యవసాయమునకును చెఱువులకును, హెచ్చుగా ఉపయోగపడుననియు, వారితలంపు.

### ప్రపంచశాంతి

శాంతికొఱకు మానవసంఘమునం దేర్పడిన ఆర్థిక, నైతిక, సాంఘిక, రాజకీయవిధానములు ఒకదానికొకటి సంబంధములేని వేఱువేఱుఅలు కావు. వాని అన్నిటి సమన్వయముమీఁదనే మానవశాంతి ఆధారపడియున్నది. ఈ విశ్వాసముమీఁదనే ఈకార్యక్రమము ఏర్పడియున్నది. ఆ ప్రత్యేకభాగములు అందలి నిపుణత్వమును పెరిపొందించుటకేర్పడినవే కాని వాని సమష్టి స్వభావమును వేఱుపఱుచుటకు కాదు. కాన

ఆసమష్టిభావమును, విధానమును పెంపొందించుకొఱకు ప్రతిదేశమువారును తమ తమ దేశములలో మానవ జీవితమునకు గ్రామము పునాదిగా ఉంచుకొనుటకును, కొనఁదగినదియు విక్రయింపదగినదియు విస్తారముగ ఉండనివిధముగ గ్రామవ్యవసాయవిధానమునుంచుకొనుటకును, ఆగ్రామప్రజలలో నూటికి ౮౦ మందికి చేతిపరిశ్రమల మీఁద జీవనములు జరుగుటకు తగిన వృత్తుల విధానము ఏర్పఱచుకొనుటకును, ఇందులో చేతితో వడికి, చేతితో నేయువస్త్రశాఖ విధిగా ఉంచుకొనుటకును, కేవలము ద్రవ్యార్జనసాధనముగా తోడ్పడునని ఊహాలలోనైన ఉండని సాహిత్యవిద్యావిధానము నవలంబించుటకును, అర్హతలనుబట్టి విద్యాభివృద్ధిచేయుటకును, ప్రతివారును భాషాజ్ఞానము కలవారుగా ఉండుటకును, అన్నవస్త్రముల ఉత్పత్తిలోను వానిని మార్చుకొనుటలోను వస్తువులమార్పిడివిధానమును అవలంబించుటకును, వ్యక్తిగా ఆస్తులయందు హక్కులు కోరక, అధికారమమకారములులేక, మానవాభ్యుదయమే ఈశ్వరసేవగా నెంచి, కృషిచేయు అనుభవశాలులసంఘమును నియమించి, వారి సలహాతో శాసననిర్మాణమేర్పర్చుచుండుటకును, మానవజీవితమునకు అవసరమగు యంత్రనిర్మాణమును లాభముకోరి కృషిచేయు వ్యక్తుల చేతులలో నుంచక, ప్రభుత్వాధీనము కావించుటకును వలయు చట్టములు కలిగియుండుటయే మానవశాంతికి తోడ్పడుటయనియు, ఇట్టిస్థితిని నిలువఁబెట్టుటకు తగిన హంగుగల ప్రభుత్వమును కలిగియుండుటయే మానవశాంతికి మార్గమనియు, ప్రపంచసభలు, ప్రపంచకళాశాలల నేర్పరచి పై అనుభవశాలులసంఘముమూలమున కృషిచేయుటవలననే ప్రపంచశాంతి సిద్ధించుననియు, ఖద్దరుసంస్థానమువారి అభిప్రాయము.

### స్త్రీ పురుష శక్తులు

స్త్రీ పురుషులలో హెచ్చుమంది బ్రహ్మచర్యవ్రతము అవలంబింతురని కాని, ఆస్తిలేమియందు నమ్మకముగలవారందఱునుకూడ బ్రహ్మచర్యవ్రతమవలంబింతురనికాని, ఖద్దరు సంస్థానమువారికి విశ్వాసములేదు. మానవసంఘములో ఏకపత్నీవ్రతమును, పాతివ్రత్యమును అభివృద్ధికాంచవలెనన్న వయస్సునుబట్టి వడిదుడుకులకు లోనుగాకుండ తగిన కట్టుదిట్టములుచేసి అవి నిష్కర్షగా పాటించుచుండవలెననియే వారి అభిప్రాయము. ఆస్తిలేమియందలినమ్మకము కలవారలకూడలి యగు ఒకటవపట్టీవారిలో కలుగు సంతాన మంతయు ఒకటవపట్టీలోనే యుండునని ఖద్దరుసంస్థానమువారు ఊహించుటలేదు. అందుకనియే ౧ వ పట్టీవారిలో కలుగుసంతానమంతయు శ్రీ రాజేంద్ర విద్యావిధానములో చేర్పవలెనని నిశ్చయింపఁబడినది. అట్లు చేర్పఁబడినవారికి ౧౮ ఏండ్లవఱకు విద్యాబుద్ధులు కఱపి ౨౫ ఏండ్లవఱకు నాల్గవపట్టీలోను, అటు పిమ్మట మూఁడవపట్టీలోను, ౩౫ సంవత్సరముల అనంతరము వారు అర్హతపొందినచో ౧ వ పట్టీలోను చేర్చుకొనుటకు ఏర్పాటుచేయఁబడినది. అట్టి అర్హతానుభవములలో ౩౫ సంవత్సరములకు మించినవారే ఖద్దరుసంస్థానపు ఆర్థిక, నైతిక, సాంఘికవిధానములు నడపుటకు అర్హులని నిశ్చయింపఁబడినది. మానవసంఘమంతయు శాంతిస్థాపనప్రయత్నసందర్భమున ఇట్టి పరిశీలనముతోకూడిన నిర్మాణకార్యక్రమమును అవలంబించుటచేతనే స్థిరమైన శాంతి ఏర్పడునని వారిఆశయము.

### మతములు - వర్ణములు

ప్రపంచము మొత్తముమీఁద సుమారు రెండువందలకోట్లప్రజలున్నారు. వీరిలో హెచ్చు

మంది ఈశ్వరవాదులు; వీరిలో సుమారు నాల్గవవంతు క్రైస్తవులు; నాల్గవవంతు బౌద్ధులు; ఎనిమిదవవంతు హిందువులు; ఎనిమిదవవంతుమహమ్మదీయులు; మిగిలిన నాల్గవవంతు వివిధమతముల వారు. ఈమతములందలి మూలసూత్రములఆచరణపటుత్వము తగ్గినను, బాహ్యావేషములలో మత, . వర్ణములను గుఱించిన ఆర్భాటములు వారిలో హెచ్చుగనే ఉన్నవి. కాన మఱుఁగుపడిన మూలసూత్రములను పైకి తేవలసి యున్నది.

సత్యమును అహింసయు పాటింపని ఏమతమును చిరకాలము నిలువనేరదు. అన్యమతసహనము లేనిమతము మతమని యెంచఁదగదు. ఈసిద్ధాంతములను వదలినయెడల మతద్వేషములు పెరుఁగును. కాన, ఇప్పటిపరిస్థితులన్నిటిని గుర్తించి మా కార్యక్రమము హిందూమతము నాధారముచేసికొని, వర్ణాశ్రమధర్మముల ననుసరించి నడపవలెనని నిశ్చయింపఁబడినది. ఇందులకు కారణము స్థాపకుఁడు హిందూమతస్థుఁడగుటచే ఆమతమందు పై కార్యక్రమాభివృద్ధికి తావుకలదని ఎంచుటయే. మానవశాంతి నుద్దేశించి చేయుప్రతిపనిలోను ఏమతమువారినైనను, ఏవర్ణమువారి నైనను ఇందులో నుదాహరించిన పట్టీలవారిగా విభజించి అర్హతగలవారికే ప్రాముఖ్య మిచ్చుచున్నందువలన మావిధానము సర్వసమ్మతమై వర్ధిల్లునని నమ్ముచున్నాను. జీవితవిధానములో పోరాటము హెచ్చుచున్నందువలన మానవసౌభ్రాతృత్వముకొఱకు జరుగుచున్న కృషికి వన్నె వచ్చుట లేదు.

## ఆ ద ర్శ గ్రా మ ము

ప్రపంచములో ఆధునికయంత్రములవల్లను, విద్యుచ్ఛక్తి మొదలగు ప్రకృతిసాధనములవల్లను, స్థిరత్వములేక యిప్పటి ప్రపంచదుస్థితికి హేతువైన నాణెపువిధానమువల్లను, అతివేగముగ నడచుచు, ఇనుపయుగమని పిలువఁబడు కలికాలములో ఇట్టికార్యక్రమమునకు తావు కలదా? అని సందేహించువారు పెక్కు రుందురు. కలియుగము నాలుగులక్షల సంవత్సరములకు పైఁగా జరుగవలసియుండఁగా ౫౦౦౦ సంవత్సరములకే ముప్పువాటిల్లునని ఖద్దరుసంస్థానము వారు ఎంచుట లేదు. ఇపుడు ప్రపంచములో కనిపెట్టఁబడిన ప్రకృతిశాస్త్ర పరిశోధనములు మానవశాంతికొఱకే ఉపయోగపడుటకుమాఱు క్షణకాలములో మానవలోకమును అంతరింపఁజేయుటకు తగినంత మందుగుండుసామాను తయారుచేయుటకే హెచ్చుగా ఉపయోగపడుచున్నవి. ప్రతిదేశమువారును ఈదుస్థితికి లోనై కుందుచు తమ ముందుగతి ఏమగునా? అని భీతిల్లుచునే ఉన్నారు. వారు చేపట్టిన కేంద్రీకరణ విధానములో వారిలో వారికి రాజీ కుదిరి శాంతివర్ధిల్లుట అసంభవమనియు, అట్టితరిని విధిలేక యైనను స్థానికోత్పత్తివిధానముపై ఆధారపడు స్వయంపోషకవిధానము నవలంబింపవలసిన దినములు రాఁగలవనియు ఖద్దరుసంస్థానమువా రూహించుచున్నారు.

ఈవిధానము అమలులోనికి వచ్చినయెడల బొంబయి కలకత్తాలవంటినగరములలోని ప్రజలు వివిధగ్రామాదులకు సర్దుకొని పోదురనియు, లండనువంటి మహానగరములు సైతము కొన్ని వేల గ్రామములుగా మాఱి, అందలి ప్రజలు శాంతియుత సుఖజీవులై వెలయఁగల రనియు, ఖద్దరుసంస్థానమువారి ఆశయము. గుణదల ఖద్దరు సంస్థానము ను ఆదర్శగ్రామముగా తయారు చేయవలెనని చేయుచున్న ప్రయత్నములును, వేసిన అంచనాలును పరిశీలించిన యెడల స్వయంపోషక విధానము క్రింద ఇప్పటి అశాంతి ఎట్లుతొలఁగునో ఎట్లు శాంతి

చేకూరునో ప్రపంచ పరిస్థితులు తెలిసికొనిన వారందఱును గ్రహింపఁగలుగుదురు; ఆధునిక నాగరిక చిహ్నములుగా వెలయు సౌకర్యముల విలువలు నిర్ధారణముచేయఁగలుగుదురు. ప్రపంచములో వ్యాపారస్థులు లాభములకొఱకు ఒకరి నొకరు మించి యెత్తులు వేసికొని,సామాన్యజనుల కందఱకు ఎటుల నష్టము కలుఁగ జేయుచున్నారో తెలిసికొనఁ గలుగుదురు. స్వయంపోషకవిధానమువల్ల అట్టిదుర్వ్యాపారతృష్ణ తగ్గునని గ్రహించినయెడల ఇప్పటి స్థితికి మూలకారణము తెలిసికొని నివారించినట్లే ఎంచుకొన వచ్చును. తమ ఆదర్శగ్రామవిధానము శాంతికి మార్గ మని అన్ని సంఘములును, ప్రభుత్వములును, సంస్థానములును గ్రహించినచో, హిందూ దేశమే ప్రపంచమును నాశమునుండి తప్పింపఁగలదనియు, ఈకృషికి ఇప్పుడు అదననియు, ఖద్దరుసంస్థానమువారు నమ్ముచున్నారు. వారు పెంపొందింపఁదలఁచిన ఆదర్శగ్రామ విధానము: ౧౦౦౦ ఎకరముల భూమి; ౧౦౦౦ మంది జనము; తృణ కాష్ఠ జల సమృద్ధి; గ్రామములో ౪౫ సంవత్సరములవయస్సుమించి, ఆర్జనము వదలిన అయిదుగురికి తగ్గని సభ్యులతో కూడిన గ్రామసంఘము గ్రామవ్యవహారములను నిర్వహించుట; ౨౧ సంవత్సరముల వయస్సుకు మించిన స్త్రీపురుషులు వారిని ఎన్నుకొనుచుండుట; ఆగ్రామప్రజలను విడఁదీసి వారికాలమును విడఁదీసి, పనిచేయఁగల వారిలో ౧౦౦కి ౪౦ మందికి పాడిసేద్యములు; ౪౦ మందికి ఖద్దరు, నూనెలు, వడ్రము, కమ్మరము, తాపీ, మట్టి, తోళ్లు మొదలగు పరిశ్రమలు; ౨౦ మందికి విద్యలు, భాషలు, పరిశోధనములు, గ్రంథాలయములు, పురాణములు, ప్రదర్శనములు, వ్యాపారము, సంరక్షణము మొదలగు పనులు; అందఱకును చదువుచెప్పుట; అందఱచేతను వడికించుట; అన్ని వర్ణములవారికి అన్ని మతముల వారికి గ్రామములో తావిచ్చుట; ఉత్పత్తిచేసినదంతయు దాఁచి, ఆయా వస్తువులకు ధాన్యపు చీట్లలో విలువకట్టి, ఈదిగువనుదాహరించిన మార్పిడి రేట్లతో లావాదేవీలు జరుపుటకు ఒక గ్రామ స్టోర్సు పెట్టుట. మార్పిడికి వడ్లబస్తా ప్రమాణము.

మార్పిడి రేట్లు:—

వడ్ల బస్తాకు ౪౦ సేర్ల దంపుడుబియ్యము. బియ్యమునకు సరాసరి, కందులు, పెసలు, మినుములు, గోధుమలు, అలచందలు, ఉలవలు, సెనగలు, దనియములు.

౧ వడ్లబస్తా చీటికి,
మ ౧ మంచినూనె
మ ౧ వేరుసెనగనూనె
మ ౧ ఆముదము
మ ౧ కొబ్బరినూనె
మ ౧ మిర్చి
మ ౨ చింతపండు
మ ౨ బెల్లము
౪ చిట్టుబస్తాలు
మ ౨ ఆవాలు
మ ౨ మెంతులు
మ ౦౬ జీలకఱ్ఱ
మ ౦౬ మిరియాలు
మ ౦౧ లవంగాలు
మ౬ వక్కలు
మ౬ సొంటి
వీ ౧ ఏలకికాయలు
సే ౩౨ పాలు
సే౬౫ జొన్నలు
మ౬ ఏకులు
గ౮ ఖద్దరు బట్ట

నేతకూలి—సాదా నేతకు (౮౫ అం. నెరవు) ౪౧ కి - వడ్లు సే ౮
కుప్పడము (౮౫ అం. నెరవు) ౪౧కి వడ్లు సే ౮
వడుకుకూలి—౭ మణుగులకు ౧ బస్తా వడ్లు.

పనివారికి సాలుకు ౧౫ బస్తాలవడ్లు మొదలు ౫౦ బస్తాలవఱకును, ౧౦౦ గజముల ఖద్దరు గుడ్డ వఱకును జీతములు.

వ్యవసాయమునకు ౨ చెఱువులు, ౧౫ బావులు, ౬౦ జతల ఎడ్లు, నాగళ్ళు మొదలగు సామానులు, ౧౦ బండ్లు; మనుష్యులకు కావలసిన తిండికిని బట్టకును, పశువులకు కావలసిన మేఁతకును సరిపోవు పైరులు పండించుట; పాఁడికిని, సేద్యపు పాటునకును ౧౦౦ ఆవులును, ౧౦౦ గేదెలును, వానిదూడలును, ౧౨౦ ఎడ్లును, ౫ఆఁబోతులును, ౫ విత్తనపు దున్నలును, పశుధనముగా ఉండుట; రోజుకు కనీసము గ్రామములో ౫౦౦ సేర్లకు తగ్గనిపాలు; ౫౦ నిమ్మలు, ౨౫ దబ్బలు, ౫౦ బత్తాయిలు, ౫౦ నారింజలు, ౫౦ సపోటాలు, ౨౫ కమలాలు, ౨౫ చింతలు, ౧౦౦ మామిళ్ళు, ౫౦౦ కొబ్బర్లు, ౬౦౦౦ అరఁట్లు, ౨౦౦ తాళ్ళు, ౫౦౦ ఈఁతలు, ౨౦౦౦ తుమ్మలు, ౧౦౦,౦౦ సరుగుళ్ళు, మొదలగు చెట్లు; పశువుల యెరవులను మనుష్యుల యెరవులను అతిశ్రద్ధగా తయారుచేయుట; పరిశ్రమలవలన సాలుసాలున ౧౫ వేలగజములగుడ్డ, ౧౦౦౦ మణుగులనూనె, ౧౦౦౦ మణుగులబెల్లము, ౧౦౦౦ జతలచెప్పులు, కుండలు మొదలగునవి తయారుచేయుట; భూమిలో ౫౦ పాళ్ళు మనుష్యులతిండికిని పశువుల మేఁతకును పనికివచ్చు పైరులు వరి, జొన్న, సజ్జ, కంది, నువ్వు, గోదుమ, ప్రత్తి మొదలగునవి వేయుట; ౨౦ పాళ్ళు బీళ్ళుగాను, ౧౦ పాళ్ళు ఫలవృక్షములక్రిందను ఓషధులక్రిందను చెఱకుక్రిందను, ౨ పాళ్ళు కూరగాయలక్రిందను, ౨ పాళ్ళు రవానాసరకులక్రిందను, ౧౬ పాళ్ళు వేవిలిపైరులక్రిందను ఉంచుట; భూముల రకములనుగుర్తించి ఏరకమునకుతగిన పైరు ఆరకములో అభివృద్ధిచేయుట; అవసరమైనంతవఱకు ఈపనులన్నింటినిగాని, కొన్నింటినిగాని సమష్టిగా స్టోర్సువల్లనడపి, సాధ్యమైనంతత్వరలో ఉత్పత్తి చేయువారికిని అనుభవించువారికిని ప్రత్యక్షముగా లావాదేవీల నేర్పఱచుట; గ్రామమునకు బయటనుండి రావలసిన సరకులయు గ్రామము నుండి బయటికి పోవలసిన సరకులయు లావాదేవీలు మాత్రము స్టోర్సువలననే జరిపించుట; సంరక్షణముకొఱకు ప్రభుత్వమున కీయవలసిన పన్నులిచ్చి వివాదములుతీర్చుబాధ్యతను గ్రామసభ వహించుట; ఇవి ముఖ్యనియమములుగా ఎంచి, వలయునెడ క్రొత్తవి చేర్చుకొనుట.

ఈవిధానమే కొద్దిజనముతో, కొద్దివిస్తీర్ణముతో ఖద్దరుస్థానమువారుక్లుప్తసరిగా అవకాశములనుబట్టి ఆచరణలోఁబెట్టి పరిశోధించియున్నారు. అందువలన పైవిధానము ఆదర్శగ్రామమునకు తగియుండునని వారికి విశ్వాసము కలిగినది.

## ఉ ప సం హా ర ము

మానవసంఘశాంతికి విరుద్ధమని రుజువు కానంతవఱకును వ్యక్తులయొక్కయు-సంఘములయొక్కయు - జీవితనియమములతో జోక్యము కలిగించుకొనరాదని వారు నిర్ణయించుకొని నారు. శాంతియుతజీవితమునకు సామాన్యముగా స్త్రీపురుషుల నిరువురనుకలిపి యూనిట్టు (ప్రమాణము)గా కైకొనఁదగునని వారిభావము. పురుషునికంటె స్త్రీలో నిబ్బరమును, తెంపును, మమకారమును కలుగఁజేయు శక్తులు హెచ్చుగా కలవనియు, స్త్రీపురుషులయూనిట్టుకు ఆ హెచ్చుతగ్గులవల్ల ఇబ్బంది కలుగకుండ పరస్పరరక్షణముండుటే క్షేమకరమనియు, వారి

అభిప్రాయము. స్త్రీ పురుషులకు వివాహప్రయత్నములు విద్యావిధానములో ఇముడవలెనని వారి ఆశయము. బాలబాలికల యోగ్యతాయోగ్యతలను పరిశీలించి, చిన్నతనమందు కన్యాదానముచేసి యుక్తవయస్సు వచ్చినప్పుడు వివాహము చేసికొనుటకు వారికి అవకాశముంచుట కార్యక్రమములో ఆశించు శాంతియుతజీవితమునకు సహకారిగా నుండునని వారు విశ్వసించుచున్నారు. మానవజీవితమందు సాధారణముగా వచ్చు ప్రతిస్వల్పవిషయమునుగూర్చియు ఖద్దరు సంస్థానమందు పరిశోధింపఁబడుచుండును. ఈ పరిశోధనములవలన తేలిన సిద్ధాంతములు ముస్ముందు మా సంస్థ ప్రచారము కావించి, అవి లోకాదరణపాత్రము లగునటుల చేయఁగలుగుఁగాక!

# ఖద్దరుసంస్థానము పది సంవత్సరముల సంగ్రహ నివేదిక

ది ౧౮-౪-౨౭ మొదలు ది ౧౧-౪-౩౭ వఱకు

## సిబ్బంది

ధాతృ సంవత్సరాంతమునకు ఖద్దరు సంస్థానములోని జనసంఖ్య ౫౯; పట్టీల క్రమమున ఈ దిగువరీతిగ నున్నారు:

| పట్టీ సంఖ్య | పురుషులు | స్త్రీలు | పిల్లలు | మొత్తము జనసంఖ్య |
|---|---|---|---|---|
| ౧ | ౨ | ౨ | ౮ | ౧౨ |
| ౨ | లేరు | లేరు | లేరు | లేరు |
| ౩ | ౨ | ౨ | ౪ | ౮ |
| ౪ | ౧౧ | ౯ | ౧౯ | ౩౯ |
| మొత్తము | ౧౫ | ౧౩ | ౩౧ | ౫౯ |

## సేద్యము

ప్రథమమునుండియు రెండు ఱకల వ్యవసాయము జరుగుచున్నది. మొదటినుండియు మెఱక జరీబువ్యవసాయములును, కొంత కాలము మాగాని వ్యవసాయమును, చేయఁబడినవి. వరి, జొన్న, వరిగ, మొక్కజొన్న, కంది, సెనగ, ప్రత్తి, అరఁటి, కంద, పెండలము, చేమ, పొట్ల, కాకర, ఉల్లి, మిర్చి, రామములగ, వంగ, పసుపు, చిలగడము, ముల్లంగి, మెంతి, గోంగూర, బచ్చలి, తోఁటకూర, చిక్కుడు మొదలగు పలురకముల పైరులును, కూరలును, పండింపఁబడినవి. గోదుమ, సోయాబీన్, బంగాళాదుంపలు పండించుటను గుఱించి పరిశోధనలు జరుగుచున్నవి. మాలతి, జాజి, మల్లె, గులాబి మొదలగు పుష్పజాతు లున్నవి. తెల్లజిల్లేడు, వేము, గోరింట, సుగంధిపాల, వామింట మొదలగు ఓషధిజాతులు జాగ్రతచేయఁబడుచున్నవి. నిమ్మ,దబ్బ, బత్తాయి, సఫోటా, మామిడి, కమల, నారింజ, పంపరపనస, పనస, ఉసిరిక—ఈ ఫలవృక్షములు సుమారు ౧౬౫ పెరుఁగుచున్నవి; సుమారు ౨౦౦ తాటిచెట్లు కలవు. ఈసంస్థక్రిందనున్న సుమారు ౪౦ ఎకరముల మెఱకభూమిలో ౧౦ ఎకరములు బీడుగా ఉంచఁబడినది. అందులో సుమారు ౩౦౦ తుమ్మలు పెరుఁగుచున్నవి. ప్రత్యేకముగ పాఁడిశాఖ కలదు; రోజుకు ౨౫ సేర్లవఱకు పాలు ఉత్పత్తి అగుచున్నవి. దీనికి తగిన ఆవులును గేదెలును ఉన్నవి. ఎరవులకు ప్రత్యేకజాగ్రతతీసికొనఁబడుచున్నది. మనుష్యుల మలవిసర్జనమునకు కందకములు ఉపయోగింపఁబడుచున్నవి. ఒకచోటినుండి మఱియొకచోటికి మార్చుటకు వీలైన బల్లలతో చేయఁబడిన నడదొడ్డి మలవిసర్జనమున కేర్పాటు చేయఁబడినది.

ఖద్దరు పరిశ్రమ

అయిదు మగ్గములు ఉంచవలెనని ఏర్పాటు చేయఁబడెను. కాని,ఆపరిమితికి ఒకప్పుడు తక్కువగాను ఒకప్పుడు హెచ్చుగాను పని జరుగుచు వచ్చెను. ఖద్దరుపరిశ్రమ స్వయంపోషణదృష్టితో నడపఁబడుచున్నది. ఇతరులు వడ్డికి ఇచ్చు నూలు నేయించి ఇయ్యఁబడును. స్థానికులనూలు వడుకు నానాఁటికి హెచ్చినది. ధాతృ సంవత్సరములో స్త్రీలు, పురుషులు, పిల్లలు అందఱును కలసి గ ౧౫,౮౧,౪౫౦ లు నూలు వడికిరి. స్వయముగ ఏకి ఏకులుచేయుట స్థానికులలో స్త్రీపురుషులు హెచ్చుమంది నేర్చుకొనిరి. వార్ధాలోని సత్యాగ్రహాశ్రమమునకు పెళ్ళి నూలు వడుకుటలోను, ఏకుటలోను శిక్షణముపొందినవారు ఇందునుగుఱించి కృషిచేయుచున్నారు.

తక్కిన చేతి పనులు

స్థానికులు వడ్లు దంపుట, వడ్లు విసరుట తమ సొంతఅవసరములకు మాత్రమేగాక ఒక ఆర్జనమార్గముగ ప్రవేశపెట్టఁబడినది. ధాతృ సం॥ మాఘ ఫాల్గున మాసములలో స్థానికులచే సుమారు ౧౦౦ బస్తాలకుపైఁగా ధాన్యము దంపఁబడినది. హెచ్చువడుకుమజూరి పద్ధతిక్రింద స్థానికులచే అప్పుడప్పుడు నూలు వడికింపఁబడుచున్నది. ధాతృసంవత్సరములో ఈ విధముగ సుమారు రు ౨౦-౦-౦ మజూరిక్రింద ఇయ్యఁబడినది. అవసరమగునప్పుడెల్ల స్త్రీలు, పురుషులు, పిల్లలు, అందఱును వ్యవసాయపుపనులలో పాల్గొనుచుందురు. వంటఆముదము, సిరా, నవ్వారు మొదలగునవి సంస్థలో తయారుచేయఁబడుచున్నవి.

పాఠశాల

శిక్షణనిలయమను పేరుతో ఈశాఖ నడుపఁబడుచున్నది. ఖద్దరుసంస్థానమునకు ఒప్పఁజెప్పఁబడినపిల్లలకును, ఇతరస్థానికుల పిల్లలకును, శిక్షణమియ్యఁబడుచున్నది. సుమారు ౨౦ సంవత్సరములు వయస్సుగల యువకులకు శిక్షణమిచ్చి ఇందుక్రింద తయారు చేయవలెనని చేసిన కృషి విఫలమైనది. రాజేంద్ర విద్యావిధానములో తర్ఫీతుచేయుటకు ఇప్పటికి౬రు పిల్లలు ఒప్పగింపఁబడినారు.

గ్రంథాలయము

గ్రంథాలయనివేదిక ప్రత్యేకముగ ప్రకటింపఁబడినది.

వైద్యము - ఆరోగ్యము

విసురుడుబియ్యమును, పొట్టుతో కూడిన పప్పులును, మెట్టభూములలో పండినధాన్యమును తినుటవలన ఆరోగ్యము కలుగునని గుర్తింపఁబడినది. కొంతవఱకు ఆవిధానము అమలులోపెట్టఁబడినది. మనుష్యుల మలవిసర్జనమునకు కందకములు ఏర్పాటు చేయుటవలన చుట్టుపట్ల పరిశుభ్రత పెరుఁగుచున్నది. శరీరకష్టము తగినంత ఉండుటవల్లను, జనసమ్మర్దములేని ప్రదేశమగుటవల్లను, స్వచ్ఛమగు గాలివల్లను, స్థానికులు ఆరోగ్యముగ ఉన్నారు. ఇటీవల బెజవాడ మ్యునిసిపాలిటీవారు మురుగు బుడమేటిలోనికి పెట్టుటవలన మనుష్యులకును, పశువులకును అనారోగ్యమగువాతావరణ మేర్పడునని భయమగుచున్నది.

బేహారము

దంపుడుబియ్యములోను నేతిలోను వ్యాపారము జరుగుచున్నది. ఒకప్పుడు నెలకు ౧౦౦ బస్తాలవఱకు దంపుడుబియ్యము అమ్మకముండెను; కాని దంపుడుబియ్యపుదుకాణములు హెచ్చుటచే ఇప్పుడు తగ్గినది. మార్పిడి విధానము పెంపుకొలఁకు ఇది అభివృద్ధి చేయవలసియున్నది. ఒకప్పుడు తినుబండారపుదినుసులు

కూడ అన్నియు అమ్మఁబడుచుండెను; కాని తరువాత అది క్లుప్తపఱుపఁబడెను.

### వస్త్రమార్పిడివిధానము

వస్త్రమార్పిడి విధాన ప్రచారముకొఱకు కృషి బాగుగా జరిగినది. మొదటి ఆంధ్రరాష్ట్రీయ మహాసభలో ఇందునుగుఱించి తీర్మానింపఁబడినది. గ్రామ, జిల్లా, రాష్ట్రకాంగ్రెసు సభలలో ఆమోదింపఁబడి బొంబాయి కాంగ్రెసులో తీర్మానమున ప్రతిపాదింపఁబడినది. అది గ్రామ పరిశ్రమలసంఘమువారికి పంపఁబడినట్లు తెలియుచున్నది. అఖిలభారత చరకా సంఘములో ఈ సూత్రము అమలులోనికి వచ్చినది. కాంగ్రెసు చందా వసూలుచేయుటలో ఈ సూత్రము వర్తింపఁజేయఁబడినది. ఈ సంస్థయొక్క కార్యక్రమములో అమలు జరుగుచున్నది. శ్రీ గాంధి మహాత్ముఁడు ఇందునుగుఱించి ఉత్తమవ్యాసరచనకొఱకు ప్రకటించియున్నాఁడు.

### విశేషములు

౧౯33 సంవత్సరాంతమున శ్రీ గాంధిమహాత్ముని ఈ సంస్థకు ధర్మకర్తగా ఉండవలెనని ధర్మకర్త కోరెను. ఇప్పటికిని ఆవిషయము తేలనందున ఆకోరిక నిలువయున్నదనియే నమ్ముచున్నాము. ప్రజల ఆర్థిక - నైతిక - సాంఘిక విధానములలో దినచర్యవిషయములు గ్రహించి, దేశకాలపరిస్థితుల కనుగుణముగ మార్పులు చేయఁబడి, అమలు జరుపఁబడుచున్నవి. శాంతి స్థాపనముకొఱకు ఖద్దరుయజ్ఞము అవసరమని గుర్తించి, ప్రారంభింపఁబడినది. అది అశక్తతచే విజృంభింపలేదు.

### ఇబ్బందులు

"స్వయంపోషణము" అను సూత్రముక్రింద నడపఁబడుచున్నందున కొన్ని క్లిష్టపరిస్థితులు ఎదుర్కొనవలసి వచ్చుచున్నది. ఇతరులకు నచ్చఁజెప్పుటకు తగినంతశక్తి ఇప్పటికి కలుగలేదు ఈ కార్యక్రమమునందు సూచింపఁబడిన ప్రతి విషయమును ఆధునికనాగరకతకును, ఇప్పటి వాతావరణమునకును ఎదురుగానున్నది. అందువలన ప్రతిబంధకములు హెచ్చుకలుగుచున్నవి.

### ఖద్దరుసంస్థానకాంగ్రెసు సంఘము

ఇందులో ౨౬ సంఖ్యలు కలరు. ఖద్దరుసంస్థానమువారి ది ౨౭-౧-౩౮ తేదీగల తీర్మానములు ఈసంఘము ఆమోదించినది. వానిలో చాల భాగము అమలు జరిగినవి.

మూలధనము:—

| | |
|---|---|
| ధాతృసంవత్సర ప్రారంభము లెక్కల ప్రకారము స్థిర చరాస్తుల కిమ్మతు (సంస్థానము తా॥) | రు ౨౬౨౦౦-౦-౦ |
| అప్పటికి శివ పట్టివారికి గల ఆస్తులకిమ్మతు | రు ౨౫౦౦౦-౦-౦ |
| వెరసి | ౫౧౨౦౦-౦-౦ |

### ఆదాయ వ్యయములు

| | |
|---|---|
| ౧౦ సంవత్సరములకు సాలుకు రు ౨౦౦౦-౦ లు చొప్పున అయిన ఖర్చు | రు ౨౦,౦౦౦-౦-౦ |
| ప్రచారపుఖర్చులు | ౫,౦౦౦-౦-౦ |
| శిక్షణముకొఱకు ఖర్చులు | ౨,౦౦౦-౦-౦ |
| వెరసి | ౨౭,౦౦౦-౦-౦ |

ఈఖర్చు అంతయు చందాలుమొదలగువానికి ఆశింపకుండ ఖద్దరుసంస్థానమే భరించినది.

ఉప్పులూరి వెంకటకృష్ణయ్య,
ధర్మకర్త:

# గుణదల ఖద్దరు సంస్థానగ్రంథాలయము

## పది సంవత్సరముల సంగ్రహ నివేదిక

గుణదల ఖద్దరు సంస్థానమందలి పిన్నపెద్దల ఉపయోగార్థము ఈ గ్రంథాలయము ౧౯-౨౭ సం॥ లో స్థాపింపఁబడెను. కాని స్థానికులలో హెచ్చుమంది స్త్రీ పురుషులు చదువురాని వారగుటచేత చదువువచ్చిన కొలదిమందికి మాత్రమే అందలి గ్రంథములు ఉపయోగపడు చుండెడివి. ప్రారంభమునుండియు ఈగ్రంథాలయము ఖద్దరు సంస్థాన ప్రాథమిక పాఠశాలోపాధ్యాయునిచే నిర్వహింపఁ బడుచుండెను. స్థానికులలోని నిరక్షరజ్ఞతను రూపుమాపవలెనను ఆదర్శము ప్రథమమునుండియు దృష్టిలోఉండి యున్నను అందునుగురించి హెచ్చుకృషి జరిగియుండలేదు. వ్యవసాయమును, ఇతర పరిశ్రమములును చేసికొని వారికొఱకు రాత్రిపాఠశాల కొంతకాలము నిర్వహింపఁబడెను కాని, ఆపనియు నిర్విఘ్నముగ సాగినదికాదు. భజనలును, పురాణశ్రవణమును వీలువెంట జరుగుచు వచ్చెను.

### ఆదర్శగ్రంథాలయము

పట్టణములలోను, గ్రామములోను గ్రంథాలయము లనేకము లున్నవి. ఆయాగ్రంథాలయములందలి గ్రంథముల సంఖ్యను బట్టియు, గ్రంథాలయ భవనముల సౌదర్యమునుబట్టియు వాని గొప్పతనమును లెక్కించుట ఆచారమైనది. బీరువాలు పుస్తకములతో నిండియున్నను చదువరులు లేకయు, చదువుటయందు అభిలాష కలిగింపఁగల గ్రంథభాండారికులు లేకయు, అనేక గ్రంథాలయములు తమధర్మమును నెఱవేర్పఁజాలకున్నవి. ఖద్దరు సంస్థానమువారి కోరికపై ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారు గుణదల ఖద్దరు సంస్థాన గ్రంథాలయమును ఆదర్శగ్రంథాలయముగ తయారుచేయ సంకల్పించిరి. ఆంధ్రదేశగ్రంథాలయ సంఘకార్య నిర్వాహక సంఘాధ్యక్షులును, ఖద్దరుసంస్థానశిక్షణనిలయాధ్యక్షులును అగు శ్రీయుత మారేపల్లి రామచంద్రశాస్త్రిగారును, ఆంధ్రదేశగ్రంథాలయసంఘాధ్యక్షులగు శ్రీయుత గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారును, కార్యదర్శియగు శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్యగారును ఇట్లుసంకల్పించినందుల కెంతయును ప్రశంసాపాత్రులు. ఖద్దరు సంస్థాన సభ్యుఁడును, ఆంధ్రదేశగ్రంథాలయసంఘ సహాయ కార్యదర్శియునగు శ్రీయుత ఉప్పులూరి రామశాస్త్రిగారు ఈ కార్య నిర్వహణమునకు ప్రత్యేకముగ నియమింపఁబడిరి.

### గ్రంథాలయసభ్యులు

శ్రీ ధాతృసంవత్స రాంతమునకు ఖద్దరు సంస్థానములో జనసంఖ్య ౫౯. ఇందులో గుణదల శాఖలో నివసించుచున్నవారు ౪౧; వీరిలో పురుషులు ౯ రు; స్త్రీలు ౯ రు; పాఠశాలలో చదువుకొను పిల్లలు ౧౧ రు; చిన్నపిల్లలు ౧౨ రు; చిన్నపిల్లలుగాక మిగిలినవారందఱును గ్రంథాలయ సంఘసభ్యులుగ చేర్చుకొనఁబడిరి. వీరిలో శ్రీ ఉప్పులూరి రామశాస్త్రిగారు అధ్యక్షులుగను, శ్రీ మారేపల్లి వేంకటనరసింహారావుగారు కార్యదర్శి - గ్రంథభాండాగారికను ఎన్నుకొనఁబడిరి.

### గ్రంథములు

మత సాంఘిక, రాజకీయ గ్రంథములును, బాలుర కుపయుక్తము లగుపుస్తకములును తెలుఁగులో సుమారు ౮౦, ఇంగ్లీషులో సుమారు ౫౦ ఉన్నవి.

### నిరక్షరత్వనిర్మూలనము

నిరక్షరత్వనిర్మూలనమునకు ప్రత్యేకకృషి చేయఁబడినది. స్త్రీలకొఱకు పగటి పాఠశాలయు, పురుషులకొఱకు రాత్రిపాఠశాలయు, స్త్రీపురుషులందఱకొఱకును రాత్రి పురాణశ్రవణమును, ఆరోగ్య, సాంఘిక, రాజకీయ, విజ్ఞాన విషయములను గుఱించినఉపన్యాసములును శ్రీరామశాస్త్రిగారు జరిపిరి. శ్రీ వెంకటనరసింహారావుగారు ప్రాథమిక పాఠశాలను నిర్వహించిరి. ఈ కృషికి ఫలముగ శ్రీ ధాతృ సంవత్సరాంతమునకు చదువుకొను ఈడువచ్చినస్థానికులు౨౬మందియు అక్షరజ్ఞులే. మిగిలిన ముగ్గురిలో కూడ ఒకరు అక్షరములను నేర్చుకొనిరి. కొద్దికాలములోనే అందఱును అక్షరజ్ఞులేకావచ్చును. పురాణశ్రవణమువలనను, ఉపన్యాసములవలనను స్థానికులందఱును ప్రపంచ పరిస్థితులను చక్కఁగ తెలిసికొనుచుండుట కవకాశ మేర్పడెను.

### చేతిపరిశ్రమలు

సిద్ధాంతములప్రచారమెంత అవసరమో, ఆసిద్ధాంతముల ఆచరణయోగ్యతను రుజువుపఱచుటయు అంతకంటె అవసరమని గుర్తించుటచే గ్రామపునర్నిర్మాణమునకును, జాతీయవికాసమునకును అవసరమగు చేతిపరిశ్రమలు పైగ్రంథాలయసంఘ యాజమాన్యమున జరుగుచున్నవి. పాఠశాలలోనివారు వడుకుట నవ్వారునేత ఎరువులను తయారుచేయుట గ్రామపారిశుధ్యపుపనులలో పాల్గొనుట మొదలగు పనులు చేయుచున్నారు. చదువుకొన్నవారుకూడ ఖద్దరు నేతపనిలోకూడ పాల్గొనుచున్నారు. రామశాస్త్రిగారు స్వయముగా కొన్నిబట్టలు నేసినారు. దాదాపు యుక్తవయస్కులగు స్త్రీపురుషులందఱునువడ్లుదంపుటకలవాటు పడినారు. అందఱును అవసరమైనప్పుడెల్ల వ్యవసాయపులలో పాల్గొనుచున్నారు.

### వ్రతములు

ప్రతిమాసము శుద్ధ ౧౧ రోజున ఏకాదశీవ్రతము గ్రంథాలయయాజమాన్యమున జరుపఁబడుచున్నది. ఉపవాసము, పురాణము, పత్రికాపఠనము, ఉపన్యాసములు, భజనలు, ఆకార్యక్రమమందు ముఖ్యభాగములు. ఆకార్యక్రమములో పాల్గొనుటకు పెద్దలను ఆహ్వానించుటయు, వారిఉపదేశములను వినుటయు జరుగుచున్నది. ముఖ్యముగ శ్రీయుత మారేపల్లి రామచంద్రశాస్త్రిగారును, శ్రీయుత గొల్లపూడి సీతారామశాస్త్రిగారును, ఇందు ఎక్కువ సాయము చేయుచున్నారు.

వీణ
తెనుగు మాసపత్రిక
తేలప్రోలు - కృష్ణాజిల్లా.
ఆంధ్రదేశములోని సుప్రసిద్ధుల రచనలు ఇందువుండును.
సాలుచందా రు 1-8-0

ప్రతిభ
త్రిమాసపత్రిక
సంవత్సరచందా రు 2-0-0
నవ్యసాహిత్యపరిషత్తు, గుంటూరు.

# గ్రంథాలయములలోని పుస్తకములు-ప్రభుత్వమువారి తనిఖీ

శ్రీమల్లెల శ్రీరామమూర్తిగారు.

గ్రంథాలయోద్యమము విద్యకు సంబంధించినది. గ్రంథాలయములవలన ప్రజలలో విజ్ఞానవ్యాప్తి కాగలదని ఎల్లరంగీకరించిన విషయమే. పాశ్చాత్యదేశ ప్రభుత్వములు ప్రత్యేక గ్రంథాలయశాఖ నేర్పరచి, ధనమును ప్రత్యేకించి, తామే నిర్వహించుచు, గ్రంథాలయోద్యమాభివృద్ధి చేయుచు, ప్రజలలో విజ్ఞానమును వెదజల్లుచున్నారు. విరివిగ ప్రభుత్వధనసహాయము లేనిది గ్రంథాలయోద్యమము సర్వతోముఖముగ వ్యాప్తి చెంద నేరదు. మన దేశమున ప్రభుత్వమువారు గ్రంథాలయోద్యమాభివృద్ధికి చేయు సహాయముకంటె, అడ్డంకులును, షరతులును, తీవ్రముగ నేర్పరచి గ్రంథాలయోద్యమమును అణగ త్రొక్కుచున్నారని చెప్పవచ్చును. అయినను, ఉద్యమ నాయకోత్తముల ప్రచారమువల్లను, ఉదారులగు ప్రజల ధనసహాయమువల్లను, భారతవర్షమున గ్రంథాలయోద్యమము దినదినాభివృద్ధిగాంచుచున్నది. భారతావనిలో గ్రంథాలయోద్యమమున ఆంధ్రదేశము ఉన్నతస్థానమాక్రమించినది. మన మద్రాసు ప్రభుత్వమువారు గ్రంథాలయములకు విరాళమిచ్చుటకై చాల కఠిన నియమములు చేసిరి. అందు గ్రాంటుకోరు గ్రంథాలయము రెజష్టరు చేయవలెనన్న షరతు విషతుల్యమైనది. గ్రంథాలయములు ఆంధ్రదేశమున ౮౦౦ లకు పైగా ఉన్నవి. ఇందు ఈ సంవత్సరము మద్రాసు ప్రభుత్వమువారివలన ౫౯ గ్రంథాలయములు మాత్రమే రు ౪౪౭౦ ల గ్రాంటును పొందగలిగినవి. ఈ సంవత్సరము మదరాసురాష్ట్ర మంత్రిటికిని ౧౨౯ గ్రంథాలయములకు మాత్రము రు ౯౭౪౨ ల గ్రాంటును ప్రభుత్వము మంజూరు చేసినది. దీనినిబట్టియే మద్రాసు ప్రభుత్వమువారికి గ్రంథాలయోద్యమము పైగల విముఖత్వము స్పష్టపడుచున్నది. ప్రభుత్వమువారిచ్చు గ్రాంటు ప్రకటింపగనే యిచ్చెదరు. గవర్నమెంటువారెంత ధనమిత్తురో అంత మొత్తమును గ్రంథాలయమువారు కూడ చేర్చి, గ్రంథాలయమునకు గ్రంథములను ఖరీదు చేయవలెను. రెండుమొత్తములను కలిపి ఆ ధనముతో ఏయే పుస్తకములు కొనదలచిరో ముందుగా ప్రభుత్వమువారికి- అనగా జిల్లావిద్యా శాఖాధికారికి-జాబితా వ్రాసి పంపవలెను.

అందు జిల్లావిద్యా శాఖాధికారిగారు నిర్ణయించిన పుస్తకములనే కొనవలెను. వారు కాదనిన పుస్తకమును కొనరాదు. అప్పుడు వారిచ్చుధనము ఇచ్చెదరు. గ్రంథాలయములను రెజష్టరు చేయించుటకు ధనములేనికతన ప్రభుత్వసహాయమును చాల గ్రంథాలయములు పొందజాలకున్నవి. ప్రభుత్వమువారిపై చిక్కులను పడలేక చాల గ్రంథాలయములవారు సహాయమును కోరుట లేదు. ఆశపడి దరఖాస్తులను పెట్టుకొనినవారిలో చాలమంది తమ దరఖాస్తులగతి ఏమైనదో తెలియక నిరాశ చెందుచున్నారు. ప్రభుత్వమువారికిగల గ్రంథాలయోద్యమాభిమానమిట్లున్నది. ఇంక జిల్లా విద్యాశాఖాధికార్లు పుస్తకములను నిర్ణయించు వైఖరిని విమర్శింతును. మన దేశమున రాజకీయ పుస్తకములే తక్కువ. ఇప్పుడిప్పుడే కొన్ని బయలుదేరుచున్నవి. జిల్లా విద్యాశాఖాధికారులు గ్రంథాలయములవారు పంపినజాబితా చూచి పుస్తకములను చూడకుండగనే చదువకుండగనే పేరును చూచి రాజకీయమైన పుస్తకమని భయపడి కొనకూడదని బహిష్కరించుచున్నారు. రాజద్రోహ పూరితములని ప్రభుత్వము వారు ప్రకటించిన గ్రంథములను బహిష్కరించుట ఒక విధముగ అంగీకరింప తగినదే. రాజకీయమై దేశమునకు సంబంధించిన వివిధవిషయములను గురించిన పుస్తకములు గ్రంథాలయములలో నుండకూడదని నిర్ణయించుట కడుంగడు శోచనీయము. జిల్లావిద్యాశాఖాధికారుల నిర్ణయములకు ఒక హద్దు ఒక పద్దులేదు. ఒక జిల్లా విద్యా శాఖాధికారి అంగీకరించినదింకొక అధికారి అంగీకరింపడు. ఎవరిచిత్తమువచ్చినట్లు వారు తీసివేయుటతప్ప వారికొక కట్టుబాటులేదు. ఏపుస్తకము ఎందుకు తీసివేయుచున్నారో వారికే తెలియదు. పుస్తకములను చదివియైనను తీసివేయుట మేలు. ఏమియు తెలిసికొనక భ్రమ చెంది కొనకూడదని నిర్ణయించుట ఏటిన్యాయము?

కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారిగారీ సంవత్సరము ఈ దిగువ పుస్తకములను బెజవాడలోని శ్రీభ్రమరాంబా మల్లేశ్వరాంధ్ర గ్రంథాలయమువారు కొనకూడదని నిర్ణయించిరి. దీనిని బట్టియే ఆ అధికారికిగల లోకజ్ఞానమును చదువరులు నిర్ణయింపవచ్చును.

భారతరాష్ట్ర శాసనసభల ఎన్నికలు, లోకలుబోర్డు ఎన్నికలు, ఎలెక్షను నేరములు, విశ్వాసరాహిత్యపు తీర్మానములువీనిని గూర్చి శ్రీ అవసరాల వెంకటనర్సు, బి. ఏ.

బి. ఎల్. గారు 'ఎలక్షన్లు' అను పేర ఒక గ్రంథమును రచించిరి. అది ఆంధ్రపత్రికా ముద్రాలయమున ముద్రింపబడినది. ఆ పుస్తకమంతయు ౧౯౩౫ సం॥రపు ఇండియా పరిపాలన చట్టములోని ఎన్నికలకు సంబంధించిన నియమములను ఆంగ్లమునుండి తెలుగు భాషలోనికి తర్జుమా చేయబడినదే. ౧-౪ ౩౭ నుండి అమలు చేయబడనున్న రాజ్యాంగమునకు సంబంధించిన నిబంధనలు అందువివరింపబడినవి. ఇక మునిసిపల్ ఎన్నికలు, హైకోర్టు తీర్పులు మున్నగునవి వ్రాయబడినవి. ప్రభుత్వము వారి నిబంధనలను తెలుగు భాషలోనికి తర్జుమా చేసి ప్రకటించిన యీ గ్రంథమును కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి దేనినిబట్టి కొనకూడదనెనో తెలియదు. 'ఎలక్షన్లు' అని గ్రంథనామం బగుటంచేసి కాంగ్రెస్సుకు సంబంధించిదని అపువభ్రమించి తీసివేసి యుందురేమో! మరియు కాశీనాధుని పూర్ణమల్లికార్జునుడు గారిచే రచింపబడిన 'నూతన రాజ్యాంగ విధానము' అను పుస్తకమును కూడ కొనకూడదనిరి. ఈ గ్రంథమంతయు నూతన రాజ్యాంగశాసనములోని రాజ్యాంగవిధానమును తెలుపుచున్నది. ఇదియు ఇండియా చట్టములోని ముఖ్యభాగములకు తెలుగుతర్జుమా అని చెప్పక చెప్పుచున్నది.

ప్రభుత్వమువారు ప్రకటించిన నిబంధనలకు, సూత్రములకు అనువాదము లనందగిన యిట్టి గ్రంథములనే కొనకూడదనిన ఇక చెప్పెడి దేమున్నది? మచ్చున కీరెండు ఉదాహరించితి. ఇంకను వారు కొనకూడదని నిర్ణయించిన పుస్తకములపట్టిక పూర్తిగ క్రింద తెలుపుచున్నాడను.

## ఆంధ్రగ్రంథములు

౧. హిందూదేశము క్రైస్తవప్రభుత్వనిర్మాణతత్త్వము.
౨. ఫాసిజం - కమ్యూనిజం.
౩. కారల్ మార్క్సు ఉపదేశములు.
౪. సోషలిజం ఎందుకు.
౫. నేటి స్పెయిన్.
౬-౭. అధునిక రాజ్యాంగసంస్థలు.

## ౧, ౨ భాగములు

౮-౯. చైనాజాతీయోద్యమము.

## ౧, ౨ భాగములు

౧౦. భారతీయకార్మికోద్యమచరిత్ర.
౧౧. స్వాతంత్ర్య మెవరికొరకు.
౧౨. సురానంద.
౧౩. కర్నాటక రాజ్యనాశనము.
౧౪. కల్లుపెంట.
౧౫. పరమూర్ఖ జడ్జిమెంటు.
౧౬. ఓటు.
౧౭. సీతారామరాజు మరణకారణము.
౧౮. తిలకు సెక్యూరిటీకేసు ఉపన్యాసము.
౧౯. నా ఎలెక్షను అనుభవము.
౨౦. లోకభయంకరుడు.

## ఆంగ్ల గ్రంథములు.

21. The Modern Indian Peasant
22. The Philosaphy of the Village Movement
23. Why the Village Movement ?
24. The Heart of India
25. Speeches and writings of Sarojininaidu
26. India and the World
27. New Constitution of India
28. Glimpses of World History
29. Letters from a Father to his Daughter

వర్తమానకాలమున ఇట్టిగ్రంథములను భారతదేశప్రజలు చదువుట చాల అవసరము. గ్రంథాలయముల వారు ఇట్టి గ్రంథములను కొనకూడదని అధికారులు నిర్ణయించుట చాల అన్యాయము. రాజకీయవిజ్ఞానము ప్రజలలో ఇనుమడింపవలసిన యికాలమున ఇట్టినిర్ణయములు జిల్లావిద్యాధికారులు చేయుట కడుంగడు విమర్శనీయము. ప్రభుత్వమువారీవిషయమై విచారణ గావించి యిట్టి నిర్ణయములు చేయకుండ విద్యాశాఖాధికారులను మందలింపవలసియున్నది. ఆంధ్రదేశగ్రంథాలయసంఘము వారును, మద్రాసుఅసెంబ్లిసభ్యులును ఈ విషయమై తీవ్రాందోళనము చేసి, ప్రభుత్వముచే నిషేధింపబడని రాజకీయగ్రంథములను గ్రంథాలయములవారు కొనకూడదను జిల్లావిద్యాశాఖాధికారుల నిర్ణయములను రద్దు చేయించు టత్యవసరమని విన్నవించుచున్నాడను.

## తాడేపల్లిగూడెము తాలూకా గ్రంథాలయ సంఘము

# చతుర్థవార్షిక నివేదిక ౧౯౩౬—౩౭

### వెనుకటిచరిత్ర.

తాడేపల్లిగూడెము తాలూకా గ్రంథాలయసంఘము ౧౨-౧౧-౩౩ వ తేదీని నెలకొల్పబడి, ఇప్పటికి సుమారు ౩ సంllరముల ౪ మాసములనుండి ఈ తాలూకాయందలి గ్రంథాలయోద్యమవ్యాప్తికి పాటుపడుచుండెను. ఈ సంఘము ప॥ గోదావరిజిల్లాసంఘమునకును, ఆంధ్రరాష్ట్ర గ్రంథాలయ సంఘమునకును, శాఖగా చేర్చబడినది. లోగడ జరిగిన ౩ తాలూకా సభలకు శ్రీయుత న. సత్యనారాయణగారును, అ. కాళేశ్వరరావుగారును, శ. సుబ్బారావుగారును, అధ్యక్షత వహించియుండిరి. ఈ చతుర్థమహాసభకు గ్రంథాలయోద్యమ నాయకులగు శ్రీయుత గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు ప్రారంభకులుగను, శ్రీయుత మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు అధ్యక్షులుగను, అరుదెంచుట ముందు కార్యక్రమ సాఫల్యమునకు ఎంతయు శుభసూచకము. ౧౯౩౫ సంllములో ప్రథమ గ్రంథాలయ యాత్రను జరిపియుంటిమి. మరల ౨ సంllములకు నేడు శ్రీయుత అయ్యంకి వేంకట రమణయ్య పంతులుగారిచే, ద్వితీయ గ్రంథాలయ యాత్రను ప్రారంభింపజేసి యుంటిమి.

### ఇప్పటి చరిత్ర.

ఈ తాలూకాయందు ౬౦ గ్రంథాలయములు కలవు. ఇవి ౧౨ గ్రూపులుగా విభజింపబడి, గ్రూపుడైరెక్టరుల పరిశీలనముక్రింద పనిచేయుచున్నవి. ఇందు ౩ జిల్లాబోర్డు గ్రంథాలయములు; ౩౭ పంచాయతీబోర్డుగ్రంథాలయములు; ౨౦ సంఘ(కమిటీ) గ్రంథాలయములు; జిల్లాబోర్డుగ్రంథాలయములు చక్కగా పనిచేయుచున్నవి. సంఘగ్రంథాలయములు, ఆర్థికలోపము కలిగియున్నను యథాశక్తిని పాటుపడుచున్నవి. పంచాయతీబోర్డు గ్రంథాలయములు మాత్రము లోకలుబోర్డు ఇన్‌స్పెక్టరుగారడుగడుగునకు పెట్టుచున్నయాటంకములవలన నిరుపయోగముగ పరిణమించుచున్నవి.

### తాలూకాసంఘము చేసినకృషి.

౧. తాలూకా కార్యనిర్వాహకవర్గము ౫ పర్యాయములు సమావేశమయ్యెను.

౨. ఆంధ్రపత్రికను రు ౧౮ లు తగ్గింపురేటునకు తెప్పించుచున్నారు.

౩. భారతి రు ౪-౮-౦ తగ్గింపు రేటునకు తెప్పించుచున్నారు.

౪. జిల్లాకలెక్టరుగారు, ఖాళీస్థలములను ఉచితముగ గ్రంథాలయభవనములనిమిత్త మిచ్చుటకు వాగ్దానము చేసిరి.

౫. మూడు నూతనగ్రంథాలయములను పెట్టించిరి

౬. ఆంధ్రపత్రికను తెప్పించుచున్న గ్రంథాలయములు ౧౮

౭. భారతిని తెప్పించుచున్న గ్రంథాలయములు ౬

౮. గ్రంథాలయసర్వస్వమును తెప్పించుచున్న గ్రంథాలయములు ౯

౯. గవర్నమెంటు గ్రాంటునకు దరఖాస్తులు పెట్టిన గ్రంథాలయములు ౧౫

౧౦. జిల్లాబోర్డు గ్రాంటునకు దరఖాస్తులు పెట్టిన గ్రంథాలయములు ౯

౧౧. లోకలుబోర్డు ఇనస్పెక్టరుకు ౨౧౩ వ సర్క్యులరు ప్రకారము అనుమతినిమిత్తము పంపబడిన దరఖాస్తులు ౧౦

౧౨. జిల్లావిద్యాధికారిఅంగీకారనిమిత్తము పంపబడిన గ్రంథముల జాబితాలు ౧౦

౧౩. వార్షికోత్సవములు జరిపిన గ్రంథాలయములు ౭

౧౪. మ్యాజికులాంతరుఉపన్యాసములు ౭

౧౫. కార్యదర్శి స్వయముగా వెళ్ళినగ్రంథాలయముల సంఖ్య ౨౪

మరియు గ్రంథాలయడైరెక్టర్లు, వారి వారి గ్రూపుల యందలి గ్రంథాలయములకు తఱచు వెళ్ళుచుండిరి.

౧౬. గీతాభూమిక, శ్రీకృష్ణానందాభయప్రదీపిక మున్నగు గ్రంథములను గ్రంథకర్తలనుండి తెప్పించి ఉచితముగ గ్రంథాలయములకు ఈయబడెను.

౧౭. ఆll గోవిందాచార్యులు, మానికొండ సత్యనారాయణగార్లు, హిందూస్థాన్ పబ్లిషింగుకంపెని ఆనందప్రెస్సు, సరస్వతీ గ్రంథమాల, హరిజనగ్రంథమాల - వీరి గ్రంథములను తగ్గింపురేట్లకు మాటలాడి గ్రంథాలయములకు తెప్పించుటకు తోడ్పడి యుండిరి.

౧౮. గ్రంథాలయనిర్వాహకులను సమావేశపఱిచి చందాదార్లను చేర్చుటకును గ్రంథములజాబితాలను తయారుచేయుటకును గ్రాంటులను సేంక్షను చేయుటకును హెచ్చరించి యుండిరి.

౧౯. కొన్ని గ్రంథాలయములకు రిజిష్టర్లు సప్లయి చేసి యుండిరి.

౨౦. "వయోజనవిద్య" అను పొత్తములను ప్రచురించి జిల్లాయందలి అన్నిగ్రంథాలయములకు ఉచితముగా పంచియుండిరి.

"ప్రచురణలు" కొన్ని గ్రంథాలయముల ఉపయోగార్థము అచ్చువేయించి అన్నిగ్రంథాలయములకు సప్లయి చేసి యుండిరి.

౨౨ సాలుసరినివేదికలు, లోకలుబోర్డు ఇన్‌స్పెక్టరు దరఖాస్తు ఫారములు మున్నగునవి అచ్చువేయించి గ్రంథాలయములకు సప్లయి చేయబడెను.

## గ్రంథాలయముల కృషి.

| | |
|---|---|
| సొంతభవనములుగల గ్రంథాలయములు | ౧౦ |
| వానిఖరీదు | రు ౨౫౦౦౦ |
| గ్రంథాలయముల హెచ్చుఆదాయము | రు ౬౦౦ |
| గ్రంథాలయములయొక్క తక్కువవ్యయము | రు ౧౭ |
| గ్రంథములసంఖ్య హెచ్చు | ౧౦౦౦ |
| వాటి ఖరీదు | రు ౬౦౦ |
| వార్తాపత్రికల సంఖ్య (సగటు) | ౭ |
| గ్రంథాలయము ౧కి పనిచేసిన సగటుదినములు | 300 |
| దినము ౧కి పనిచేసిన సగటుకాలము | గం ౬ |
| చదువబడిన గ్రంథముల సగటుసంఖ్య | ౧౫౦ |
| గ్రంథాలయములకు వచ్చినవారి సగటుసంఖ్య రోజునకు | |
| సభ్యుల సగటుసంఖ్య | ౧౫ |
| చందారేటు | ౦-౪-౦ నుండి ౫-౦-౦ |
| రిజిస్టరు అయిన గ్రంథాలయములు | ౨ |
| మూలనిధి కలిగిన గ్రంథాలయములు | లేవు |

## శ్రీయుత టి. సి దత్తాగారి పర్యటనము.

వంగరాష్ట్ర గ్రంథాలయసంఘ ప్రధాన కార్యదర్శిగారగు శ్రీయుత టి. సి. దత్తాగారును, వారి సతీమణియు అయ్యంకి వేంకటరమణయ్యగారును ఈ తాలూకాయందు ౧౨ గ్రంథాలయములను దర్శించి, విశేషప్రబోధము కావించిరి.

## గ్రంథాలయముల గ్రాంటులు.

గవర్నమెంటువారు 3 జిల్లాబోర్డుగ్రంథాలయములకు రు 33౬ లును, ౨ సంఘగ్రంథాలయములకు రు ౭౦ లును సేంక్షను చేసిరి. జిల్లాబోర్డువారు గ్రంథాలయముల కెట్టి ఆర్థిక సహాయమును చేసియుండలేదు. పంచాయితీబోర్డులకు ప్రత్యేకించిన గవర్నమెంటుగ్రాంటునకు దరఖాస్తులు సకాలమున వెళ్ళకపోవుటవలన, ఒక్కగ్రంథాలయమునకైనను గ్రాంటులు వచ్చియుండలేదు. పంచాయతీబోర్డులు ౨౧3 సర్క్యులరునుబట్టి అనుమతిలేనికారణమున పంచాయతీద్రవ్యమును ఖర్చుచేసి యుండలేదు.

## సంఘముయొక్క ఆదాయ వ్యయములు.

ఆదాయము రు3౬ లు. వ్యయము రు౬౨. కార్యదర్శికి ఈసం॥రముకూడ చేతిసొమ్ము పడుట తప్పినదికాదు. వివరములు ఇందు జతపఱుచుచున్నాను.

## ఇప్పటి కర్తవ్యము.

౧ గ్రంథాలయములులేని ౨౧ పంచాయతీబోర్డులచే గ్రంథాలయములను పెట్టింపవలెను.

౨. గ్రంథాలయములులేక పంచాయతీబోర్డులు లేక ౧౦౦౦ జనాభాఉన్న ౧౨ గ్రామములలో నూతన గ్రంథాలయములు పెట్టవలెను.

3. "పొందూర్వ" ప్రణాళికప్రకారము గ్రంథాలయోద్యమ వ్యాప్తికి తోడ్పడుటకు జిల్లాబోర్డువారికి ఒత్తిడి చేయవలయును.

౪. లోకలుబోర్డు ఇన్‌స్పెక్టరుగారి ౨౧3 సర్క్యులరు వెంటనే రద్దుచేయుటకు కృషి చేయవలయును.

౫. గవర్నమెంటు గ్రాంటులను, అన్ని గ్రంథాలయములకు వచ్చునటుల సకాలమున కృషి చేయవలయును.

౬. రిజిస్ట్రేషనుఫీజు తగ్గించుటకు ప్రయత్నింప వలయును.

౭. ఎక్కువ కృషి చూపుటకు తాలూకా కొక గ్రంథాలయవిచారణకర్తను కొంత గౌరవభృతితో నియమింపవలయును.

౮. గ్రంథాలయసంఘమును రిజిస్టరు చేయుటకు ప్రయత్నింపవలయును.

౯. గ్రంథాలయ సంఘమునకు ఆదాయము చేకూర్చుటకు ఒక నాటకమును ఏర్పాటు చేయవలయును.

౧౦. చక్కగ నడపబడుచున్న గ్రంథాలయమునకు తిరుగుడుగిన్నె (Rolling Cup) ఒకటి బహుమతిచేయుటకు ధనము చేకూర్పవలయును.

౧౧. వ్యాజికులాంతరు కొనవలయును.

౧౨. వేసవిసెలవులలో ఉన్నతవిద్యార్థులచే గ్రంథాలయములవద్ద ఉపన్యాసములు ఏర్పాటుచేయవలయును.

౧3. ఒకే గ్రామమున హెచ్చు గ్రంథాలయములున్నచో వాని నన్నిటిని సమ్మేళనము చేయుటకు ప్రయత్నింపవలయును.

౧౪. గ్రంథాలయములకుగల స్థిరాస్తులకు ట్రస్టుదస్తావేజులు(Trust deeds) రెజిస్టరు చేయింపవలయును.

## ముగింపు.

ముందు సం॥ము పై కార్యక్రమము సరిగా జరుపుటకు గ్రంథాలయసేవకులకు దృఢసంకల్పమును, కార్యదీక్షయు ప్రసాదించుగాక యని యీశ్వరుని ప్రార్థించెదను.

తాడేపల్లిగూడెము, ౭—౪—3౭.

తే॥ సత్యనారాయణమూర్తి,
తా॥ గ్రంథాలయసంఘకార్యదర్శి.

# నాటకోపాధి జీవనులు

కూచిపూడిలోని బ్రాహ్మణ విద్వత్ప్రభువులందరును రూపకకళాభిజ్ఞాతలయ్యును తమజీవితములను గడపుకొనుటకు నాటకమునే యుపాధిగాగలవారు కారు. కాలములు మారిపోయి విద్యాభ్యాస ముద్యోగమునకే యను నర్థము స్ఫురించుచున్నను జ్ఞానార్జనముకొఱకు లక్ష్మీపుత్రులేల విద్యాభ్యాసము చేయరాదు? నాటకకళోపాసన వలన వారలయందు రసజ్ఞత పుట్టును. రసజ్ఞతయును రసగ్రహణములును అన్నదమ్ములు. అవి ఒకదాని నొకటివిడిచి యుండవు. రసజ్ఞులగు రూపకాభిమానులు తాము కష్టపడి నేర్చుకొనినవిద్యను తమంతట తాము లో నిముడ్చుకొని మురిసి పోవరు. ఉత్సవ దినములయందును పర్వదినములయందును వారి గ్రామమునకు వేంచేసి సిరవాసము చేయునటరాజు కోవెలయందును భగవత్ప్రసాదముకొఱకు నృత్యగీతాదులను జరుపుదురు. ఏకళకయినను పరమావధి ధనార్జనము కాదు. దేశమునందు దుర్భిక్షములేని సుఖదినములయందును విద్యావినమ్రు లగు పండిత ప్రభువుల కాలమునందును లలిత కళలనే కళాభిబంధురు లభ్యసింపవలయును. ధనార్జన ఐహికమయినది. ఆముష్మికమగు మరొక చింతయున్నది నిశ్చలమగు మనస్సుతో అరణ్యములయందు వృక్షమూల మాశ్రయించుకొని తపస్సొనంచు యోగియొక్క చింతనకు తుల్యమయినది. ఐహికములగు సుఖములకన్న అముష్మిక సౌఖ్యమునకు ముందంజవేయు ఆర్య సంప్రదాయానుగాములు అకళానేత్తలు చిత్స్వరూపమగు నటరాజు సాన్నిధ్యమందు గురుపాదునిముందు కొమరుడు తన ముద్దుపలుకుల నొలికించునట్లు తమ కళావిభవమునుచూపి అనన్యదుర్లభమగు తమ యోగమునుండి బాహ్యమును మరచి ముముక్షువు లగుదురు. అందులకే పరిపూర్ణకళావేత్త తన పాత్రధారణమునందు తన్ను తాను మరచిపోయి తత్క్షణమున కయినను యోగము నొందు నందురు. కూచిపూడివారు అభ్యస్తములగు కళల సాహాయ్యమున నిర్జీవమగు నూలమును, తేజోవంతమగు సూక్ష్మముతో మేళవించి, తమ కళాభిలాషను సార్థకపరచుకొందురు. మిగిలినవారు కొందరు సంసార చక్రపరిభ్రమణములకులోనై ధనార్జనకునై నాటకముల నుపాధిగా నంగీకరింతురు.

నాటకము:— కూచిపూడి వారి నాటకలక్షణముల నర్థము చేసికొనుటకు మున్ముందు నాటకమును గూర్చి యొకపరి యాలోచింతము. నాటకము దృశ్యకావ్యములకు చెందినది. సంస్కృతమున నాటకములు పూర్వము నుండియు కనబడుచున్నవి. ఆంధ్రమున నాటకము క్రొత్తగా పుట్టినది. సంస్కృత నాటకముల కనువాదములు తెనుగున రూపకము లయినవి. సంస్కృతానువాదములను విడిచిన తెనుగున అధునికమున నాటకములు లేవని చెప్పవచ్చును. ఇరువదవ శతాబ్దమున స్వతంత్రము లగు నాటకములు వ్రాయబడుచున్నవనుట సత్యమే. వీనికి మూలములు సంస్కృత నాటకములే

తెనుగున పూర్వ శతాబ్దములయందు నాటకము లేవుగాని మధ్యమధ్య వచనములతో కథాభాగముల సంయోగము కూర్చబడిన 'జక్కుల పాటలు' గలవు. సంస్కృతమున 'యక్షగానము'లందురు. ఈ యక్షగానములనుండి నాటక మవతరించినదేమోయని కొందరి యభిప్రాయము. యక్షగానములనుండి 'హరికథ'లు పుట్టియుండవచ్చునని కొందరి యభిప్రాయము. యక్షగానముల విషయ విమర్శనము స్వవిషయమునకు దూరమగుటచే విడువవలసియున్నది. ఏదిఎటులున్నను కూచిపూడి నాటకములు యక్షగానములను పోలియుండుననుటలోసందేహము లేదు. యక్షగానములయందుగాని వానికి ప్రస్తుత రూపములగు హరికథలయందుగాని కథాభాగమంతయు నొక్కనిచే వచింపబడును. ఆ వక్త ఒక్కొక్క క్షణమునకు ఒక్కొక్క పాత్రను ధరించి కథాభాగమును చూపించును మధ్య వచనములతో పాత్రలకు గల సంబంధమునుగూడ తెలుపును. కూచిపూడివారి నాటకములయందు వివిధములగు పాత్రలు వేరువేరు నటులచేతనే అధునికములగు నాటకములందువలె అభినయింపబడును. కాని మధ్యమధ్య కథాభాగమును యవనికముందున నిలబడి నాటకనియంతయగు వృద్ధబ్రాహ్మణుడు వచనమునగాని, కీర్తనముల వలనగాని వ్యక్తపరచి రాబోవు కథాభాగమును సులువుగా గ్రహించుటకు సామాజికులను సంసిద్ధపరుచును. కూచిపూడి భాగవతు లభినయించు నాటకములయందు ఎంతగా నాగరికత చొరబడినను పూర్వాచారము లింకను తల మాయ లేదు.

నాటకముయొక్క పరమార్థము వినోదము కాదు. నాటకము ధర్మార్థకామమోక్షములవ్యక్తీకరింపవలయును. దాని పరమావధి ధర్మార్థకామమోక్షములలో తుదకొకదానినైనను ప్రతిబింబింపజేయుటయే. సాహిత్య

వేత్తలు వచించిన లక్షణములతో వ్రాయబడి ఆడబడు నాటకములు ధర్మార్థకామమోక్షములు పరమావధిగా గలిగియుండును.

నాటకమున జీవమునిల్పి రసము చిప్పిలుటకు సాధనము లనేకము లవసరము. పాత్రధారి తన వేషమునందు తన్ను తాను మరచిపోయి రూపముదాల్చిన పాత్రను వ్యక్తీకరించుకొని ప్రేక్షకులకు గూడ తనయందు ఆవేశించిన మాతవ పాత్రను కనుల గట్టినట్లు చేయవలయును. అప్పుడే నాటకము సజీవమై రససరసివలె నుండును.

నటుడు యోగితుల్యుడు. వ్యత్యాసము మాత్రము కలదు ఇంద్రియనియమము గలిగినయోగియొక్క యోగము క్షణికముగాదు. సుస్థిరము. కాని నటునియందు మాత్రము క్షణికము. యోగము నలవరుచుకొనుటకు నాటకరంగ పాత్రధారణ మొక సాధనము. యోగి నిశ్చలమగుఆనందమునకు పెనగుకొని వెదకులాడును. అతడు యావచ్ఛక్తిని భగవంతుని కనుగొని ఆ ప్రకృతిపురుషులలో లీనమగుటకు యత్నించుటలో వినియోగించును. తద్విధముననే యోగి తనయోగమున పరమాత్మను చూచుకొనవలయును. కూచిపూడి నటు లట్టి యోగమునకు చిరప్రియులు. వా రాడు నాటకములు పవిత్రము లయినవి. భగవంతునికథాలాపములు. వారి నాటకములలో సుప్రసిద్ధము లగునవి: ౧. ప్రహ్లాద. ౨ శశిరేఖాపరిణయము. 3 ఉషాపరిణయము. ౪. రామనాటకము. ౫ హరిశ్చంద్ర, ౬ నలచరిత్రము, మొదలగునవి. ఈ నాటకములయందు ఉత్తమనాయకులు ధీరోదాత్తులుగా చిత్రింపబడిరి. ఈనాయకుల చరిత్రము సర్వజనముల కాదర్శప్రాయము. భగవంతుని దగ్గరకు మనస్సులను గొంపోవు రూపకములలో భగవంతుని నృత్యగీతాదులవలన స్తోత్రము చేసి తమ కళను భగవత్కైంకర్యము చేయుదురు గనుకనే కూచిపూడి నటులకు భాగవతులను సార్థకనామము వచ్చినది. ఈభాగవతుల మరికొన్నికళలను పరిశీలింతము.

---

# గ్రంథాలయ వృత్తాంతములు

## శ్రీ వేంకటేశ్వర గ్రంథాలయము
## వేంకటేశ్వరవాడపల్లి.

దీని వార్షికోత్సవము ది ౧౧-3-3౪ తేదీని రాత్రి ౭ గంటలకు శ్రీయుత నందూరి బంగారయ్యగారి అధ్యక్షతను అత్యుత్సాహకరముగా జరిగినది. అధ్యక్షులు గ్రంథాలయములనుగూర్చి చక్కగా ఉపన్యసించిరి. గ్రంథములువిలువగల దస్తావేజులవలె భద్రపఱుపదగినవనియు, జాతీయాభ్యుదయము తాత్కాలికదృష్టిని శాశ్వతదృష్టితో సమగ్రముగ అన్వయించుటపై ఆధారపడియుండుననియు, అట్టిసమయము పూర్వము మనదేశమున ఉండెనుగాని ఇపుడు అంతటను మృగ్యమగుచున్నదనియు, శాశ్వతదృష్టిని పెంపొందించుకొనవలెననియు, గ్రంథకర్తలకును ప్రజలకును పరిచయము కలిగించుబాధ్యత గ్రంథాలయములపైనున్నదనియు, ఈ భారములనన్నిటిని నిర్వహించి గ్రంథాలయములు దేశమునకును భాషకును అభ్యుదయము చేకూర్చవలెననియు బోధించిరి. ఇంకను పలువురు ఉపన్యాసకులు పలువిషయములనుగూర్చి ముచ్చటించిరి. గ్రామసౌభాగ్యగోష్ఠిక అధ్యక్షులగు శ్రీయుత పుణ్యమూర్తుల రాజశేఖరం, బి. ఎ., బి. ఇ డి. గారు అందఱకును కృతజ్ఞతావందనము లర్పించిరి.

## శ్రీ భ్రమరాంబా మల్లేశ్వరాంధ్ర
## గ్రంథాలయము, బెజవాడ.

దీని ౧౬ వ వార్షికోత్సవము గుంటూరుజిల్లా జడ్జి మ॥ రా॥ శ్రీ నంబూరి గోపాలకృష్ణారావు శ్రేష్ఠి బి. ఏ., బి. ఎల్.గారి అధ్యక్షతను మిక్కిలి వైభవముగా జరిగినది. గ్రంథాలయాధ్యక్షులగు శ్రీయుత చుండూరు సీతారామయ్యగారు స్వాగతమిచ్చిరి. శ్రీయుత కాకరపర్తి భావనారాయణ శ్రేష్ఠిగారు సరస్వతీ పతాకము నెగురవేసిరి. శ్రీయుత మద్ది వెంకటసుబ్బయ్య శ్రేష్ఠిగారు ప్రారంభోపన్యాసమిచ్చిరి. సభాధ్యక్షులు సనాతన మతాచారములను పాటింపవలెననియు, సంస్కృతము చదువవలెననియు హెచ్చరించిరి. కార్యదర్శి శ్రీయుత కోట నాగభూషణముగారు నివేదిక చదివిరి. అధ్యక్షులు కీ॥ శే॥ గోకవరపు సుబ్బారావు ఎండూరు వీరయ్యగార్ల ఛాయాపటములను బహిరంగపఱచిరి. పిమ్మట గ్రంథాలయములను గూర్చి శ్రీయుత మారేపల్లి రామచంద్రశాస్త్రి, అయ్యంకి వేంకటరమణయ్య, కొంకిమళ్ళ నాగభూషణరావు, మల్లెలశ్రీరామమూర్తి, పుచ్చా వేంకటామయ్యగార్లును, దువ్వూరి సుబ్బమ్మగారును ఉపన్యసించిరి.

## శ్రీ వాణీమందిరము వారి బోటు గ్రంథాలయము, పెదపాలెము

దీని వార్షికోత్సవము ది ౧-౭-౩౭ తేదీని కొల్లూరిలో బోర్డు హైస్కూలులో అత్యుత్సాహకరముగా జరిగినది. విద్యార్థులు పలువురు ఉపన్యసించిరి. శ్రీయుత కస్తూరి కుటుంబరావుగారు ప్రదర్శనము చేసిరి.

## శ్రీ సరస్వతీవిద్యార్థి పబ్లిక్ గ్రంథాలయము, చింతలపూడి

దీని వార్షికోత్సవము ది ౧-౭-౩౭ తేదీని మ. రా. పి. పాండురంగారావుగారి (డిప్యూటితహస్సీలుదారు) అధ్యక్షతను బాగుగా జరిగినది. ఒకరు ప్రశంసాపద్యములు చదివిరి. పలువురు ఉపన్యసించిరి. కార్యదర్శి నివేదిక చదివె. ఉదయము సరస్వతీపూజయు నగరసంకీర్తనమును చేసిరి.

చింతలపూడితాలూకాలో ఉన్న గ్రంథాలయములు చాల తక్కువ. అందు చేత వార్షికోత్సవము జరిపి, ఈ గ్రంథాలయమువారు తాను చేయుచున్న పనిని ప్రకటించుట సంతోషకరము. తగినకృషి చేసి, దీనిని తాలూకాకు కేంద్రగ్రంథాలయముగా ఒనరించి, తాలూకాలో గ్రంథాలయములు హెచ్చుగా లేని లోపము తీర్ప ప్రయత్నించుట మంచిది.

## శ్రీరామగ్రంథాలయము, శివరామపురాగ్రహారము

దీని పదునాఱవ వార్షికోత్సవము ది ౮-౭-౩౭ తేదిని అత్యుత్సాహముతో జరిగినది. శ్రీ గోరుగంతు అచ్యుత సూర్యనారాయణశర్మగారు ప్రశంసాపద్యములు చదివిరి.

## శ్రీ వరదరాజమ్మగ్రంథనిలయము, బేస్తవారపుపేట

దీని ౯ వ వార్షికోత్సవము ది ౪-౭-౩౭ తేదిని సాయంకాలము ౫ గంటలకు కంభము బోర్డుహైస్కూలు హెడ్ మేష్టరు శ్రీ ఎమ్. అప్పలనరసయ్య ఎమ్. ఏ., ఎల్. టీ. గారి అధ్యక్షతను సంతోషప్రదముగ జరిగినది. అధ్యక్షులును, ఇతరులును గ్రంథాలయముల ఉపయోగములు, వానిని వాడుకొనువిధము, అర్థికాభివృద్ధికి సాధనములు మొదలగు విషయములను గూర్చి ఉపన్యసించిరి. గ్రంథాలయ ప్రదర్శనము జరిగినది.

## కంభం తాలూకా గ్రంథాలయయాత్ర

పై గ్రంథాలయపక్షమున ౨౧-౭-౩౭ బుధవారము మొదలు ౨౮-౭-౩౭ వఱకు కంభముఫిర్కాలో జరుగును.

## బాలగంగాధరతిలక్ పుస్తకాలయము, పెదపులివర్రు

ది ౫-౯-౩౬ నుండి ౩౧-౫-౩౭ వఱకు జరిగిన కార్యక్రమము.

పాఠకులకు అందజేసిన పుస్తకములు:

| | |
|---|---|
| పురుషులకు | ౧౦౪౮ |
| స్త్రీలకు | ౫౧౨ |
| రిఫరెన్స్ చూచుకొన్నవి | ౯౪ |
| పాఠకులు | ౩౮౬౫ |
| క్రొత్త పుస్తకములు | ౧౬౦ |
| వీని ఖరీదు | రు ౧౦౫-౦-౦ |
| ఇప్పటికి పుస్తకముల మొత్తము | ౨౦౧౦ |
| గ్రంథాలయ ప్రదర్శనము | ౧ |

దీనికి పటములు సహాయము చేసినవారు:

అయ్యంకి వెంకటరమణయ్యగారు, (౫౦ పటములు).
చావలి నాగేశ్వరావుగారు, కాంగ్రెస్ మహానాయకుల ఫొటోలు ౫౦. వీని ఖరీదు రు ౨౫-౦-౦

పత్రికలు సహాయము చేసినవారు:

సముద్రాల వేంకటరాఘవాచార్యులుగారు,
వి. వి. యల్, పంతులుగారు,
తూములూరి యజ్ఞనారాయణశాస్త్రిగారు,
యార్లగడ్డ శ్రీకృష్ణచౌదరిగారు.

| | |
|---|---|
| జరిగిన మహాసభలు | ౮ |
| కార్యనిర్వాహకసంఘసభలు | ౧౬ |
| హాజరైన సభ్యులు | ౧౬౧ |
| చర్చించిన అంశములు | ౬౧ |

గ్రంథాలయమును దర్శించి తమ అభిప్రాయముల నిచ్చినవారు :

౧. యార్లగడ్డ శ్రీకృష్ణచౌదరిగారు,
రే. తా. గ్రం. సం. అధ్యక్షులు.

౨. వావిలాల గోపాలకృష్ణయ్యగారు,
ఆంధ్రదేశగ్రంథాలయ ప్రచారక కార్యదర్శి.

3. కొడాలి ఆంజనేయులుగారు,

౪. కస్తూరి కుటుంబరావుగారు,
గుం. మం. గ్రం. సం. ఉపాధ్యక్షులు.

౫. గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు,
ఆంధ్రదేశగ్రంథాలయ సంఘాధ్యక్షులు.

౬. మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు,
అం. దే గ్రం. సం. కార్యనిర్వాహక సంఘాధ్యక్షులు.

౭. పాతూరి సుబ్బయ్యచౌదరిగారు,
గుంటూరు జిల్లాబోర్డు అధ్యక్షులు.

౮. పి. వెంకటచలపతిగారు,
జూనియర్ డిప్యూటీ ఇన్స్పెక్టరు.
రేపల్లె.

ఉపన్యాసకులు :

పై పేర్లలో ౧, ౨, 3, ౪, ౫, ౬, ౭ సంఖ్యలవారు
విశ్వనాధ సత్యనారాయణగారు
చావలి కోటేశ్వరరావుగారు

## గుంటూరుమండల గ్రంథాలయ సంఘము ఎన్నికలు

పైసంఘముయొక్క సామాన్య సంఘ సమావేశము ది ౧౬-౫-3౭ తేదిని తెనాలిలో కాంగ్రెసుసంఘపు ఆఫీసులో ఉదయము గం ౯ లకు శ్రీయుత శరణు రామస్వామి చౌదరిగారి అధ్యక్షతను సమావేశమై యీదిగువ వారిని ౧౯3౭-3౮ సం|| మునకు కార్యనిర్వాహకసంఘముగా నెన్నుకొనిరి.

శ్రీయుత, శరణు రామస్వామి చౌదరిగారు,
అధ్యక్షులు.

,, వుటుకూరి జయరామదాసుగారు,
,, కస్తూరి కుటుంబరావుగారు, ఉపాధ్యక్షులు.
,, కొండూరి సీతారామయ్యగారు, కార్యదర్శి.
,, రాజా మానూరి వెంకట జానకిరావుగారు
,, వాసిరెడ్డి బుచ్చినాయుడుగారు
సహాయ కార్యదర్శులు.

(౧) మద్దుల వెంకటగిరిరావుగారు (౨) రాపర్ల శివరామకృష్ణయ్య చౌదరిగారు (3) అడుసుమిల్లి శ్రీనివాసరావుగారు (౪) శిఖాకొల్లి అంకయ్యగారు (౫) వాసిరెడ్డి సీతాపతిగారు (౬) వావిలాల గోపాల కృష్ణయ్యగారు (౭) రామస్వామిగారు (౮) తిరుమెళ్ళ పట్టాభిరామయ్యగారు (౯) రామరాజు వీరేశ్వరరావుగారు – కార్యనిర్వాహక సభ్యులు.

## గుంటూరుమండల గ్రంథాలయసంఘము

## విజ్ఞప్తి

గుంటూరుమండలములోని తాలూకాపట్టణ గ్రామగ్రంథాలయ సంఘములవారికి

అయ్యా!

పై సంఘమువారు మన మండల గ్రంథాలయ చరిత్రను అచ్చు వేయింపదలంచినారు గాన త్వరలో అన్ని గ్రంథాలయములయొక్కయు పఠనమందిరములయొక్కయు చరిత్రలను ఈదిగువచిరునామాకు పంపగోరుచున్నాను.

కార్యస్థానము మారినది కాన ఉత్తర ప్రత్యుత్తరములు నా పేరనే వ్రాయగోరెదను.

పెదపులివర్రు, (వయా) రేపల్లె. } కొండూరి సీతారామయ్య
కార్యదర్శి.

# గ్రంథవిమర్శనము

## బాలగోపాలశతకము :

ఇది శ్రీ తుర్లపాటి గురుస్వామయ్యకవిగారు రచించినారు. దీనిని శ్రీనాగపూడి కుప్పుస్వామయ్య, బి.ఏ. గారు పరిష్కరించిరి. ఇది భక్తిరసప్రధానము. ఇందలిపద్యములు మత్తేభశార్దూలవృత్తములు. శైలి బాగుగా ఉన్నది. మచ్చునకీ క్రిందిపద్యములు చూడుఁడు.

నీకంటెం బరు లేరు లేరు సురవర్గానిస్తుత్యా! సంరక్షకుల్;
నాకంటెం బరు లేరు లేరగతికుల్ నాతండ్రి! నిర్వ్యాజఁగా
నాకింకెవ్వరు దిక్కు? నీపదముఁ నే నాదిక్కుగా నమ్మితిన్
శ్రీకల్యాణగుణాకరా! భవహరా! శ్రీబాలగోపాలకా!

ఒకచో నిల్వక యేగుచుండెడుమనంబాక్రాంతనే పైనఁబూ
నిక నీధ్యానము సల్పనీయదుగదా! నేనెట్లు కన్గొందుఁ దా
వకరూపంబును దోఁపదేమియును దేవా! ప్రేమతో నీవుమా
మకచిత్తంబును నిల్పుమా సుగుణధామా! బాలగోపాలకా!

దీనివెల 0-2-0.

## ఘటికాద్రి నారసింహ నక్షత్రమాలిక :

ఇదియు పైకవిగారు రచించినదే. భక్తిప్రధానము. దీనినికూడ పరిష్కరింపఁజేసిన బాగుగా ఉండెడిది. దీనివెల రు0-2-0. పైపుస్తకములను వలయువారికి విలాసము: తుర్లపాటి గురుస్వామయ్యకవిగారు, చోళింగపురము, ఎమ్. ఎస్. ఎమ్. ఆర్ వై.

## అమృతసిద్ధి:

ఇది మణిమాలికలోనితొలిపూవు. దీనికర్త శ్రీయుతులు అక్కపెద్ది సత్యనారాయణకవిగారు; 'రసోపాసి.' వీరు శాయపురము (కృష్ణామండలము) వారు. వీనిని శ్రీయుత విశ్వనాథ సత్యనారాయణ ఎమ్. ఏ. గారు తెనుగువారికి పరిచయము చేసినారు. అందు "వీరు చిన్నప్పటినుండియు కవితావ్యాసంగము చేయుచునేయుండిరి. వ్యాసంగము సర్వత్ర నిశ్చితమైన ఉత్తమఫలప్రదము కాదు. కొద్దిమందికే యగును. వీరియం దది ఫలము పొందినదనియే చెప్పవచ్చును. బిగువుచెడని ధారాశుద్ధి వీరి కవనమునం దలవడినదని నాయూహ" అను మెప్పునకు పాత్రమయినది వీరికవిత్వము. దీనినిగూర్చి శ్రీయుత వారణాసి శ్రీనివాసరావు ఎమ్.ఏ., ఎల్.టీ. గారు "ఇందలికవితాశక్తి మనస్సుకెక్కినది. ఇట్టి చిల్లర గ్రంథములతో కాలక్షేపము సేయక యీకవి యేదియైన యొక యుద్గ్రంథరచనమునకు గడంగి యశస్సు గడించుఁగాకయని ఆశపడుచున్నాము." అని తెలిపిరి. శ్రీయుత కొటూరి వేంకటేశ్వరరావుగారు "ప్రాచీనకవిమార్గముల నెఱిఁగియిట్లు చక్కనికవిత్వము చెప్పువారరుదుగా నున్న యీకాలమున..........వీరి యీ ప్రథమగ్రంథమే యిట్లు ప్రౌఢమగు మంచి పాకమునఁ బడుట యదృష్టము." అని తమసంతసమును వెల్లడించిరి. ఇందువలన "అమృతసిద్ధి"లోని కవిత్వ ప్రాశస్త్యము తేటపడుచున్నది. కాని, మఱొకవిశేషము కలదు. అది ఏమందురా? విశ్వనాథమువారు తెలిపినటుల "ఈ చిన్నిగ్రంథమున భారతమువాసన ఆధునిక కవితావాసన రెండుఁ గలవు." ఇందలి కవిత్వమునుగూర్చి ఇంతకంటె చెప్పవలసినదేమి? మచ్చుపద్దెములే పై అంశములను చాటఁగలవు. ఈ పత్రికాముఖమున చేర్చుకొనగా వెలయు పద్దెపుగమి చూడుఁడు.

ఇందలికథ 'ధర్మవీరుఁడు' అగు కచుఁడు శుక్రుని శిష్యుఁడై, అతనివలన మృతసంజీవనీవిద్య సంపాదించి, తన్ను మోహించిన దేవయానివలపునకు చిక్కక శిష్యధర్మమును నిలుపుకొనిన వృత్తాంతము. కాన విద్యార్థులకు పఠనీయ గ్రంథముగా దీనిని కైకొనఁదగు. విద్యాధికారులటులొనరించి, కృతికర్తకు ప్రోత్సాహము కలిగింతురుగాక! అంతియకాక తెనుఁగుతల్లిని మన్నించువారెల్లరును ఈ పొత్తము చదివి, తనిసి, మేలొందుదురుగాక!

దీనివెల ఎనిమిది అణాలు.

# దుర్గాపూజ-పశుబలిదానము

శ్రీపండిత మదనమోహనమాలవ్యగారు

బలిదానమును గూర్చి చర్చలు సాగినప్పటినుండియు నాధ్యానమీ విషయమునందె కేంద్రీకరించియున్నది. అందువలన ఈ విషయమును గూర్చి శాస్త్రజ్ఞులతోను, పండితులతోను పరామర్శించితిని. మూలగ్రంథములను పరంపరగా రచించిన శాస్త్రములను అన్వేషించి చాల శాస్త్రజ్ఞానము సంపాదించితిని. తుదకు నేనే శాస్త్రీయాధారములతో ధార్మికజనులసమ్ముఖమున నిలిచి ప్రకటింప సమయోచితముగా కనిపించుచున్నది. నాయీపలుకులను మీకు వినిపింపఁజాలక పోవుటకు నాదేహబలహీనతయే కారణము. కాబట్టి వ్యాసరూపముగా శాస్త్రసమ్మతవిషయములనే వ్రాయుచున్నాను. ధర్మజ్ఞులు దీనివలన పూర్తి ఉపయోగము పొంది ఎల్లప్పుడును ఎల్లరకును సుఖసాధనమగు సాత్త్విక విధిచేతనే దేవీపూజ యొనర్చి సమర్థతతో ప్రచారము చేయుదురని ఆశించుచున్నాను.

కాళి మొదలగు దేవతలకు పూజచేయునప్పుడు నేడాచారములోనున్న పశుబలిదాన మిచ్చుట మానవులకర్తవ్యమైయున్నదా? లేదా? అనువిషయమిచ్చట ముఖ్యముగా విచారింపవలసియున్నది. పశుబలిలేనిచో పూజ పూజ అనిపించుకొనదా? దేవతల నుద్దేశించి చేయు పశువధవలన పాపము లేదా? ఇప్పటి పశుబలివిధానము శాస్త్రసమ్మతమా? శాస్త్రములు ప్రమాణముగా తీసికొని పైవిషయము లాలోచించినచో పశుబలి హింస, పాప మగుచున్నది. పశుబలి లేకున్నచో దేవాదిదేవతలకు ఉత్తమోత్తమపూజ అగుచున్నది. అదియేకాక ఇపుడు ఆచారములో ఉన్న ఈ విధానము శాస్త్రములతో ఏవిధముగను సంబంధించినది కాదు. కాబట్టి దేవతలపేర లెక్కలేనిప్రాణులను వధించుటను ఆపుటకు అందఱును ప్రయత్నింపవలెనని మిమ్ములను ప్రార్థించుచున్నాను.

నిర్ణయసింధువు మొదలగు గ్రంథములలోను దేవీభాగవతము భవిష్యపురాణము మొదలగు పురాణములలోను దేవీపూజనుగూర్చిన వర్ణనములు మహాత్త్వపూర్ణమైనవి.... జపయజ్ఞమాంసరహితనైవేద్యములతోడి పూజ సాత్త్వికము; బలిదాన మాంస నైవేద్యములతోడి పూజ రాజసము; మంత్రహీనమై కిరాతులకు సమ్మతమైనది తామసము-అని పశుబలితోడిపూజ కొన్నిటిలో కలదు. అయినను పశుబలి ఈయరాదని కొన్నిటిలో కలదు. పశుబలి ఎవ్వరికిని నిత్యవిధిలో చేరలేదు. గుమ్మడి కొబ్బరికాయలతోకూడ బలివిధానము పాటింపవచ్చును. బ్రాహ్మణులకు పశుబలిదానము నిషేధింపబడెను. ...క్షత్రియులకు యుద్ధాది స్థలములందు హింస ధర్మమైనను దేవీసమ్ముఖమున మాత్రము వారు దున్నలను మేకలను బలియీయరాదు. నవరాత్రిములలో అష్టమినాడు విజయముకొఱకు ప్రత్యేకాస్త్రములను పూజింపవలెనని ఉన్నది. కాని నేటి క్షత్రియులకు ఇది చాలకాలమునుండియు అవసరములేక పోయెను. ఇక వారు పశుబలిదానమేల చేయవలెను? మొత్తముమీద ప్రకరణములన్నియు చూడగా నవరాత్రిములలో పూజ ప్రధానకర్మగాని, పశుబలిదానము ప్రధానకర్మ కాదని, నిశ్చయముగా తెలియవచ్చుచున్నది. హేమాద్రి భాగవతాది గ్రంథములుకూడ ప్రధానవిధానము పూజ అనియే తెలుపుచున్నవి. స్వయముగానో ఇతరులచేతనో పూజ జరుపవలెనని దేవీపురాణము పల్కుచున్నది. హవిష్యము తిని గోపికలు దేవీపూజ చేసినట్లు భాగవతము నుడువుచున్నది. నవరాత్రిములందు ఉపవాసము కుమారీపూజావిధానమైనప్పటికిని పూజయే ప్రధానమని రత్నాకర దీక్షితుని సిద్ధాంతము. గంధాదులచే అర్చించి పూజచేయవచ్చునని నాగేశభట్టు తెలిపియుండెను. కాబట్టి పూజయు బలియు రెండు ప్రత్యేకకర్మలు. అయినను బలిని పూజతో కలిపి చేయుచున్నారు. కాని, ఏవిధముగానైనను పూజలో పశుబలి యీయవలసినఅవసరముగాని శాస్త్రముగాని కనిపింపదు.

# సంపాదకీయములు

ఖద్దరుసంస్థానమువారి కె. యస్. బాట్టరు కంపెనీ, బెజవాడ (వస్తుమార్పిడిశాఖ)లో రిజిస్టరు చేసికొన్న చందాదారులకు వస్తురూపకమగు చందామీఁద మాపత్రిక అందఁగలదు.

మేనేజరు

గ్రంథాలయ సర్వస్వము.

## గ్రంథాలయ సర్వస్వము

౨౦—౭—౩౭

**కాంగ్రెసువారు మంత్రులైరి :**

ఈ నెల ౧౪ వ తేదీని కాంగ్రెసువారు మన రాజధానిప్రభుత్వమును నడపు జవాబుదారీ వహించి మంత్రిపదవులు స్వీకరించిరి. ఇదివరకు తాత్కాలికపు మంత్రులుగా నుండిన సర్ కె॥ వి॥ రెడ్డినాయడుగారు వగైరాలు తమ పదవులకు అంతకుముందే రాజీనామా నిచ్చిరి.

* * * *

గవర్నరుతో సంప్రతించి మంత్రివర్గమేర్పరచిన గౌరవనీయులు శ్రీమాన్ సి. రాజగోపాలాచార్యులవారు ప్రధానమంత్రి. వారు ఆంతరంగిక- ఆర్థికశాఖలను పరిపాలింతురు. పోలీసుశాఖయు వారివశమున నుండును. ఈ క్రింది ఇతరులు వారివారి పేళ్ళయెదుట చూపిన విషయములను పరిపాలించుచు మంత్రివర్గమున నుండగలరు.

౧. గౌరవనీయులు
శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుగారు
ల్యాండురివిన్యూ

౩. గా॥ డాక్టరు టి. ఎస్. సీ. రాజన్ గారు
ఆరోగ్యము

౪. ,, ,, సుబ్బరాయన్ గారు
విద్య - న్యాయము

౫. ,, మౌలానా యాకుబ్
హుస్సేనుగారు
పబ్లిక్ వర్క్సు

౬. ,, వి. ఐ. మునిస్వామి పిళ్లేగారు
వ్యవసాయము-గ్రామాభివృద్ధి

౭. ,, ఎస్. రామనాథన్ గారు
పబ్లిక్ ఇన్ ఫర్మేషన్

౮. ,, వి. వి. గిరిగారు లేబరు-ఇండస్ట్రీ

౯. ,, కె. రామునిమీనన్ గారు
కోర్టులు - జైళ్ళు

౧౦. ,, బెజవాడ గోపాలరెడ్డిగారు
స్థానిక స్వపరిపాలనము

* * *

అసెంబ్లీకి గా. శ్రీబులుసు సాంబమూర్తిగారు అధ్యక్షులు (స్పీకరు), శ్రీమతి గా॥ రుక్మిణీలక్ష్మీపతిగారు ఉపాధ్యక్షులు. కౌన్సిలుకు గా॥డాక్టరు యు. రామరావుగారు, అధ్యక్షులు. గా॥ శ్రీ కె. వెంకటస్వామినాయడుగారు, ఉపాధ్యక్షులు.

* * *

వీరికి పార్లమెంటరీ సెక్రిటరీలుగా ఈక్రింది వారు నియమితులయినారు. ఇందులో శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు ముఖ్యకార్యదర్శిగా పనిచేయుచు ప్రధానమంత్రికి సహాయపడుదురు.

౧. శ్రీ తెన్నేటి విశ్వనాథముగారు

౨. ,, ఏ. బి. సెట్టిగారు

౪. ,, సీ. ఏ. వార్కీగారు

౫. ,, కే. ఆర్. కరంతుగారు
౬. ,, ఎస్. ఎస్. వరదాచారిగారు
౭. ,, మాగంటి బాపినీడుగారు
౮. ,, బయ్యా సూర్యనారాయణ మూర్తిగారు
౯. ,, ఎమ్. మార్కుయిర్ సాహెబుగారు
౧౦. ,, ఎమ్. భక్తవత్సలంగారు.

* * *

వీరినెల్లను మేము హృదయ పూర్వకముగ నభినందించుచున్నాము. కాంగ్రెసు మంత్రులకు నెలకు రు ౫౦౦ లును కార్యదర్శులకు రు ౨౫౦ లును నియమితమగునని తెలియుచున్నది. ఇది స్వరాజ్య ప్రభుత్వమున కంటికగపడు మొదటి సంస్కరణము. గౌ॥ శ్రీ సాంబమూర్తిగారు యథాపూర్వముగ కటిని గట్టిన ఖద్దరు కొల్లాయిగుడ్డ, పైనిగప్పిన ఖద్దరు ఖండువా, బుజమున వ్రేలెడు ఖద్దరుసంచి వీనితో అధ్యక్షపీఠ మలంకరించుట రెండవ యానందకర దృశ్యము.

* * *

ఇంతటికిని కారణభూతుడగు గాంధీజీ "మంత్రులేమి చేయగలరనుసూచన క్రింద వశిష్ఠ పీఠమునుండి ఆదేశమిచ్చినాడు నేటిమంత్రులు కాంగ్రెసుబంటులు. కాంగ్రెసు అధ్యక్షుడు మూడవతరగతి ప్రయాణికుడు. "మీరంతకంటె నెక్కుడు కోరుదురా? అన్నాడు వీరిని. ౧౫౦ ల ఇంటి అద్దె ౧౫౦ ల కారలవన్నులు అనుకొన్నది కూడ వీరు తగ్గించుకొనవలసియుందురనుకొందుము. రాముడు కృష్ణుడు చరిత్రకందరు. ప్రతాప సింహుడు శివాజీ బహు నిరాడంబరజీవులే. అధికారపదమున వారేమిచేసిరన్నది కొందరు సంశయింపవచ్చును. కాని ఉమరు, అబుబకరుల చరిత్ర నిస్సంశయము. దూరప్రాంతము లేలినవారి యనుచరులకు గూడ వారు ముతకగుడ్డ, ముడి పిండిమాత్రమే పెట్టిరి. ౧౯౨౦నుంచి సత్యాగ్రహమున తయారయిన కాంగ్రెసునాయకులు మంత్రులైనప్పుడు అంతకంటె ఎక్కువ కోరకుందురుగాక. అప్పుడు వారిపని వేలు చేయును. బీదలు వారినాశీర్వదింతురు. జయించి రాజ్యమేలిన బ్రిటిషుప్రభువుల నౌకరులుగా నుండి భోగము లనుభవించినట్టియు అనుభవించుచుండునట్టియు నౌకరులపై నిగూడ ఈ సాత్వికమంత్రము పారవచ్చును. ఇది గాంధీజీఆశ. అప్పుడు రామరాజ్యమేగదా !

* * *

గాంధీజీకి ఇండియా గవర్నమెంటు శాసనమును గురించి ఏవిధమైనవిశ్వాసమును లేదు. కాంగ్రెసువారు దానికి విధించిన శిక్ష - పూర్ణ తిరస్కారము - జరిగితీరవలెననియే అతని ఆశయము. అయినా ఇట్టిశాసనంలోగూడా ఉన్న గుణాన్ని గమనించడం తప్పుగాదు. వట్టికత్తితో రాజ్యమేలడం మాని ఈ శాసనం కారణంగా మెజారిటీల అభిప్రాయానుసారం - ఛాయామాత్రంగానైన- రాజ్యమేలించడం ఇందులో ఉద్దేశమని సాధించడానికి అవకాశం ఉంది. మూడు కోట్ల వోటర్ల నేర్పరచడం వారిప్రతినిధులచేతులలో విరివిగా అధికారంపెట్టడంచేత వేరేయర్థం తీయడానికిపీలుకాదు. ఈ శాసనం మననెత్తిన విధించిన కర్తలకు ఒక్క ఆశ లేకపోలేదు. విధించినదాన్ని క్రమంగా మనం ఒప్పుకుంటామని మన సౌభాగ్యానికి ఇతరులు అధికారులుగా ఉండడం మనం మేలేయని కడపటికి తలుస్తామని వారి యంతరంగంలో నిశ్చయము. ఏ ఉద్దేశాలతో ఈ కర్తలు శాసనం

చేసినారో ఆ ఉద్దేశాలను రద్దుపరచేట్టుగా ఈ శాసనాన్ని వినియోగించే కౌశల్యం మూడుకోట్ల వోటర్ల ప్రతినిధులవద్ద ఉందంటే వారి ఆశ భగ్నమయ్యే తీరుతుంది. కాబట్టి గాంధీజీ మన మంత్రుల కొక మంత్రోపదేశం చేసినాడు. పదవులలో ఉండే అధికారానితో సహా అన్ని అధికారాలను శాసనకర్తలు ఏవిధంగా మన ముపయోగ పరచుకోవలె ననుకొన్నారో దానికి భిన్నంగా ఉపయోగించినా మా శాసనము భగ్నమైనదన్న మాటే.

*　　*　　*　　*

పదవులలో గొప్పజీతాలు పెద్దబత్తాలు మనము తీసుకొని అందుకు వారికి మనము కృతజ్ఞులౌతామనుకొన్నారు బ్రిటిషు రాజనీతివేత్తలు. ఋషిసంప్రదాయం స్థాపించి దానికి వ్యతిరేకం చేయదలచినాం మనం. చదువులకోసం డబ్బు కావలెనని వారు వేసిన మత్తుపదార్థాలనీతిని బలపరుస్తా మనుకొన్నారు వారు. త్రాగుడును నిరోధించి చదువులు స్వయంపోషకములయ్యేట్టు తీర్చి ఆ ఆదాయాన్ని తోసిపుచ్చుతాం మనం. గాంధీ ఇర్విన్ను పేక్టు (ఒడంబడిక) లోని ఉప్పుషరత్తు అమలులో లేకున్నా సజీవంగా ఉంది. కాంగ్రెసు రాజ్యం ఏర్పడిన పరగణాలలోనైనా దాన్ని అమలులో పెట్టుదాం. ఉప్పు డబ్బులేకుండా, జరుగదనుకొన్న బ్రిటిషు శాసనకర్తలయోచనను విఫలం చేదాం. ఇనాళ్లు ఖద్దరంటే ప్రభుత్వం దూరం చేసేది. ఇప్పుడంతా ఖద్దరే కొందాం. ఏబ్రిటిషు వ్యాపారనీతికి వారిరాజ్యాంగ శాసనం సహకారో ఆనీతి భగ్నం చేదాం. పల్లెటూరంటే ఇన్నాళ్లు రాజ్యమేలేవారికి దూరం. కాంగ్రెసుకు పల్లెటూరిమీద ప్రాణం. పల్లెటూరి ప్రాబల్యం ఏర్పడితే పట్టణవాసవ్యామోహం పటాపంచలౌతుంది. బ్రిటిషు రాజనీతికి పట్టు తప్పుతుంది. గాంధీజీ ఈవిధమైన మార్గాన్ని కొన్ని యుదాహరణాలతో చూపించినాడు.

*　　*　　*　　*

ఇదంతా సాధించడానికి మహాసైన్యం కావలె. అది నిరాడంబరజీవితానికి అలవాటు పడవలె. సుశిక్షితం కావలె. శాసనతిరస్కారంరోజులలో కనుపించిన త్యాగశీలము పట్టుదల నిష్కామ సేవాదృష్టి నిర్మాణకార్యంలో కనుపించవలె. అప్పుడు శాసన తిరస్కారంతో పనిలేకుండా ఒక్క బొట్టు రక్తం చిమ్మకుండా నేటి రాజ్యాంగ శాసనమూ అంతరిస్తుంది. సంపూర్ణ స్వాతంత్ర్యము సాధితమౌతుంది. ఇది గాంధిమతం. మంత్రులు ప్రజలు దీనితో నేకీభవిస్తే క్షేమం, శాంతి.

### వైద్యశాలలు - గ్రంథాలయ సేవ:

గుంటూరుపట్టణ గ్రంథాలయ సంఘము వారు, ఆంధ్రదేశమున కపూర్వమగు పద్ధతి నొకదానిని అవలంబించి పనిచేయుచున్నారని చెప్పుటకు కడుసంతోషము. పైసంఘము వారు వైద్యశాలలందలిరోగులకు గ్రంథములను ఇచ్చి వారిచే చదివించుటకును, వృథాగా కాలయాపన చేయనక్కఱలేకుండ వారికి సద్గ్రంథముల శ్రవణము చేయించుటకును ఏర్పాట్లు చేయుచున్నారు. ఇందుకొఱకు వారు తిక్కన గ్రంథాలయమునుండి వారమునకొకపర్యాయము అధమపక్షము ౬ పుస్తకములను తీసికొని, వానిని డీ. ఎమ్. ఓ. ఆర్. ఎమ్. ఓ. ల వలన రోగులకు పంచిపెట్టుటకును, వారిచే చదువఁబడిన తరువాత తిరిగి రాఁబట్టుటకును, తలపెట్టినారు. వైద్యశాలలందు

గ్రంథాలయములను పెట్టుట, గ్రంథములను పంచిపెట్టుట అనుపద్ధతి విదేశములందు ప్రసిద్ధము. ఆంధ్రదేశమునందీపద్ధతిని ప్రవేశపెట్టిన కీర్తి తొలుత గుంటూరుపట్టణ గ్రంథాలయసంఘము వారికి దక్కఁగలదు. వారు దానిని సక్రమముగా నిర్వహింపఁగలరని నమ్ముచున్నాము. ఈప్రణాళిక ప్రవేశపెట్టుటకును పనిచేయుటకును ఉత్సాహమును చూపు శ్రీయుతులు మండలపర్తి ఉపేంద్రశర్మ (ఉపాధ్యక్షుఁడు) గుడివాడ పుల్లారావు (కార్యదర్శి)గార్లుఅభివందనీయులు. వీరిపూనికకు తోడ్పడుటకు పూజ్యులును రిటైర్డు డిప్యూటీ కలెక్టరునగు శ్రీ వత్యం భోగప్పశాస్త్రిగారు, పుణ్యమూర్తుల రాజశేఖరముగారు మున్నగు గ్రంథాలయాభిమానులు అంగీకరించినట్లు తెలియవచ్చినది. వీరియీసత్ప్రయత్నమునకు భగవంతుఁడు తోడ్పడి వీరిఈఆదర్శప్రణాళికను అత్యంత జయప్రదముగా కొనసాగునట్లు అనుగ్రహించుఁగాక!

ఖద్దరుసంస్థానము :

ఈ సంచిక ఖద్దరుసంస్థానదశవార్షికోత్సవ సంచిక అనుట మా చదువరులకు విదితమే. పది సంవత్సరములనుండి ఈసంస్థ ఆంధ్రదేశమునందలి ఇట్టి ఇతర సంస్థలకు తలమానికముగ పని చేసినదగుట ఈ సంచికఆరంభమున నిచ్చిన యభిప్రాయములను బట్టి తేలఁగలదు. భారతభూమిలో నెచ్చటను అమలునందులేని వస్తుమార్పిడివిధానమును ఈసంస్థ అమలులోపెట్టి సాగించుచున్నది. ఇటీవల మా గ్రంథాలయ సర్వస్వవిషయమున ఈసంస్థవారు కావించినసేవ యపారము. మాకును వీరికిని అభేదమని నుడువుటయందు తప్పేమియులేదు. వయోజనవిద్యాప్రచారమున వీరికిఁగల యభిమానమును వీరీ విధముగా వ్యక్తపఱచి ఆదర్శ గ్రంథాలయమును గూడ ఈ నడుమనే గుణదలలో స్థాపించినారు. వయోజన విద్యావ్యాప్తికి తగిన సేనను గ్రంథాలయసేవకు వలసిన బంటులను సుశిక్షితులను చేయుటకును మన దేశములోని నిరుద్యోగసమస్యను — విద్యావంతులకు సంబంధించిన మట్టుకైనను — తీర్చుటకును నడుముకట్టుటకు- ఇతరత్ర ఏమాత్రము సహాయము దొరకినను - ఈ సంస్థవారు సిద్ధముగా నున్నారనిన వీరి సంకల్పమెట్టిదో తేటపడును. తమకు ఆస్తి కోరమను వ్రతముపూని స్వయంసంపూర్ణజీవితమును తమ యాశ్రమమున నడపుచు ఆంధ్రజనసేవాదీక్ష ననుక్షణము సాగింప దృఢనిశ్చయులయిన ఈ యువక యువతీవర్గమునకు వసిష్ఠులు శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగా రగుటచేతను మాననీయ మూలవిరాట్టు గాంధీజీ యగుటచేతను-నేఁడేర్పడిన కాంగ్రెసుప్రభుత్వము ఆంధ్రదేశసేవకును శిక్షణమునకును ఈ సంస్థ కవలంబనము కల్గించి, అవకాశ మిచ్చెదరని విశ్వసించుచున్నాము. పెరుఁగునట్టి వృక్షములకు దోహదముచేసి, ఫలము రాల్చుకొనుటగదా కృషికుని బుద్ధికౌశల్యమునకు తార్కాణము!

# ఏలూరు అన్నదానసమాజము — Annadanasamajam, Ellore.

ఏలూరు, అన్న, వస్త్ర, వైద్య, విద్యాదానసమాజము 1913 సం॥ రమున స్థాపింపబడెను. ప్రభుత్వమువారు స్థలము ధర్మముగ నొసంగిరి. మ. రా. శ్రీ బొమ్మా రత్నంగారి ద్రవ్యసహాయమున భవనము నిర్మింపబడెను. ఇందు ప్రతిదినము అశక్తులకు అన్నదానము జరుగుచున్నది. ప్రతిసంవత్సరము 15 డిశంబరున బీదలకు వస్త్రదానము జరుగుచున్నది. వేసవికాలమున మంచినీళ్ల చలివేంద్రిలు పెట్టబడుచున్నవి. వైద్యదానము ప్రతిరోజు సాయంకాలము సమాజమువద్ద జరుగుచున్నది.

ఒకరోజు అన్నదానమునకు రు 60 లు ధర్మమిచ్చిన స్థిరాస్తులవల్ల వచ్చే ఆదాతో వారు కోరిన తేది 1 రోజున బీదలకు అన్నదానము జరుగును. వస్త్రదానము శాశ్వతనిధి ధర్మము రు 10 లు లగాయతు ఈయవచ్చును. ధర్మములకు రశీదులను, శాశ్వతనిధి ధర్మములకు రసీదులతోసహా పట్టాలను 5 గురు శాశ్వతధర్మకర్తలు (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. ఎల్లరు సహాయపడ గోరుచున్నాము. ఇతర వివరములకు :—

శాశ్వతధర్మకర్తలలోనివారు :— రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు కొత్తమాసు సీతారామయ్యగారు, (సోల్‌ట్రిస్టీలు) పసుమర్తి పురుషోత్తంగారు, (ప్రెసిడెంటు) మద్దుల వెంకట చినరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు) నున్నా గంగరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు) కందుల రామయ్యగారు, (సెక్రిటరీ)

# ఏలూరు, హిందూ యువజనసంఘము

## Youngmen's Hindu Association, Ellore.

ఈగ్రంథాలయము 1904 సం॥రమున స్థాపింపబడెను. 1918 సం॥రము సంఘమురిజష్టరు అయినది. 1928 సం॥రము మ. రా. శ్రీ రా. బ. మోతే గంగరాజు జమీందారుగారి ద్రవ్యసహాయమున నూతన దివ్యభవనము (రు 50,000 లు వెచ్చింపబడి) నిర్మింపబడినది. ఇందు దిన, వార, పక్ష, మాసపత్రికలు, ఆంగ్ల, ఆంధ్రభాషలయందు వచ్చుచున్నవి. ఆంగ్ల, ఆంధ్ర, సంస్కృత గ్రంథములు సుమారు 13 వేలవరకు గలవు. మ్యాజిక్‌లాంతరు, వ్యాసరచన పోటీపరీక్షలు, విషయనిర్ధారణ సభలు, వక్తృత్వపోటీపరీక్షలు ప్రతిసంవత్సరము జరుపుచు అందు తీర్ణులకు బహుమతు లొసంగబడుచున్నవి. ఇంకను గ్రంథములు, పత్రికలు తెప్పించవలసినవి యున్నవి. ఎలక్ట్రిసిటి, రేడియో అవసరము. ప్రతిసంవత్సరము ఆదాయమునకు మించిన వ్యయమగుచున్నది. కాన ఎల్లరు శక్తికొలది సహాయపడుడు. ధర్మములకు రశీదులను శాశ్వత ధర్మములకు రశీదులతోపాటు పట్టాలను, 5 గురు శాశ్వతధర్మకర్తల (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. క్యాటలాగులు అచ్చువేయబడెను.

ఇతర వివరములకు:—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు, (ధర్మకర్తృసభాధ్యక్షులు)
మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారు, (ధర్మకర్తృసభాగౌరవకార్యదర్శి)

వృద్ధాప్యమునందు మీకుగాని, తదనంతరము మీ యార్జనాసౌకర్యములను గోల్పోయిన మీ దారా పుత్రాదులకుగాని, సునాయాసము, సుఖప్రదమునగు జీవితము నేర్పరచునదియు, మిక్కిలిగ ఆధార పడతగినదియునగు పెట్టుబడి

"ప్రాణ భీమా"

గనుక, వెంటనే మీ జీవితములను 'ఓరియంటల్' కంపెనీలో భీమా చేయించి, మిమ్మును, మీ యను జీవులకును భవిష్యత్తు నేర్పరచుకొనుడు:—

వివరములకు:—

దిఓరియంటల్

గవర్నమెంటు సెక్యూరిటీ లైఫ్ ఎషూర్యారెన్సు కంపెనీ, లిమిటెడ్.

స్థాపితము 1874 లేక హెడ్ ఆఫీసు, బొంబాయి

బ్రాంచి సెక్రిటరీ, ఉత్తరసర్కార్లు, గోడేవారివీధి, విశాఖపట్నము లేక

కంపెనీతాలూకు దిగువ యే ఆఫీసున కయినను వ్రాయుడు—

ఆగ్రా, అజ్మీర్, అహమ్మదాబాద్, అలహాబాదు, అంబాల, అమృతసార్, బెంగులూర్, బెరియేలీ, బెల్లారి, కలకత్తా, కాలికట్, కోయంబత్తూరు, కొలంబో, ఢక్కా, ఢిల్లీ, గౌహతీ, గుంటూరు, జల్గాను, జల్పాయగురి, జోద్పూర్, జబ్బల్పూరు, కరాచీ, కోలాలంపూర్, లాహోరు, లక్నో, మద్రాసు, మాండలీ, మధుర, మెర్కారా, మొంబాసా, ముల్తాన్, మైసూరు, నాగపూరు, పాట్నా, పెషావరు, పూనా, రాయపూర్, రాజషాహి, రాంచీ, రంగూన్, రావల్పిండి, సింగపూరు, సుక్కూర్, తిరుచునాపల్లి, టెవేండ్రము, వెల్లూరు.

విలువ పెరుగుచున్నది.

1936 వ సంవత్సరంలో రు 10,26,30,496 ల కిమ్మతుగల 59,296 పాలసీలు.

1935 వ సంవత్సరంలో రు 8,89,89,149 ల కిమ్మతుగల 48,858 పాలసీలు.

పెంపుదల: పాలిసీలు 7,438; కిమ్మతు 1,36,41,347.

## Ellore Gosamrakshana Samithi.

## ఏలూరు గోసంరక్షణ సమితి, స్థాపితము 1918.

ది 22-9-36 న ఈ సంఘము రెజిస్టరయినది.

ఈ సమితియందు దిక్కులేని గోవులు రక్షింపబడును. పాలు ఉన్నయెడల చంటిబిడ్డలకు, దైవపూజలకు, బదలకు ఉచితముగ నిచ్చెదరు. పచ్చిగడ్డినిమిత్తము బీడుభూమి కొనవలసి యున్నది. మంచిస్థితిలోనికివచ్చిన గోవులను గృహస్థులకు అమ్మెదరు. గోశాలనిమిత్తము స్థిరమైన స్థలము అవసరము. ధర్మములకు రశీదులు, శాశ్వతనిధి ధర్మములకు రశీదులతోసహా అయిదు గురకు తక్కువగాని శాశ్వత ధర్మకర్తల [ రు 500 దాతలు ] సంతకములతో పట్టాలనిచ్చెదరు. అభిమానులెల్లరు శక్తికొలది శాశ్వతనిధిధర్మములేకాక వార్షికమామూళ్లుగను, నెల చందాలుగను వరిగడ్డి, తవుడు, విరాళములుగను సహాయపడి యీ సమితిఅభివృద్ధికి తోడ్పడ గోరుచున్నాము.

గోసంరక్షణసమితి ప్రచురణములకు, రూల్సుబుక్కులకు, రిపోర్టులు మున్నగువానికి:—

ఏలూరు 5—10—1936.

రా॥ బ॥ మోతే గంగరాజు జమీందారుగారు, ( ప్రెసిడెంటు, ట్రస్టి. )
మద్దుల వెంకట చినరాజుశ్రేష్ఠిగారు, ( వైస్ ప్రెసిడెంటు, ట్రస్టి. )
పోలిశెట్టి గోపాలస్వామిగారు, ( సెక్రిటరి, ట్రస్టి. )

బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు కుందా లక్ష్మీనరసయ్యగారిచే ముద్రింపబడినది.

# మనసు ఫౌండేషన్

## పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01A168 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 51 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | 3 |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Hema |
| పేజీలు విడదీసినది | Hema |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | Pragathi |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | Good |